# తెలుగు, బైబులు సామెతలు : ఒక తులనాత్మక పరిశీలనం

**(A Comparative Study of Telugu and Biblical Proverbs)**


పరిశోధకుడు

**గుజ్జుల అంతోని పీటర్ కిశోర్, ఎమ్.ఎ.**

పర్యవేక్షకులు

**ఆచార్య ఎండ్లూరి సుధాకర రావు**


పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి
పిహెచ్.డి. పట్టము కొరకు సమర్పించిన
సిద్ధాంత గ్రంథం


పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

సాహిత్యపీఠం

తెలుగు సాహిత్య అధ్యయన శాఖ - నన్నయ ప్రాంగణం

రాజమండ్రి, బొమ్మూరు - 533 124

అక్టోబరు - 2008

## హామీ పత్రం

'తెలుగు, బైబులు సామెతలు : ఒక తులనాత్మక పరిశీలనం' అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని ఆచార్య ఎండ్లూరి సుధాకర రావు గారి పర్యవేక్షణంలో నేనే స్వయంకృషితో రూపొందించాను. దీనిని పూర్తిగా కానీ పాక్షికంగా కానీ ఇంతకుముందు ఏ ఇతర పట్టము కోసము ఏ విశ్వ విద్యాలయానికీ, సంస్థకూ సమర్పించలేదని ఇందుమూలముగా హామీ ఇచ్చుచున్నాను.

గుజ్జుల అంతోని పీటర్ కిశోర్
పరిశోధకుడు

## ధ్రువీకరణ పత్రం

'తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం' అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని గుజ్జుల అంతోని పీటర్ కిశోర్ నా పర్యవేక్షణంలో స్వయం కృషితో రూపొందించారని, ఏ ఇతర పట్టము కోసం దీనిని పూర్తిగా కానీ పాక్షికంగా కానీ ఇంతకుముందు ఏ విశ్వవిద్యాలయానికి సమర్పించలేదని ధ్రువీకరించుచున్నాను.

ఆచార్య ఎండ్లూరి సుధాకరరావు
పర్యవేక్షకులు

# కృతజ్ఞతాంజలి

✤ 'తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం' మీద పరిశోధన చేయడానికి అనుమతించిన పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం సాహిత్యపీఠం, రాజమండ్రి ప్రాంగణం పాలక వర్గానికి . . .

✤ ఈ అవకాశం కల్పించిన మా ఆంధ్ర లొయోల (స్వయం ప్రతిపత్తి) కళాశాల, విజయవాడ, యాజమాన్య, పాలక వర్గాలకు . . .

✤ ఈ పరిశోధనలో అవసరమైన సూచనలు, సలహాలతో ప్రతిక్షణం ప్రోత్సహించిన సహృదయ పర్యవేక్షకులు ఆచార్య ఎండ్లూరి సుధాకరరావు గారికి . . .

✤ ఉపయుక్త గ్రంథ సేకరణంలో సహాయపడిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సహాయ గ్రంథాలయాధికారి డా॥ నిరీక్షణబాబు, మా కళాశాల గ్రంథాలయాధికారి డా॥ ప్రసాదరావు, మిత్రులు ఫాదర్ ఫిలమిన్‌రాజ్, ఎస్.జె., ఫాదర్ పాపయ్య, ఎస్.జె., గార్లకు . . .
మేనకోడలు చిరంజీవిని అనిత విజయశ్రీ కి. . .

✤ ఈ పరిశోధనలో నాకు సకల విధాల సహకరించిన గురుపుంగవులు పూదోట జోజయ్య, ఎస్.జె., గారికి, మా కళాశాల అధ్యాపకులు డా॥ జోబ్ సుదర్శన్, డా॥ కృపారావు గార్లకు . . .

✤ ఈ సిద్ధాంత గ్రంథానికి అక్షర రూపం కల్పించిన శ్రీ ప్రభాత్ గారికి

**హృదయపూర్వక కృతజ్ఞతాంజలి**

## విషయసూచిక

నా నుడి....................................................1

I. సైద్ధాంతిక నేపథ్యం

1. జానపద విజ్ఞానం ....................................................6

2. సామెత ....................................................14

II. తెలుగు, బైబులు సామెతలు: ఒక తులనాత్మక పరిశీలనం....................................................76

1. తెలుగు, బైబులు సామెతలు: మానవ స్వభావం....................................................78

2. తెలుగు, బైబులు సామెతలు: ఉపదేశం....................................................167

3. తెలుగు, బైబులు సామెతలు: సార్వత్రిక సత్యాలు ....................................................220

4. తెలుగు, బైబులు సామెతలు: నమ్మకాలు, విశ్వాసాలు .................... 275

5. తెలుగు, బైబులు సామెతలు: స్త్రీ ....................................................294

6. తెలుగు, బైబులు సామెతలు: వ్యవసాయం ....................................................312

7. తెలుగు, బైబులు సామెతలు: ఇతరాలు ....................................................319

ఉపసంహారం....................................................324

అనుబంధం....................................................326

ఉపయుక్త గ్రంథాలు....................................................348

# నా నుడి

ఇప్పటివరకు నేను చేసిన జీవిత ప్రయాణంలో వివిధ దశలలో ఇతర భాషలవారితో కలసి జీవించే భాగ్యం నాకు లభించింది. వారితో కలసి జీవించినపుడు తెలుగు భాషా సాహిత్యాల విద్యార్థినైన నేను సహజంగానే వారి భాషా సాహిత్యాల పట్ల ఆసక్తిని చూపేవాడిని. దీనివలన భాషా సాహిత్యాల గురించి అనుభవపూర్వకంగా నేను గ్రహించిన అనేక విషయాలలో ఒకటి సమానార్థకాలైన సామెతలు వివిధ భాషలలో ఉండడం. ఉదాహరణకు ఈ క్రింది సామెతలను పేర్కొనవచ్చు:

| | | | |
|---|---|---|---|
| 1. | తెలుగు | : | గాలి ఉన్నపుడే తూర్పారబట్టాలి |
| | కన్నడ | : | గాలి బందాగ్యె తూరికొళ్ళ బేకు |
| | తమిళం | : | కాట్రుళ్ళ పోదు తూట్రికొళ్ |
| | మలయాళం | : | కాట్రుళ్ళపోల్ తూట్టణమ్ |
| | హిందీ | : | సమయ్ కో దుర్లభ్ జానో |
| | ఇంగ్లిష్ | : | Make hay while the sun shines |
| 2. | తెలుగు | : | నిప్పు లేనిదే పొగరాదు |
| | కన్నడ | : | కిచ్చిల్లదె హొగయుంటె |
| | తమిళం | : | నెరుపల్లామల్ పుగయుమా? |
| | మలయాళం | : | తీయల్లాద్ పుగ ఉన్డావుక్ యిల్ల |
| | హిందీ | : | బినా ఘుం ఆ న ఆగ్ |
| | ఇంగ్లిష్ | : | No smoke without fire |
| 3. | తెలుగు | : | పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం |
| | కన్నడ | : | చెక్కిగె చెల్లాటె, ఇలిగె ప్రాణసంకట |
| | తమిళం | : | పూనైక్కు కొండాట్టమ్, ఎలిక్కు తిండాట్టమ్ |
| | మలయాళం | : | పూచక్కు విలయాట్టమ్, ఎలిక్కు ప్రాణసంకటమ్ |
| | హిందీ | : | చిడియోంకీ మౌత్ గవారోం కో హసీ |
| | ఇంగ్లిష్ | : | Sport to the cat, death to the rat |

| | | | |
|---|---|---|---|
| 4. | తెలుగు | : | మెరిసేదంతా బంగారం కాదు |
| | కన్నడ | : | హొళెయువుదెల్లా హొన్నల్ల |
| | తమిళం | : | మిన్నువదల్లా పొన్నల్ల |
| | మలయాళం | : | మిన్నున్న తెల్లాం పొన్నల్ల |
| | హిందీ | : | హర్ చమక్ తీ చీజ్ సోనా నహీ |
| | ఇంగ్లిష్ | : | All that glitters is not gold |
| 5. | తెలుగు | : | మొరిగే కుక్క కరవదు |
| | కన్నడ | : | బొగళో నాయి కచ్చుపుదిల్ల |
| | తమిళం | : | కురైక్కిరనాయి కడిక్కాదు |
| | మలయాళం | : | కురక్కుమ్ నాయి కటిక్కిల్ల |
| | హిందీ | : | గర్జనేవాలా బాదల్ బరసతా నహీ |
| | ఇంగ్లిష్ | : | A barking dog seldom bites |

ఇటువంటి సమానార్థక సామెతలు నా దృష్టికి చాలా వచ్చాయి. వీటికి కారణం కేవలం ఆయా భాషల మధ్యనున్న భౌగోళిక, రాజకీయ సాన్నిహిత్యమేనా, లేక ఇంకేదైనా ఉన్నదా అనే ప్రశ్నే నాకు సామెతల పట్ల ఆసక్తిని పెంచింది. ఈ ఆసక్తే సామెతల అధ్యయనానికి నన్ను నడిపించింది. ఆ అధ్యయనం సామెతలు మౌలికంగా మానవుల అనుభూతుల నుండి అనుభవాల నుండి పుడతాయన్న ఎరుకను కలిగించింది. ఆ ఎరుకే కతోలిక క్రైస్తవ యాజకుడిని కూడా అయిన నన్ను ఈ తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనానికి పురికొల్పింది. దీని ద్వారా తెలుగు ప్రజల, బైబులు ప్రజల అనుభూతులు, అనుభవాలు ఎలా ఉన్నాయో తెలుసుకోవాలన్నది నా ఉద్దేశం.

ఈ పరిశోధనా గ్రంథంలో రెండు భాగాలున్నాయి. మొదటిది, సైద్ధాంతిక నేపథ్యం. దీనిలో రెండు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం జానపద విజ్ఞానానికి సంబంధించినది. సామెతలు జానపద విజ్ఞానంలోని మౌఖిక జానపద విజ్ఞానానికి చెందిన కథారహిత వచన శాఖకు సంబంధించినవి. అందువలన ఈ అధ్యాయంలో ఎవరు జానపదులో, ఏది జనపదమో, జానపద విజ్ఞానమంటే ఏమిటో నిర్వచించి,

జానపద విజ్ఞాన స్వరూప స్వభావాలను, జానపద విజ్ఞానంలోని విభాగాలను, జానపద విజ్ఞానంలో ఇప్పటివరకు జరిగిన పరిశోధనలను గురించి స్థూలంగా వివరించాను.

రెండవ అధ్యాయం సామెతకు సంబంధించినది. ఈ అధ్యాయంలో మొదట వివిధ భాషలలో సామెతకున్న పేర్లను పేర్కొని, సామెతకు అరిస్టాటిల్ నుండి ఇప్పటి వరకు వచ్చిన ప్రసిద్ధి చెందిన నిర్వచనాలను సమీక్షించి, సామెత లక్షణాలను వర్గీకరణ పద్ధతులను వివరించాను. అటుపిమ్మట తెలుగు సామెత సైద్ధాంతిక నేపథ్యమున్నది. దీనిలో సామెత శబ్దవిచారం, తెలుగు సామెతకు పండితులు ఇచ్చిన వివిధ నిర్వచనాల సమీక్ష, తెలుగు సామెత లక్షణాలైన పోలిక, స్పష్టత, సంక్షిప్తత, శ్రావ్యత, ప్రాచుర్యత, అనుభవ మూలకత, ధ్వని, సాంప్రదాయికతలకు సంబంధించిన వివరణం, తెలుగు సామెతల పుట్టు పూర్వోత్తరాలు, స్వరూపం, వర్గీకరణ పద్ధతులకు చెందిన సమాచారమున్నది. ఆ తరువాత ఉన్నది బైబులు పరిచయం. దీని తరువాత హీబ్రూ సామెత మాషాల్‌కు సంబంధించిన సైద్ధాంతిక నేపథ్యమున్నది. దీనిలో మాషాల్ కున్న అర్థం, బైబులులో మాషాల్ పదప్రయోగం, మాషాల్ నిర్వచనం, నేపథ్యాలు, మూలాలు, లక్షణాలు, స్వరూపం గురించి వివరించాను. ఈ అధ్యాయంలో చివరగా సామెతల సేకరణం, అధ్యయనం, తెలుగు సామెతల సేకరణం, తెలుగు సామెతల మీద ఇప్పటివరకు జరిగిన పరిశోధనలను సమీక్షించాను.

ఈ పరిశోధనా గ్రంథంలో రెండవ భాగం తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనానికి సంబంధించినది. ఈ భాగంలో మొదటగా తులనాత్మక సాహిత్యం అంటే ఏమిటో స్థూలంగా వివరించాను. ఆ తరువాత సమానార్థకాలైన 215 తెలుగు, బైబులు సామెతలను వాటిలోని విషయాన్ని ఆధారంగా చేసుకొని 7 అధ్యాయాలలో పరామర్శించాను. ప్రతి అధ్యాయంలోని జంట సామెతలను తెలుగు సామెత ఆధారంగా అకారాది క్రమంలో పేర్చాను. ఈ తులనాత్మక పరిశీలనానికి ఎన్నుకున్న బైబులు సామెతలను 'పవిత్ర గ్రంథము–క్యాతలిక్ అనువాదము' నుండి గ్రహించాను.

ఈ తులనాత్మక పరిశీలనంలోని మొదటి అధ్యాయం 'తెలుగు, బైబులు సామెతలు: మానవ స్వభావం.' ఒక చేతి వ్రేళ్ళు ఒకేలాగా ఉండవు. అలాగే లోకములో ఉన్న మనుషుల స్వభావాలు కూడా ఒకేలాగా ఉండవు. అందువలన విభిన్న మానవ స్వభావాలకు చెందిన సమానార్థకాలైన 77 తెలుగు, బైబులు సామెతలను ఈ

అధ్యాయంలో పరిశీలించాను. సౌలభ్యం కొరకు వీటిని మానవ స్వభావం: సహనశీలత, స్నేహం, మూర్ఖత్వం, దౌష్ట్యం, వాక్శుద్ధి - వాచాలత్వం, కపటం, డంబం, సోమరితనం, దురాశ, కృతఘ్నత, లోభం, తారతమ్యం, చిన్నచూపు, అహం, ద్వంద్వ ప్రమాణం, భోజన ప్రియత్వం అను 16 ఉపవర్గాలుగా పునర్విభజించాను.

రెండవ అధ్యాయం 'తెలుగు, బైబులు సామెతలు: ఉపదేశం.' సామెతల ముఖ్య ప్రతిపాదనలు పలు రకాలు. కొన్ని నలుగురి గమనంలో ఉన్నదానిని ఉన్నట్లు చెప్పి ఊరుకుంటాయి. మరికొన్నిటిలో హితబోధ, ఉపదేశం కరతలామలకమై సామెత వినగానే చటుక్కున స్ఫురించే విధంగా ఉంటుంది. 'తినడానికి తిండి లేదు గాని తనవారికి తద్దినాలు', లేదా 'అప్పుచేసి పప్పుకూడు' అనగానే ఇక్కట్లలో ఉన్నప్పుడు డాబుసరి పనికిరాదు (సీరా 18:13) అనే హితోపదేశం ప్రత్యక్షమై ఆకట్టుకొంటుంది. ఈ కోవకు చెందిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలించాను.

మూడవ అధ్యాయం 'తెలుగు, బైబులు సామెతలు: సార్వత్రిక సత్యాలు.' సార్వత్రిక సత్యాలు ఎప్పుడైనా, ఎక్కడైనా - తెలుగు నేల మీదనైనా, ఇశ్రాయేలు కొండల మీదనైనా - ఒకే విధంగా ఉంటాయి. 'ఆకలి రుచి ఎరుగదు' 'పుట్టినవాడు గిట్టక తప్పదు' మొదలైనవి సార్వత్రిక సత్యాలు. ఇవి ఎక్కడైనా, ఎప్పుడైనా ఒకే విధంగా ఉంటాయి. ఈ అధ్యాయంలో పరిశీలించినది ఇలాటి సామెతల జతలనే.

నాలుగవ అధ్యాయం 'తెలుగు, బైబులు సామెతలు: నమ్మకాలు, విశ్వాసాలు.' ఈ అధ్యాయంలో నమ్మకాలు, విశ్వాసాలను గురించి చెప్పే సమానార్థకమైన తెలుగు, బైబులు సామెతలను పరిశీలించాను.

అయిదవ అధ్యాయం 'తెలుగు, బైబులు సామెతలు: స్త్రీ.' సామాజిక, కౌటుంబిక జీవితాలలో స్త్రీకి ముఖ్య స్థానమున్నది. తల్లిగా, తోబుట్టువుగా, భార్యగా, బిడ్డగా ఎన్నో రూపాలలో జీవించి మరెన్నో అనుభూతులకు కారణమయ్యే స్త్రీమూర్తి సామెతలలో ప్రఖ్యాత వస్తువు. అందువలన స్త్రీలకు సంబంధించిన సమానార్థక తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలించాను.

ఈ భాగంలోని చివరి రెండు అధ్యాయాలు చాలా చిన్నవి. అందుకు కారణం ఈ అంశాలకు చెందిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతలు తక్కువగా ఉండడమే.

వీటిలో ఆరవ అధ్యాయం ‘తెలుగు, బైబులు సామెతలు: వ్యవసాయా’నికి సంబంధించినది. వ్యవసాయం మానవ జీవనాధారం. అందువలన ప్రతి భాషలోనూ వ్యవసాయ సంబంధిత సామెతలుండడం సహజం. ఈ అధ్యాయంలో తెలుగు, బైబులు సామెతలలో వ్యవసాయానికి సంబంధించిన సమానార్థకాలైన అయిదు సామెతలను పరిశీలించాను.

ఏడవ అధ్యాయం ‘తెలుగు, బైబులు సామెతలు: ఇతరాల’కు సంబంధించినది. మొదట పరిశీలించిన ఆరు అధ్యాయాలలో ఒదగని సమానార్థకాలైన మిగిలిన తెలుగు, బైబులు సామెతలను ఈ అధ్యాయంలో పరిశీలించాను.

ఆ తరువాత తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనంలో నేను కనుగొన్న వాటిని ఉపసంహారంలో సంతరించాను. అటుపిమ్మట అనుబంధంలో పరిశీలించిన సమానార్థకాలైన తెలుగు, బైబులు సామెతల జాబితాను, చివరగా ఉపయుక్త గ్రంథాల పట్టికను పొందుపరిచాను.

# మొదటి భాగం: సైద్ధాంతిక నేపథ్యం

## 1. జానపద విజ్ఞానం

# I. సైద్ధాంతిక నేపథ్యం

## 1. జానపద విజ్ఞానం

"తన గతానికి గర్వించని జాతి గతించి పోతుంది" (A nation will perish unless it cherishes its past) అంటుంది ఒక ఆంగ్లసామెత. ఒక జాతి గతం గురించి తెలుసుకోవడానికి ఆ జాతి సంస్కృతి మూల సాధనం. సంస్కృతికి సమగ్ర నిర్వచనం ఇంత వరకు రూపొందలేదు. అందువలనే The New Encyclopaedia Britanica పదహారవ సంపుటం 874వ పుటలో క్రోయెబర్ (A.L.Kroeber), క్లైడ్ క్లుకోన్ (Clyde Kluckhohn) లు సంస్కృతికి 164 నిర్వచనాలను ఉటంకిస్తూ, భాషలు, భావాలు, నమ్మకాలు, ఆచారాలు, నిషేధాలు, స్మృతులు, వ్యవస్థలు, పనిముట్లు, కళలు, కర్మకాండలు, దుస్తులు, ఆటలు మొదలైనవన్నీ సంస్కృతిలో అంతర్భాగాలని పేర్కొన్నారు. స్థూలంగా సంస్కృతి అంటే ఆదిమానవుని కాలంనుండి నేటి నాగరిక మానవుని వరకు ఆయా కాలాలలో మనిషి తన అభ్యున్నతి కొరకు చేసిన కృషి అని భావించవచ్చు.[1]

సంస్కృతిని అది ప్రవర్తిల్లిన కాలాన్ని బట్టి, ప్రాంతాన్ని బట్టి 1. ఆటవిక 2. జానపద 3. నాగరిక సంస్కృతులుగా విద్వాంసులు విభజించారు. మనిషి సంచార జీవిగా అడవులలో వేట ద్వారా తన ఆహారాన్ని సంపాదించుకున్న దశకు చెందినది ఆటవిక సంస్కృతి. మనిషి స్థిర నివాసాన్ని ఏర్పరచుకొని తన ఆహారాన్ని తాను ఉత్పత్తి చేసుకున్న దశకు చెందినది జానపద సంస్కృతి. మనిషి సాంకేతిక విజ్ఞానంతో, యాంత్రికాభివృద్ధితో జీవిస్తున్న ప్రస్తుత దశకు చెందినది నాగరిక సంస్కృతి. వీటిలో జానపద సంస్కృతికి సంబంధించినదే జానపద విజ్ఞానం.

జానపద విజ్ఞానుల వర్గీకరణం ప్రకారం సామెతలు జానపద విజ్ఞానం లోని మౌఖిక జానపద విజ్ఞానానికి చెందినవి. అందువలన ఈ అధ్యాయంలో జానపద విజ్ఞానం అంటే ఏమిటో, దానిలోని విభాగాలేమిటో స్థూలంగా తెలుసుకుందాం.

---

1 ఆర్వీయస్.సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.1

జానపద విజ్ఞానాన్ని ఇంగ్లీష్ లోని "ఫోక్‌లోర్" (Folklore) కు సమానార్థకంగా మనం తెలుగులో వాడుతున్నాం. "ఫోక్‌లోర్" అనే పదాన్ని విలియం జాన్ థామ్స్ - William John Thoms - (1803-85) క్రీ.శ 1846 లో రూపొందించాడు. ఇది క్రీ.శ. 1787లో జోసెఫ్ మాదెర్ - Josef Mader- (1754 - 1815) ఉపయోగించిన "Volks kunde" అను జర్మన్ పదానికి ఆంగ్లానువాదం. జాన పదులకు చెందిన ఆచారాలు, నమ్మకాలు, కథాగేయాలు, సామెతలు మొదలైన వాటిని సూచించడానికి థామ్స్ "ఫోక్‌లోర్" ను వినియోగించాడు.[2]

జానపద దశ నుండి వస్తున్న ఆచారాలను, నమ్మకాలను, సంప్రదాయాలను ఇప్పటికీ కొనసాగిస్తున్న ప్రదేశాన్ని జనపదం అని చెప్పుకోవచ్చు. అందుకే జానపద విజ్ఞానం 'సజీవ శిలాజం' (Living Fossil) వంటిదని విద్వాంసులు పేర్కొన్నారు. అంటే నేటి నాగరిక సమాజంలో ఉండడానికి వీలుకాని సంప్రదాయాలను, ఆచారాలను జనపదం కాపాడుతుందని, అందుకే అది సజీవ శిలాజం వంటిదని వారి అభిప్రాయం. కాబట్టే "జానపద విజ్ఞానం గతానికి చెందిన ప్రతిధ్వనీ, వర్తమానానికి చెందిన శక్తిమంతమైన గొంతుక" అని ప్రముఖ జానపద విద్వాంసుడు రిచర్డ్ ఎమ్.డార్సన్ అన్నాడు.[3]

కాని, 19వ శతాబ్దంలో "ఫోక్‌లోర్" లోని 'ఫోక్' ను నిర్వచించిన విద్వాంసులు జానపదులంటే విద్యావిహీనులైన కర్షక జనులనీ, గ్రామీణులనీ అభిప్రాయపడ్డారు. జానపద విజ్ఞానానికి సంబంధించిన వివిధ విషయాలు నేటికీ ఎక్కువగా గ్రామాలలోనే లభిస్తున్నాయనడంలో సందేహం లేదు. అంత మాత్రాన అవి నగర ప్రాంతాలలో ఉండవని మనం భావించలేము. ఉదాహరణకు నేడు ఒక జనసమూహానికి చెందిన వారు పల్లెలలో ఉన్నా, పట్టణాలలో ఉన్నా పుట్టుట దగ్గర నుండి గిట్టుట వరకు పాటించే ఆచారాలు, సంప్రదాయాలు ఒకే తీరులో ఉండడాన్ని మనం గమనిస్తున్నాం.

---

2 cf.The Anchor Bible Dictionary,ed. David Noel Freedmann (Doubleday, New York, 1992) Vol.2, p818.

3 "Folklore is an echo of the past, but at the same time it is also the vigorous voice of the present", Folklore and Folklife, Introduction, Richard M. Dorson (ed.), 1972, p.17 as quoted by ఆర్వీయస్.సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 20

అందుకే జానపదులను గ్రామీణులు , కర్షకులు, నిరక్షరాస్యులు, అనే పరిమితార్థంలో పండితులు నేడు భావించడం లేదు.

కాబట్టి ప్రసిద్ధ జానపద విద్వాంసుడైన ఆలెన్ డండెస్ జానపదులంటే 'ఏదైనా ఒక విషయంలోనైనా భావసామ్యం కలిగిన జనసముదాయం' అని నిర్వచిస్తూ, 'వీరు ఒకే వృత్తికి, భాషకు, మతానికి సంబంధించిన వారు కావచ్చు; అయితే ఈ జన సముదాయం తమదే అని చెప్పుకోగలిగిన కొన్ని సంప్రదాయాలు కలిగి ఉండాలి' అని వివరించాడు.[4] (The term 'folk' can refer to any group of people whatsoever, who share at least one common factor. It does not matter what the linking factor is -it could be a common occupation , language or religion - but what is important is that a group formed for whatever reason will have some traditions which it calls its own.)

ఈ విధంగా చూచినపుడు సమాన సంప్రదాయాలు కలిగిన ఆటవికులైనా, గ్రామీణులైనా, నగరవాసులైనా జానపదులే అవుతారని చెప్పవచ్చు.

జనపదానికి సంబంధించినదే జానపదం. అంటే జనపదంలో సృష్టి అయ్యేదంతా జానపదమే. జానపదానికి సంబంధించిన విజ్ఞానమే జానపద విజ్ఞానం. కాబట్టి జానపద విజ్ఞానం చాలా విశాలమైనది. జీవితానికి, సంస్కృతికి సంబంధించిన అన్ని విషయాలను తనలో ఇముడ్చుకోగలినంత విస్తృత పరిధి కలది. ప్రామాణిక జానపద నిఘంటువు (Standard Dictionary of Folklore) లో దీనికి 21 నిర్వచనాలు కనిపిస్తాయి. జాన్ హెరాల్డ్ బ్రున్ వాండ్ ఇచ్చిన నిర్వచనం అన్నిటికన్నా సమంజస మైనదిగా కనిపిస్తుంది. ఈ నిర్వచనం ప్రకారం జానపద విజ్ఞానమంటే "మౌఖికంగా కాని, రూఢాత్మకంగా కాని ఏదైనా ఒక జనసమూహంలో వివిధ రూపాలతో సాంప్రదాయకంగా ప్రసారమయ్యే సాంస్కృతిక సంబంధమైన విషయాలు."[5]

**అ. జానపద విజ్ఞానం - స్వరూప స్వభావాలు:** నిర్వచనాన్ని బట్టి జానపద విజ్ఞానం స్వరూప స్వభావాలను కొంతవరకు తెలుసుకోవచ్చు.

---

4 The Study of Folkore, Alan Dundes (Ed), 1965,p2. as Quoted by ఆర్వీయస్.సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,హైదరాబాదు, 1983, పు. 20

5 Jan Harold Brunvand,(1968) The Study of American Folklore, Quoted by P.R Subrahmanyam in 'An Introduction to the Study of Indian Folklore' , 1972, p. 47

**1. సంస్కృతికి సంబంధించిన విషయాలు:** జానపద విజ్ఞానం సంస్కృతికి సంబంధించినది. జానపద విజ్ఞానానికి చెందిన గేయాలు, కథలు, సామెతలు, నమ్మకాలు, ఆభరణాలు , పండుగలు, కళలు మొదలైనవన్నీ మానవ సంస్కృతిలో భాగాలే. సంస్కృతిలో భాగం కానిది జానపద విజ్ఞానంలో ఏదీ లేదు.

**2. ఏ జనసముదాయంలోనైనా సాంప్రదాయకంగా ప్రసారమయ్యేవి:** జానపద విజ్ఞానంలో చేరాలంటే ఆ విషయాలు ఏ ఒక్కరో సృష్టించినవీ, ఆ ఒక్కరి పేరుతోనే చెలామణి అయ్యేవీ కాకూడదు. ఒక జనసముదాయంలో అవి ప్రచారమవుతుండాలి. ఇవి సాంప్రదాయకమైనవి కూడా కావాలి. ఒక తరంనుండి మరో తరానికి కొన్ని విషయాలు సంక్రమించినపుడే సంప్రదాయ మన్నది ఏర్పడుతుందని ఇక్కడ గమనించాలి.

**3. వివిధ రూపాలు కలిగి ఉండడం:** జానపద విజ్ఞానానికి ఒక ప్రామాణిక రూపం అంటూ ఉండదు. ఎందుకంటే ఒకే రూపం ఉంటే అది ఒక వ్యక్తికి సంబంధించినది అవుతుంది.అలా కాకుండా ఎవరు రూపొందించినదైనా అది జనుల నోళ్లలో నలిగి, వారికి ఇష్టమై , తరతరాలుగా వాడుకలో ఉండి, రూపాంతరాలు పొందినపుడే అది జానపద విజ్ఞాన విషయమవుతుంది. అంటే ఒక జానపద విజ్ఞాన విషయానికి ఎన్ని ఎక్కువ రూపాలుంటే అది అంత చెలామణిలో ఉన్నదని అర్థం. ఇలా రూపాంతరాలు ఉండడం జానపద విజ్ఞాన లక్షణాలలో ఒకటి.

**4. మౌఖికంగా కాని , రూఢాత్మకంగా కాని ప్రసారం కావడం:** మౌఖికంగా ప్రసారమయ్యేదే జానపద విజ్ఞానమని పలువురు విద్వాంసులు చాలా కాలం భావించారు. అందువల్ల గేయం, కథ, సామెతలాంటి మౌఖికరూపాలను మాత్రమే జానపద విజ్ఞానంగా భావించారు. కాని, ఇటీవలి విద్వాంసులు జానపద విజ్ఞానంలో మౌఖికేతర ప్రక్రియలు కూడా చేరాలనే సంగతిని ఒత్తి చెబుతున్నారు. అందువలన నమ్మకాలు,ప్రదర్శనకళలు మొదలైనవి కూడా జానపద విజ్ఞానంలో చేరడానికి వీలవుతున్నది. వీటిలో వృత్తి సంబంధమైన పనులు,కళలు మొదలైన వాటిని నోటితో చెప్పనవసరం లేకుండానే చూచి నేర్చుకోవచ్చు. రూఢివల్ల తెలుసు కోవచ్చు. అందువల్ల మౌఖికేతరమైన ప్రసారం కూడా జానపద విజ్ఞాంలో ఉన్నదని విద్వాంసులు గుర్తించారు.

**ఆ. జానపద విజ్ఞాన విభాగాలు :** జానపద విజ్ఞానాన్ని సమగ్రంగా అవగతం చేసుకోవాలంటే దానిని విభాగాలుగా వర్గీకరించి విశ్లేషించాలి. ఆర్.ఎస్. బాగ్స్

ప్రామాణిక జానపద విజ్ఞాన నిఘంటువు (Standard Dictionary of Folklore) లో జానపద విజ్ఞానంలోని విభిన్న అంశాలను కొన్ని గణాలు(Groups)గా, ఈ గణాలలో ఒక్కొక్క దానిని కొన్ని వర్గాలు (Categories)గా, ఒక్కొక్క వర్గాన్ని కొన్ని మాదిరులు (Types)గా, ఒక్కొక్క మాదిరిని కొన్ని ప్రక్రియలు (Forms)గా, వాటిని కొన్ని విభాగాలు (Divisions)గా సూక్ష్మాతి సూక్ష్మంగా విభజించి పరిశీలించాడు.[6]

రిచర్డ్ ఎమ్. డార్సన్ (Richard M. Dorson) జానపద విజ్ఞానాన్ని స్థూలంగా, శాస్త్రీయంగా నాలుగు విభాగాలుగా విభజించాడు. ప్రస్తుత పరిశోధనకు ఈ విభజన చాలు కాబట్టి ఆ విభాగాలను గురించి తెలుసుకుందాం.

**1. మౌఖిక జానపద విజ్ఞానం** (Oral Folklore): ఈ విభాగంలో జానపద గేయాలు, కథాగేయాలు (Ballads), పురాణాలు (Myths), కథలు (Tales), సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవి ఉంటాయి.

**2. సాంఘిక జానపద ఆచారాలు** (Social Folk Customs): పుట్టుక, వివాహం, మరణం మొదలగు వానికి చెందిన ఆచారాలు, కుటుంబం, సంబంధ-బాంధవ్యాలు, పండుగలు, నోములు, ఆటలు, వినోదాలు, జానపద వైద్యం, మతం, నమ్మకాలు మొదలైనవి ఈ విభాగంలో చేరతాయి.

**3. వస్తు సంస్కృతి** (Material Culture): భౌతిక జీవితానికి సంబంధించిన వస్తువులన్నీ ఈ విభాగంలో స్థానం పొందుతాయి. అంటే చిత్రకళ, శిల్పం లాంటి వస్తుకళలు, వివిధ వృత్తులకు చెందిన పరికరాలు, దుస్తులు, ఆభరణాలు, ఆహారసామాగ్రి, పూజాసామాగ్రి మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి.

**4. జానపద కళలు** (Folk Arts): సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి.[7]

**ఇ. జానపద విజ్ఞానంలో పరిశోధనలు** : 18 వ శతాబ్దం నుండి జానపద విజ్ఞానంలో పరిశోధనలు ముమ్మరంగా సాగుతున్నాయి. నాటి నుండి నేటిదాకా జరిగిన

6 Standard Dictionary of Folklore, Mythology and Legend, Maria Leach(ed.),1975,pp1138-1147. As quoted by ఆర్వీయస్.సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.6

7 Richard M.Dorson (1972), Folklore and Folk Life(Ed.) Quoted by ఆర్వీయస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.5

పరిశోధనలు కొన్ని సిద్ధాంతాలుగా పరిణామం చెంది తరువాత పరిశోధకులను ప్రభావితం చేశాయి. వాటిని గురించి సంక్షిప్తంగా తెలుసుకొందాం.

**1. పురాణమూల సిద్ధాంతం** (Mythological Theory) : గ్రిమ్ సోదరులు జర్మన్ జానపద కథలను సేకరించి వాటి పుట్టుక, అర్థం, వ్యాప్తి, కథలలో పాఠాంతరాలు, కథలలో పరస్పర సంబంధం, మొదలైన అంశాలను మొట్టమొదటసారిగా అధ్యయనం చేశారు. వీరు భాషా శాస్త్రవేత్తలు కూడా కావడం వల్ల వీళ్ళు తమ దృష్టిని ఇండో యూరోపియన్ భాషల మీద కేంద్రీకరించారు. జానపద కథ ఏదైనా ఒక స్థలంలో, ఒక కాలంలో ఆవిర్భవించి మౌఖిక రూపంలో ప్రవర్తించి ప్రపంచమంతట వ్యాపిస్తుందని వీళ్ళు భావించారు. వీళ్ళు అధ్యయనం చేసిన జర్మన్ కథలు ఇండో-యూరోపియన్ భాషా కుటుంబంలో కనిపిస్తుండడం వల్ల భాషామూలాన్నే కథామూలానికి కూడ అన్వయించి ప్రపంచంలోని అన్ని కథలు ఇండో యూరోపియన్ భాషలు మాట్లాడే ప్రజలు నుండే వచ్చి ఉంటాయని వీళ్ళు విశ్వసించారు. పురాణాలన్నీ ముక్కలుగా విడివిడి కథలకు మూలమైనాయనే పురాణమూల సిద్ధాంతాన్ని వీళ్ళు ప్రతిపాదించారు. మేక్స్ ముల్లర్ మొదలైన పండితులు ఈ సిద్ధాంతాన్ని ఆదరించారు.

**2. మానవ విజ్ఞాన సిద్ధాంతం** (Anthropological Theory) : ఈ సిద్ధాంతానికి సంబంధించిన పరిశోధకులు జానపద సమాజంపై, సంస్కృతిపై తమ దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించారు. వలసలు, ఆదానాలు, అవిచ్ఛిన్న సంప్రదాయాలు వీళ్ళ సిద్ధాంతాలలో ముఖ్యమైన అంశాలు.

ఆటవిక/అనాగరిక (Savage), జానపద/మధ్య నాగరిక (Barbarism) దశల నుండి మానవుడు ప్రస్తుత నాగరిక దశకు అభివృద్ధి చెందాడని వీళ్లు విశ్వసించారు. సామాజిక వివాహాలు ఆటవిక/అనాగరిక, జానపద/మధ్యనాగరిక సమాజాలకు, ఏకపత్నీ వ్రతం నాగరిక సమాజాలకు గుర్తుగా వీళ్లు భావించారు.

జానపద విజ్ఞాన అభివృద్ధిలో మానవ విజ్ఞాన పరిశోధకుల కృషి గణనీయమైనది. విలియం ఆర్. బాస్కమ్ మొదలైనవాళ్ళు ఈ రంగంలో ముఖ్యమైనవాళ్ళు.

**3. మనోవిశ్లేషణ సిద్ధాంతం** (Psychoanalytical Theory) : ఫ్రాయిడ్ మొదలైన మనో విశ్లేషణ శాస్త్రజ్ఞులు మానవునిలో బలవంతంగా అణచి వేయబడిన కోరికలే, సమాజవిరుద్ధ వాంఛలే పురాణాలకు, కాల్పనిక కథలకు మూలాలని వాదించారు.

ఈడిపస్ భ్రాంతి (Oedipus Complex) ని ఆవిష్కరించడానికి ఫ్రాయిడ్ జానపద కథలను ఉపయోగించుకున్నాడు. అద్భుత కథలు కలల నుండి రూపుదిద్దుకొంటాయని యూంగ్ పేర్కొన్నాడు. జానపద విజ్ఞానం ద్వారా మానవ స్వభావాన్ని అర్థం చేసుకోవ డానికి ఈ పరిశోధనలు ఉపకరిస్తాయి.

**4. నిర్మాణ సిద్ధాంతం** (Structural Theory) : రష్యా దేశానికి చెందిన వ్లాదిమిర్ ప్రాప్ నిర్మాణవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కథలను మూల విషయాల (Themes) ఆధారంగా వర్గీకరించడంకన్నా నిర్మాణాలను అనుసరించి వర్గీకరించడం వలన అర్థవంతమైన ఫలితాలు ఉంటాయని ప్రాప్ వాదించాడు. ప్రాప్ రష్యా దేశ జానపద కథలను విశ్లేషించి "Morphology of Folk Tales" అనే గ్రంథాన్ని ప్రచురించాడు. జానపద కథలన్నింటికీ ఒక నిర్దిష్ట నిర్మాణం ఉంటుందనీ, ఈ నిర్మాణం కథల మాదిరులను సూచిస్తుందనీ ప్రాప్ గ్రహించాడు. కథలో పాత్రలు మారుతుంటాయి. అయితే క్రియ (Function) మాత్రం స్థిరంగా ఉంటుందనీ, ఒక క్రియ మరొక క్రియని నిర్దిష్ట విధానంలో అనుసరిస్తుందనీ, ఈ నిర్దిష్ట విధానమే ఆ కథల రచనాత్మక రూపం అనీ సిద్ధాంతీకరించాడు. ఆలెన్ డండెస్ ప్రాప్ సిద్ధాంతంచే ప్రభావితుడై పరిశోధనలు సాగించి జానపద కథల్లో నాలుగు అంశాలను గుర్తించాడు.

అవి 1. లోటు (Lack) 2. వంచన (Deceit) 3. వంచన ఫలించడం (Deception) 4. లోటు తీరడం (Lack Liquidated) .

**5. వలస సిద్ధాంతం** (Migrational Theory) : తియోడోర్ బెన్ఫె అనే జర్మనీ శాస్త్రజ్ఞుడు వలస సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. పంచతంత్రపు కథలను అనువదించిన బెన్ఫె ప్రాణి కథలకు తప్ప మిగిలిన అన్ని కథలకు భారతదేశమే పుట్టినిల్లని (Indian Origin Theory) వాదించాడు. భారతదేశంలోని కథలకు యూరపు దేశపు కథలకు సామ్యాలను గుర్తించి ఈ కథలన్నీ హిందూ, బౌద్ధ సాహిత్యాల నుండి వచ్చాయని, భారతదేశం నుండి ఇతర దేశాలకు వలస వెళ్లాయని చెప్పాడు. ఈయన సిద్ధాంతానికి వలస సిద్ధాంతం అని పేరు.

**6. ఫిన్నిష్ సిద్ధాంతం** (Finnish Theory): ఫిన్లాండు దేశస్థుడు జూలియస్ క్రోన్ (Julius Khrohn) అతని కుమారుడు కార్లే క్రోన్ (Kaarle Khrohn) ఇరువురూ జానపద కథల అధ్యయనంలో చారిత్రక భౌగోళిక పద్ధతి (Historical Geographic Method) ని అనుసరించారు. కథ మూలరూపాన్ని పునర్నిర్మించడం లోను, రూపాంతరాల

మధ్యనున్న చారిత్రక భౌగోళిక సంబంధాలను గుర్తించడం లోను ఈ పద్ధతి ఉపయోగిస్తుంది. వీరిద్దరి కృషి ఫలితంగా జానపద విజ్ఞానంలో తులనాత్మక అధ్యయనం పెద్ద ఎత్తున ప్రారంభమైంది.

రిచర్డ్ ఎమ్. డార్సన్, క్లాడ్ బ్రెమోండ్, ఎడ్మండ్ లీచ్, సి.ఎమ్. బౌరా మొదలైన వాళ్ళు జానపద విజ్ఞానంలో పరిశోధనలు పెద్ద ఎత్తున సాగించారు. ఫ్రెంచి దేశానికి చెందిన లెవి స్ట్రాస్ ప్రతిపాదించిన కథా నిర్మాణ విశ్లేషణా విధానం జానపద విజ్ఞాన పరిశోధనా రంగంలో నూతన శకాన్ని ప్రారంభించింది.

### ఈ. జానపద విజ్ఞాన ప్రయోజనాలు:

మానవ సామాజిక, సాంస్కృతిక జీవితాలను ప్రతిబింబించే జానపద విజ్ఞానం వలన ఈ క్రింది ప్రయోజనాలున్నట్లు ఆచార్య ఆర్.వి.యస్. సుందరం గారు గుర్తించారు.[8]

1. జానపద విజ్ఞానం జానపదులకు శ్రమను తగ్గించి ఉల్లాసాన్ని, ఆనందాన్ని కలిగిస్తుంది.
2. జానపద విజ్ఞానం తరతరాల సంస్కృతిని కాలగర్భంలో కలిసిపోకుండా కాపాడుతుంది.
3. జానపద విజ్ఞానంలోని పొడుపు కథలు మానవులకు బుద్ధి వికాసాన్ని, సామెతలు జీవిత అనుభవాలను, వీరగాథలు ధైర్య సాహసాలను, జానపద కళలు కళాత్మక హృదయాన్ని అందించి మానవుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడతాయి.
4. జానపద విజ్ఞానం మానవ సమాజంలో నిషిద్ధమైన వాటికి అవకాశం కల్పిస్తుంది.
5. జానపద విజ్ఞానంలోని అనేక అంశాలు శిష్ట సాహిత్యంలో ప్రవేశించి దానిని సుసంపన్నం చేస్తాయి.

ఇదీ జానపద విజ్ఞాన సంక్షిప్త సైద్ధాంతిక నేపథ్యం. ఈ నేపథ్యంతో సామెతను గురించి తరువాత అధ్యాయంలో తెలుసుకుందాం.

---

[8] ఆర్వీయస్. సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.12-14

# మొదటి భాగం: సైద్ధాంతిక నేపథ్యం

## 2. సామెత

# 2. సామెత

సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు అంటుంది ఒక తెలుగు సామెత. సామెత లేని మాట విందు లేని ఇల్లు లాంటిదని దీని అర్థం. "భోజనానికి ఉప్పులాంటిది భాషకు సామెత" – A proverb is to speech what salt is to food - అంటుంది ఇంకొక అరబిక్ సామెత. "సామెత వేదంతో సమానం" – గాదె వేదక్కె సమాన - అంటుంది వేరొక కన్నడ సామెత.[1] "ఒక దేశాన్ని దాని సామెతల వైశిష్ట్యంతో అంచనా వేయుము" – Judge a country by the quality of its proverbs - అని ఒక జర్మన్ సామెత అంటే, "ఒక వ్యక్తి శీలాన్ని ఆ వ్యక్తికి ఇష్టమైన సామెతలతో అంచనా వేయుము" – Judge a person by his favourite proverbs - అంటుంది ఇంకొక ఫ్రెంచి సామెత.[2] సామెతలను గురించి ఉన్న ఇటువంటి సామెతలు వాటి గొప్పతనాన్ని చెప్పకుండానే చెబుతుంటాయి. ఒక జాతి అనుభవాలకు, ఆలోచనలకు అద్దం పడుతూ, సూక్ష్మంలో మోక్షం చూపించే, అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని అందించే సామెత స్వరూప స్వభావాలను గురించి ఈ అధ్యాయంలో తెలుసుకుందాం.

మొదటి అధ్యాయంలో చూచిన విధంగా జానపద విజ్ఞానం సంస్కృతిలో ఒక భాగం. మౌఖిక జానపద విజ్ఞానం ఆ జానపద విజ్ఞానంలో ఒక భాగం. సామెత ఈ జానపద మౌఖిక విజ్ఞానంలో ఒక భాగం.

## అ. వివిధ భాషలలో సామెత :

భాష సజీవమైనది. సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు ఆయా భాషల ఔన్నత్యానికి మచ్చు తునకలు. ఇవి లేని భాషలు ఉండవంటే బహుశః అతిశయోక్తి కాకపోవచ్చు. అందువలన కొన్ని భాషలలోనైనా సామెతకు ఉన్న సమాన పదాలను తెలుసుకుందాం.

సంస్కృతం: సుభాషితం, సూక్తి, లోకోక్తి; ప్రాకృతం : గాహె (గాథా శబ్దతద్భవం); ఆంగ్లం: Proverb; గ్రీకు: Paroemia; లాటిన్: Proverbium; ఐరిషు: Sean fhocal; టర్కిషు: Atlaler sozir; హంగెరి: Pelda begged; అరబిక్: Mathal; చీనీ: సుహా,

---

[1] జి.ఎస్. మోహన్, సామెతలలో సాంఘిక జీవితం, శ్రీనివాస పబ్లికేషన్స్, అనంతపురం, 1983, పు.7

[2] టి.వి.రామనర్సయ్య, తెలుగు సామెతలు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1994, పు.14

సయీ; హీబ్రూ: మాషాల్ ; బల్గేరియా: పోస్లోవినా ; హిందీ: కహావత్; కన్నడం: గాదె, నాణ్ణుడి, లోకోక్తి, శాస్త్ర, సామతి; తుళు: గాదె; కొడవ: గాది; తమిళం: పళమొళి; మలయాళం: పళంచొల్, పళచొల్లు. [3]

## ఆ. సామెత – నిర్వచనం:

అరిస్టాటిల్ నుండి నేటి వరకు పలువురు దేశ, విదేశీ సాహిత్య వేత్తలు, సామెతల సంగ్రహకారులు సామెతలను అనేక విధాలుగా నిర్వచించారు. వాటిలో కొన్ని ముఖ్య నిర్వచనాలను ఇప్పుడు చూద్దాం.

"A proverb is a remnant from old philosophy, preserved amidst countless destructions by reason of its brevity and fitness for use" - Aristotle

సంక్షిప్తత, ప్రయోగార్హత కారణాలుగా అసంఖ్యాకమైన ఆటుపోట్లకు మారొడ్డి నిలిచిన ప్రాచీన జిజ్ఞాసావశేషమే సామెత.

"Short sentences drawn from long experience" - Cervantas

తరతరాల అనుభవం సృష్టించిన సంక్షిప్త వాక్యాలు సామెతలు.

" The wisdom of many and the wit of one" - Russel

అనేక మంది జ్ఞానం, ఒకని చమత్కారం సామెత.

" A short, pithy saying in common and recognised use" - The Oxford Dictionary of English Proverbs

సార్వజనీనమై గుర్తింపబడిన, సారవంతమైన, సంక్షిప్త వ్యక్తీకరణమే సామెత.

"A short, pithy saying presenting in a striking form a well known truth" - Encyclopaedia Americana

ఒక ప్రసిద్ధ సత్యాన్ని ఉటంకించే సంక్షిప్త సారవంతమైన వాక్యమే సామెత.

"A proverb is a short wise saying, which has been accepted into current speech and writing" - African Encyclopaedia

నేటి సంభాషణలో, సాహిత్యంలో అంగీకరింపబడిన సంక్షిప్త వివేకయుతమైన పలుకే సామెత. [4]

---

3 జి.ఎస్. మోహన్, సామెతలలో సాంఘిక జీవితం, శ్రీనివాస పబ్లికేషన్స్, అనంతపురం, 1983, పు.4

4 పాపిరెడ్డి నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జన జీవనం, శ్రీనావాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి 1983, పు.1-2

పై నిర్వచనాలలోని వైవిధ్యాలను సాధ్యమైనంతవరకు సూత్ర రూపంలోకి కుదిస్తూ రోజర్ డి. అబ్రహామ్స్ సామెతను ఈ విధంగా నిర్వచించాడు: "సామెతలు సంక్షిప్తంగా, వివేకయుతంగా ఉండే సాంప్రదాయిక అభివ్యక్తులు." - Proverbs are short and witty traditional expressions [5]

**ఇ. సామెత – లక్షణాలు:**

జాన్ వార్డ్ సామెతల లక్షణాలను ఐదింటిని పేర్కొన్నాడు. అవి : 1. సంక్షిప్తత, 2. స్పష్టత, 3. ప్రాచుర్యత, 4. ఆలంకారికత, 5. ప్రాచీనత – Rev. John Ward, Vicar of Stratford, in the reign of Charles II declared that for a proverb five things are essential. It must be 1. Short, 2. Clear 3.In Common Use 4. Figurative in Expression and 5. Ancient [6]

వీటిని, పైని పేర్కొనిన సామెత నిర్వచనాలను అనుసరించి సామెతల లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

1. సంక్షిప్తత : భాషా ప్రమేయం లేకుండా సంక్షిప్తంగా ఉండడం సామెతల ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. సాధారణంగా సామెతలలో ఒక వాక్యం గాని, ఒక పరిమాణం గల రెండు వాక్యాలు గానీ ఉంటాయి. అరుదుగా కొన్ని సామెతలు ఇంతకంటె పెద్దవిగా కూడా ఉండవచ్చు.

ఉదా : Qualis rex, talis grex (Latin)
As the King, so the flock (English)
యథా రాజా, తథా ప్రజా (Sanskrit)
రౌతును బట్టి గుర్రం

2. స్పష్టత : పదునైన భావాలను పదునైన మాటలలో సూటిగా, స్పష్టంగా చెప్పడం సామెత మరొక లక్షణం. మానవుల దీర్ఘానుభవం నుండి పుట్టిన సంక్షిప్త వాక్యాలు కావడం చేత సామెతలకు స్పష్టత వచ్చి ఉండవచ్చు.

ఉదా : ఉల్లి తల్లి లాంటిది

---

5 Roger D.Abrahams, Folklore and Folklife, Richard M.Dorson (Ed.) p.119

6 The Macmillan Book of Provebs, Maxims and Famous Phrases, P1957, as quoted by రామనరసయ్య, టి.వి. తెలుగు సామెతలు, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1994, పు. 7

3. శ్రావ్యత : సామెతలలో చెవికి ఇంపైన శ్రావ్యత ఉంటుంది. ఈ శ్రావ్యత సామెతలలోని లయ, యతి, ప్రాస, అనుప్రాస, శబ్దాలంకారాల కారణంగా ఏర్పడుతుంది.

ఉదా : A stich in time saves nine
కండే కాంతి, మేపే రూపు

4. ఆలంకారికత : చెప్పే విషయాలను ఆలంకారికంగా, గూఢార్థద్యోతకంగా చెప్పడం సామెతల ఇంకొక లక్షణం. ఉపమాలంకారం సామెతలలో తరచుగా కనిపిస్తుంటుంది.

ఉదా : కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా
పులిని చూచి నక్క వాత పెట్టుకున్నట్లు

5. ప్రాచీనత : సామెతలు తరతరాల మానవ అనుభవాలకు అద్దం పడుతుంటాయి.

ఉదా : Slow and steady win (s) the race
ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదు

6. ప్రాచుర్యత : అనేకమంది విజ్ఞానం ఒకరి చమత్కారంగా సామెతలు పుట్టినప్పటికీ ప్రజలలో ప్రాచుర్యం లేనిదే అవి సామెతలుగా నిలవవు. అందువలన ప్రాచుర్యతను సామెతల వేరొక లక్షణంగా చెప్పుకోవలసి ఉంటుంది.

పైని పేర్కొన్న లక్షణాల కారణంగా, మరీ ముఖ్యంగా వాటిలోని సంక్షిప్తత, శ్రావ్యతల వలన సామెతలను తేలికగా గుర్తు పెట్టుకోవచ్చు.

**ఈ. సామెతలు – వర్గీకరణ పద్ధతులు** :

సామెతలు సంక్షిప్తమైనవీ, వైవిధ్యమైనవీ కావడం వలన వాటిని వర్గీకరించడం కష్టసాధ్యం. వీటి విభజనకు అనేకులు అనేక మార్గాలను అనుసరించారు. వాటిలో మొదటిది సామెతలను అకారాదిగా విభజించడం. దీనిలో మళ్ళీ రెండు ఉపమార్గాలున్నాయి. అవి : సామెతల మొదటి మాటను అకారాది క్రమంలో అమర్చడం, లేక సామెతలలోని ముఖ్య పదాలను అకారాది క్రమంలో అమర్చడం.

రెండవ పద్ధతి సామెతలను జనప్రియ, గ్రంథస్థ సామెతలనుగా విభజించడం. జన బాహుళ్యంలో ప్రాచుర్యాన్ని సంపాదించుకొన్న తరతరాల సామెతలు జనప్రియ సామెతలు కాగా, పండితులు పుస్తకాలలో సంతరించినవి గ్రంథస్థ సామెతలు. అయితే జన బాహుళ్యంలో ప్రాచుర్యాన్ని పొంది కొన్ని గ్రంథస్థ సామెతలు జనప్రియ సామెతలుగా పరిణమించే ప్రమాదం ఈ పద్ధతిలో ఉంది.

మార్గరెట్ ఎం. బ్రయాంట్ చేసిన వర్గీకరణం భాషాశాస్త్రపరమైనది. ఈ పద్ధతి ప్రకారం సామెతలలో ఈ క్రింది విభాగాలను గుర్తించవచ్చు. 1. పూర్తి వాక్యాలు, 2. విద్యావంతుల సంగ్రహ వాక్యరూపాలైన సామెతలు, 3. అనుప్రాసలు, 4. అసంపూర్ణ వాక్యాలు, 5. క్రియారహిత అసంపూర్ణ వాక్యాలు, 6. ఉపమలు, 7. ఉదాహృత వాక్యాలు, 8. ఆధునిక సరసోక్తులు.[7]

సామెతలను వర్గీకరించడానికి విద్వాంసులు అనుసరించిన వేరొక పద్ధతి వస్తువును ఆధారంగా చేసుకొని వర్గీకరించడం. మొదట వస్తువును బట్టి వర్గీకరించి పిమ్మట వాటిని అకారాది క్రమంలో కూర్చడాన్ని ఈ పద్ధతి అనుసరిస్తుంది. దీనిలో ఆకారాది పద్ధతిని అనుసరించినా ఉప విభాగాలుంటాయి కాబట్టి సామెతలను తేలికగా వెదకుకోవచ్చు. మిగిలిన పద్ధతుల కంటే ఇదే ఎక్కువ ఉపయోగకరంగా, తేలికగా ఉండడంతో ఈ పద్ధతే ఎక్కువమంది ఆమోదాన్ని కూడా పొందినది. ఈ పద్ధతిని అనుసరించి సామెతలను సత్యాలను, నీతులను బోధించేవి; అనుభవాలను చెప్పేవి; సంప్రదాయాలను సూచించేవి; కథల నుండి పుట్టినవి; వాతావరణానికి సంబంధించి నవి; వైద్యానికి సంబంధించినవి మొదలగునవిగా విభజించవచ్చు.

## తెలుగు సామెత

### అ. సామెత - శబ్దవిచారం:

శబ్ద రత్నాకరము 'సామెత' శబ్దాన్ని వైకృతంగా పేర్కొంటూ దీని అర్థం **లోకోక్తి** అని వివరించినది. కాని ప్రకృతి రూపాన్ని చూపించలేదు. 'సమతా' అనే సంస్కృత పదం నుండి 'సామిత', 'సామెతె', 'సామెత' పదాలు వచ్చినట్లుగా పేర్కొంటూ, "ఒక సంగతికి దృష్టాంతముగా లోకులు వాడుకగా చెప్పే మాట, **లోకోక్తి**" అని సామెతకు అర్థ వివరణను ఇచ్చినది తెలుగు - ఇంగ్లీష్ బ్రౌణ్య నిఘంటువు. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు (ఆరవ సంపుటం) 'సామెత'కు **లోకోక్తి** అనే అర్థాన్ని ఇచ్చి పొన్నిగంటి తెలగనార్యుడి యయాతి చరిత్రము నుండి (గీ.రాజు మగడైన వెనుకకు గాజు కడియ।మన్న సామెత నిక్కంబె యయ్యె మాకు - 3 ఆ. 107), చేమకూర వేంకటకవి సారంగధర చరిత్రము నుండి (ద్వి. తామసించినవాడు దామసియన్న। సామెత నిజమాయె సతిమాటలకును - 3 ఆ .112 పు. 13 పం.) ప్రయోగాలను ప్రదర్శించినది.

---

[7] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 182

'సామ్య' శబ్దానికి 'సామ్యత' అనే అసాధురూపం ఏర్పడి సామెతగా మారి ప్రచారంలో ఉందని డా॥ చిలుకూరి నారాయణరావుగారి అభిప్రాయం.[8] సమత, సమత్వము, సామ్యము మూడూ శిష్టరూపాలు. సామ్యత అన్నది అసాధురూపం. సామ్యత వాడుకలో సామెతగా మారింది. సామెతకు రూపాంతరం సామిత. 'సమత' కల్గినది సామెత అని నేదునూరి గంగాధరం చెప్పారు.[9]

సామెత అనే అర్థంలో నానుడులు, సుద్దులు, జనశ్రుతులు, శాస్త్రములు, మాటలు అనే పదాలు కూడా వ్యవహారంలో ఉన్నాయి.[10]

సాటువ, సాటవ, చాటువ, చాటవ – అని నెల్లూరు, రాయలసీయ ప్రాంతాల్లో సామెతకు పేర్లు. 'సాటి అయినదే సాటవ' అని దివాకర్ల వేంకటావధానిగారు చెప్పారు.[11]

## ఆ. తెలుగు సామెత – నిర్వచనములు:

"వేదాలు మహర్షులయొక్క జ్ఞానసముదాయములైతే, సామెతల్ని సామాన్య జనుల యొక్క అనుభవసాగరాలుగా పేర్కొనవచ్చును." [12]

"సంక్షిప్తమైన, వివేకయుతమైన, తీక్షణమైన, సాంప్రదాయికమైన, జనప్రియమైన, అనుభవమూలమైన అభివ్యక్తి సామెత."[13]

"సామెత అనగా జనవ్యవహార క్షుణ్ణమైన ఉక్తి."[14]

"ఒక పిండితార్థాన్ని కొద్దిమాటల్లో చెబుతుంది సామెత. సామెతలు జాతి యొక్క అనుభూతి పారమ్యాన్ని ప్రతిబింబిస్తూ మహాశాస్త్రముల యొక్క సూత్రముల

---

8 జి.ఎస్.మోహన్, సామెతలలో సాంఘిక జీవితం, శ్రీనివాస పబ్లికేషన్స్, అనంతపురం, 1983,పు.3

9 పసిడి పలుకులు, జాతీయ విజ్ఞానపీఠం, మద్రాసు, 1960, పు.1

10 సంపత్ రాఘవాచారి, తెలుగు సామెతలు (మూడవ కూర్పు), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974, పు.1

11 పి.నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి,1983, పు.1

12 కాలిపు వీరభద్రుడు, భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన సామెతలు (వ్యాసం). స్రవంతి - మార్చి 1968, పు. 57-60

13 ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 174

14 సంపత్ రాఘవాచారి, తెలుగు సామెతలు (మూడవ కూర్పు), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1974, పు.1

వలె నిగూఢ రమణీయ వ్యాఖ్యాపేశలత్వాన్ని వాంఛిస్తూ ఉండే ఒక విలక్షణమైన సాహిత్య ప్రక్రియ.” [15]

“పూర్వులు తమ యనుభవములను సూత్రప్రాయముగా చెప్పుచూ వచ్చినవే సామెత లైనవి. క్రమముగా కొన్ని నీతులు, కథలు, బోధనలు కూడ సామెతలుగా నిల్చియున్నవి.”[16]

పై నిర్వచనములన్నింటిని క్రోడీకరిస్తూ పాపిరెడ్డి నరసింహారెడ్డి గారు “సామాజిక మైన తరతరాల అనుభవాన్ని ఇముడ్చుకొని సామ్యత, ప్రభావోత్పాదకత, ధ్వని ప్రాధాన్యత, ప్రజా ప్రాచుర్యం, శ్రావ్యత కలిగి సంభాషణా యోగ్యమైన సంక్షిప్త వాక్యం తెలుగు సామెత” అని నిర్వచించారు. [17]

### ఇ. తెలుగు సామెత - లక్షణాలు

పై నిర్వచనాలను అనుసరించి తెలుగు సామెత లక్షణాలను ఈ క్రింది విధంగా క్రోడీకరించవచ్చు.

**1. పోలిక :** సామెతకున్న ప్రధాన లక్షణం పోలిక చెప్పడం. సామ్యమంటే ఒక వస్తువును మరొక వస్తువుతో, ఒక విషయాన్ని అటువంటి వేరొక విషయంతో పోల్చి చెప్పడం. సామెతల్లో పోలికను చెప్పేవే ఎక్కువ. ‘సాటి అయినదే సాటవ’ అని ఇంతకు ముందు చూచినట్లుగా దివాకర్ల వేంకటావధానిగారి నిర్వచనం.

ఉదా: ‘రాజుగారి పెళ్ళాం మేడ ఎక్కితే, కుమ్మరి వాడి పెళ్ళాం ఆవమెక్కిందట!’ ఇక్కడ అంతస్తుల్లో తేడా వున్నా ‘ఎక్కడ’ మనే పనిలో పోలిక వుంది. ఈ పోలిక మాటల్లోను, చేతల్లోను, భాషలోను, భావంలోను, అక్షర సంఖ్యలోను ఉండవచ్చు. ‘పులిని చూచి నక్క వాతలు పెట్టుకొన్నట్లు, ‘నెమలిని చూచి నక్క నాట్యమాడినట్లు’ మొదలగునవి అటువంటివి.

**2. స్పష్టత :** చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పడం తెలుగు సామెత ముఖ్యలక్షణాలలో ఒకటి. ఒక విషయాన్ని ఎదుటి వ్యక్తికి బాగా తెలిసేలా

---

15 విశ్వనాథసత్యనారాయణ, తెలుగు సామెతలు (మూడవ కూర్పు), ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు,1974, పు. 31

16 నేదునూరి గంగాధరం, వ్యవసాయ సామెతలు, విశ్వసాహిత్యమాల, రాజమండ్రి, 1959, పు. 1

17 పాపిరెడ్డి నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జన జీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి 1983, పు.6

-

చెప్పాలంటే దానికి సామ్యమైన వాక్యాన్ని చెబుతారు. దానినే సామెత అంటారు. ఎప్పుడో జరిగిన విషయాన్ని గుర్తుపెట్టుకొని, ప్రస్తుత విషయాన్ని దానితో పోల్చి చెప్పడంవల్ల ఎదుటి వారికి విషయం స్పష్టమవుతుంది.

ఉదా: 'పైన పటారం లోన లొటారం', 'చూచి రమ్మంటే కాల్చి వచ్చినాడట', 'తా దూర సందులేదు మెడకొక డోలు అన్నట్లు', 'అడగనిదే అమ్మయినా అన్నం పెట్టదు', 'రెక్కాడితే గాని డొక్కాడదు', 'నోరుమంచిదయితే ఊరు మంచిదవుతుంది' మొదలైన సామెతల వెనుక వున్న ఆంతర్యం ప్రజలకు సులభంగా స్పష్టమవుతుంది.

**3. సంక్షిప్తత:** 'అల్పాక్షరాలలో అనల్పార్థ రచన' అనే వాక్యానికి సామెతలు మంచి నిదర్శనాలు. సామెతలు చూడడానికి చిన్న వాక్యాలుగా ఉన్నా విశాల మానవ జీవితానికి వ్యాఖ్యాన ప్రాయంగా ఉంటాయి. **ఉదా:** 'కోటి విద్యలు కూటి కొరకే' 'అడుసు త్రొక్కనేల? కాలుకడగనేల' 'ఏటికి ఎదురీదినట్లు'; 'పిట్ట కొంచెము, కూత ఘనము', 'లోకులు కాకులు' మొదలైన సామెతలు సంక్షిప్తంగా ఉన్నా విస్తృతమైన అర్థాన్ని ఇస్తున్నాయి. సామెతలో ఇరవై పదాలకంటే ఎక్కువ ఉండవని, ఉంటే అవి సామెతలు కావని కొందరు విద్వాంసుల అభిప్రాయం.[18] కాని, అక్కడక్కడ కొంచెం పెద్దగా కనిపించే సామెతలు కూడా కొన్ని కనిపిస్తుంటాయి.

**4. శ్రావ్యత:** పాటకు రాగతాళాలు, పద్యానికి యతిప్రాసలు ఏవిధంగా శోభను కలిగిస్తాయో అలాగే సామెతకు ప్రాసానుప్రాసలు ఒక లయను కలిగిస్తాయి. ఈ లయ వలన సామెతకు శ్రావ్యత చేకూరి సులభంగా గుర్తుండి పోతుంది. మానవ శాస్త్రం, భాషాశాస్త్రం వంటివి ప్రాక్తన మానవుని భాష సహజంగానే లయబద్ధంగా వుండేదని చెబుతున్నాయి. ఆ కారణంగా ప్రాచీన మానవ సంస్కృతిని ప్రతిబింబించే సామెతల్లో కూడా లయ ఉంటుందని చెప్పవచ్చు. తెలుగు పద్యాల్లో వుండే యతి, ప్రాసయతి, అంత్యప్రాసల వంటి శ్రావ్యతా లక్షణాలు సామెతల్లో పుష్కలంగా వున్నాయి.

ఉదా: 'అంతనాడు లేదు ఇంతనాడు లేదు సంతనాడు పెట్టింది ముంతంత కొప్పు.' ఈ సామెతలోని బిందు పూర్వక తకారం', 'నాడు' అనే వాటి ప్రయోగం వల్ల శ్రవ్య సౌందర్యం వచ్చింది. 'వింటే భారతం వినాలి తింటే గారెలే తినాలి', 'అనగా అనగా రాగం, తినగా తినగా రోగం' అనే సామెతల్లో 'వింటే – తింటే',

---

[18] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.174

'వినాలి – తినాలి', 'అనగా – అనగా', 'తినగా – తినగా', 'రాగం – రోగం' అనే పదాలు ప్రాసను పాటించాయి. ఇటువంటి ప్రాసల వల్ల వచన సాహిత్య ప్రక్రియ అయిన సామెతల్లో గేయ లక్షణమైన శ్రావ్యత కనిపిస్తుంది.

**5. ప్రాచుర్యత:** ప్రాచుర్యాన్ని సామెతకు మరో లక్షణంగా చెప్పాలి. సామెత ఒక్కని వివేకం వల్ల పుట్టినప్పటికి, దానికి పదిమంది ఆమోదముద్ర లభించకపోతే అది మామూలు మాటగానే మిగిలిపోతుంది. కొంత కాలానికి దాని ఉనికే పోతుంది. "సామెత నాణెం వంటిది. ఎవరైనా నాణాన్ని ముద్రించగానే అది చెలామణిలోకి రాదు. ప్రభుత్వంవారు ముద్రించినా ప్రజలలో చెలామణి అయిన తర్వాతనే నాణానికి విలువ వస్తుంది. అట్లే సంప్రదాయం, జనప్రియత్వం లేని ఉక్తులు ఉక్తులుగానే ఉండిపోతాయి. సూక్తులు కాలేవు" అని ఆర్వీయస్ సుందరం గారన్నారు.[19] 'నలుగురు నడిచిందే బాట, పలువురు పలికిందే మాట' కదా!

**6. అనుభవ మూలకత:** మానవుల అనుభవాలే సామెతలకు పునాదులు. ప్రజల దీర్ఘానుభవం సామెతల్లో నిక్షిప్తమై ఉంటుంది. ఈ దీర్ఘానుభవం వలనే సామెతలకు సూటిదనం వస్తుంది. 'కాలు జారితే తీసుకోవచ్చుగాని నోరు జారితే తీసుకోలేము', 'అరిటాకు ముల్లుమీద పడ్డా, ముల్లు అరిటాకు మీద పడ్డా అరిటాకుకే ముప్పు, ' రెక్కాడితే గాని డొక్కాడదు', 'కోటి విద్యలు కూటి కొరకే', 'ఉల్లి తల్లి వంటిది' మొదలైన సామెతలు తరతరాల మానవుల అనుభవాలకు అద్దం పడుతుంటాయి.

**7. సాంప్రదాయికత:** ఏదైనా ఒక విషయం ఒక తరం నుండి ఇంకొక తరానికి సంక్రమించినపుడే సంప్రదాయం ఏర్పడుతుంది. వివిధ జాతుల తరతరాల సంప్రదాయాలను, ఆచార వ్యవహారాలను, వావి వరుసలను సామెతలు తమలో ప్రతిబింబిస్తుంటాయి.

**8. ధ్వని:** కావ్యంలో వాచ్య , లక్ష్యార్థాల కన్నా భిన్నమైన అర్థాంతరమొకటి భాసిస్తుందనీ, అది వ్యంగ్యార్థమనీ, అదే ధ్వని అనీ ఆనంద వర్ధనుని మతం. ఇటు వంటి వ్యంగ్యార్థ శోభితమైనదే ఉత్తమ కావ్యమని ఆనందవర్ధనుని అభిప్రాయం. 'వాక్యం రసాత్మకం కావ్యమ్' అని విశ్వనాథుడన్నాడు.

---

[19] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 174

అలాగే సామెత ఒకటి రెండు వాక్యాలలో ఉన్నప్పటికీ అది ధ్వని పూర్వకమై రసాత్మకంగా ఉంటుంది. సామెతలు చెప్పదలచిన విషయాన్ని వ్యంగ్యంగా చెప్పి, అమూల్యమైన ఉపదేశాన్ని అందిస్తాయి. ఆలంకారికంగా, గూడార్థద్యోతకంగా చెప్పడం సామెత లక్షణం. 'ముల్లును ముల్లుతోనే తియ్యాలి' అనే సామెతలో ముల్లును ముల్లుతో తీస్తే వస్తుందో రాదో తెలియదు గాని మోసాన్ని మోసంతోనే జయించాలనే వ్యంగ్యార్థం ధ్వనిస్తుంది. అట్లే 'అడుసు తొక్కనేల? కాలు కడుగనేల?' అనే సామెత నిరుపయోగమైన పని చేసి, దానివల్ల వచ్చిన కష్టాన్ని పోగొట్టుకునే ప్రయత్నాన్ని ధ్వనిస్తుంది.

## ఈ. తెలుగు సామెత – పుట్టుపూర్వోత్తరాలు

సామెతలు పుట్టుకకు ప్రజల జీవితానుభవమే ప్రధాన కారణం "మౌలికమైన ప్రతిభ, కల్పనాశక్తి, అన్వేషణాసక్తి ఉన్న అతి ప్రాచీన మానవుడే సామెతలను సృష్టించాడనడంలో సందేహం లేదు."[20] అయితే అవి ఎంత ప్రాచీనమైనవో ఇదమిత్థంగా చెప్పడం మాత్రం సాధ్యం కాదు. కథలు, కథాగేయాలు, గద్య కథనాలు, పద్య కథనాలు మొదలైనవి స్వరూపంలో నిడివి కలిగి ఉండడం వల్ల వాటిలో చారిత్ర కాంశాలు కొంతవరకు దొరికే అవకాశం ఉంటుంది. కాని సామెత జానపద సాహిత్య రూపాలలో అన్నిటికంటే చిన్నది కావడం వల్ల దానిలో చారిత్రకాంశాలు దొరకడం దుర్లభం.

గ్రంథస్థమైన సామెతల పుట్టుకను కవికాలాదులతో నిర్ణయింపవచ్చును. మౌఖిక ప్రచారంలో నలిగిపోయిన సామెతల చరిత్రను తెలుసుకోవడానికి ఇతర భాషలలోని సామెతల్లో కనిపించే పోలికలు కొంత వరకు ఉపయోగపడతాయి.

"మానవ జీవితంలో ఎదురయ్యే ఒక సన్నివేశాన్నో, సంఘటననో వ్యాఖ్యానించ డానికో, విమర్శించడానికో, బలపరచడానికో, నిరసించడానికో, నిదర్శనంగా, దృష్టాంత పూర్వకంగా ఒక భావాన్ని ఒద్దిక గల మాటలతో సూత్రీకరణ పద్ధతిలో వాక్యంగా విన్యసింపచేయడమే సామెత పుట్టుక" అని 'సామెతలు – పుట్టు పూర్వోత్తరాలు' అనే వ్యాసంలో అక్కిరాజు రమాపతిరావుగారన్నారు.[21]

---

[20] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు.174

[21] అభినందన, ఆచార్య తూమాటి దొణప్ప షష్టిపూర్తి సంచిక, 1987, పు.371

సామెతలు ప్రజల దీర్ఘానుభవం నుంచి, పురాణ చారిత్రక సన్నివేశాలనుంచి, జానపద కథలు – గేయాల నుంచి, వివిధ సన్నివేశాల నుంచి, పర భాషా సామెతల నుంచి పుట్టి ఉండవచ్చునని పి. నరసింహారెడ్డి గారి అభిప్రాయం. వాటిని ఇప్పుడు సోదాహరణంగా చూద్దాం.[22]

**1. అనుభవాలు:** సామెతలు ప్రజల జీవితానుభవాల నుండి ఆశువుగా ఉద్భవిస్తాయి. కాబట్టి సామెతకు జన్మనిచ్చినది అనుభవమే.

'పెద్దలమాట సద్దిమూట' అనే సామెత ఆ అనుభవాల బడి నుండి వచ్చినదే. 'అప్పుచేసి పప్పుకూడు', 'అడుసు త్రొక్కనేల? కాలుకడుగనేల?', 'కలిమి లేములు కావడి కుండలు', 'చిన్న మిరపకు కారం హెచ్చు', 'ఏనుగు తినే వానికి పీనుగులు పిండాకూడు' ఈ సామెతలన్నీ అనుభవం నుండి వెలువడినవే.

**2. పురాణ, చారిత్రక సన్నివేశాలు :** పురాణాలు, ఐతిహ్యాలు, చారిత్రక సన్నివేశాలు కూడా సామెతల పుట్టుకకు కారణమవుతాయి. ఉదా: 'కట్టె, కొట్టె, తెచ్చె' అలాగే, 'రామాయణమంతా విని రాముడికి సీతేం కావాలని అడిగినట్లు', 'రామాయణంలో పిడకలవేట', 'సీత పుట్టి లంక చెడె', 'రామాయణం రంకు, భారతం బొంకు', 'వింటే భారతం వినాలి, తింటే గారెలే తినాలి', 'కాగల కార్యం గంధర్వులు తీర్చారు', 'చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రీ!' వంటి సామెతలు రామాయణ, భారత, భాగవతాల నుండి వచ్చినవి.

కొన్ని సామెతలను చారిత్రకాంశాల్ని బట్టి గుర్తించ వచ్చు. ఉదా: 'అశోకుని రాజ్యంలో పశువైతే మాత్రమేమి?' ఈ సామెత చారిత్రక పురుషుడైన అశోకుని రాజ్యంలోని అహింసను, సుభిక్షాన్ని తెలుపుతుంది. 'అక్కన్న మాదన్నలు అందల మెక్కితే, సాటికి సరసప్ప చెరువు కట్ట ఎక్కినాడట'. అక్కన్న మాదన్నలు కంచెర్ల గోపన్న (భక్త రామదాసు) కు మేనమామలైన చారిత్రక పురుషులు. వీరు గోల్కొండ నవాబు తానీషా చక్రవర్తి కొలువులో మంత్రులుగా ఉండేవారు. కనుక ఈ సామెత తానీషా కాలం నాటిదని చెప్పవచ్చు. 'భోజుని వంటి రాజుంటే కాళిదాసు వంటి కవి ఉండనే ఉంటాడు.' ఇది చారిత్రక పురుషుడైన భోజరాజు గొప్పదనాన్ని చాటే సామెత.

---

[22] పి.నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి, 1983, పు.6-10

'కాశికి పోయినవాడు, కాటికి పోయినవాడు ఒకటే.' ఇది ప్రయాణ సౌకర్యాలు లేని కాలంలో వచ్చిన సామెత.

'గతకాలము మేలు వచ్చుకాలముకంటెన్' ఈ సామెత నన్నయ సొంతగా కల్పించి భారతంలో ప్రయోగించినది.

ఇవన్నీ ఒక ఎత్తు, వేమన పద్యాలు ఒక ఎత్తు. ప్రజాకవి వేమన పద్యాలలోని మూడవ పాదాలు చాలావరకు సామెతలే. ఉదా: 'అనువుగాని చోట అధికుల మనరాదు'; 'పదుగురాడు మాట పాటియై ధరజెల్లు'; 'చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా'; 'తప్పులెన్ను వారు తమ తప్పులెరుగరు' మొదలైనవి. వీటిలో కొన్ని వేమన సొంతగా కల్పించినవి. మరికొన్ని వేమన కాలం నాటికి గాని, అంతకుముందు కాలం నాటికి గాని చెందినవి అయివుంటాయి.

**3. జానపద కథలు – గేయాలు :** సామెతలు జానపదుల మౌఖిక సాహిత్యంలో అసంఖ్యాకంగా కనిపిస్తాయనడంలో సందేహంలేదు. గేయాలలో, కథాగేయాలలో, గద్య కథనాలలో ఇవి చాలా దొరుకుతాయి. ప్రత్యేకించి కొన్ని సామెతలకు కథలే ఉన్నాయి.

**ఉదా:** 'మంచి చేసిన ముంగికి ముప్పు వచ్చినట్లు'

బిడ్డ దగ్గరకు పాము వచ్చినప్పుడు ముంగిస దానిని చంపి బిడ్డను కాపాడింది. తల్లి వచ్చి ముంగిస మూతిన నెత్తురు మరకలు చూచి తనబిడ్డను చంపినదని ముంగిని చంపిన కథ ఈ సామెతకు మూలం.

కొన్ని సామెతలు జానపద గేయాలనుండి ఉద్భవించాయి.

**ఉదా:** 'అత్తలేని కోడలుత్తమురాలు, కోడలు లేనత్త గుణవంతురాలు' అనే ప్రసిద్ధమైన రోకటిపాట సామెతగా స్థిరపడిపోయింది.

'కడవంత గుమ్మడి కత్తిపీటకు లోకువ' (గాంధారికథ)

'తెడ్డడిగినప్పుడే కొయ్యడిగినట్టు' (కాటమరాజు కథ)

'నుదుట రాసిన రాత నులిమితే పోదు' (గంగా వివాహం)

'తను గట్టుటకు త్రాళ్ళు తాదెచ్చు కొన్నట్లు' (నలచరిత్ర) [23]

---

[23] బిరుదు రాజు రామరాజు, తెలుగు జానపద గేయ సాహిత్యము, జానపద విజ్ఞాన ప్రచురణలు, హైదరాబాదు 1978, పు.527-29

**4. వివిధ సన్నివేశాలు:** జీవితంలోని అనేక సన్నివేశాలనుండి కూడా సామెతలు పుట్టుకు వచ్చాయి. ఉదాహరణకు అల్పులు గొప్పవారిని అకారణంగా, వృధా ప్రయాసగా ఆడిపోసుకొనే సన్నివేశం నుండి 'కుక్క మొరిగితే జంగం పరువు పోతుందా?' అనే సామెత పుట్టుకు వస్తే, లేనిగొప్పను చూపించే వారిని ఉద్దేశించి 'మింగ మెతుకు లేదు, మీసాలకు సంపంగె నూనె', 'ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత' లాంటి సామెతలు పుట్టుకు వచ్చాయి. బావా మరదళ్ల సరసం నుండి 'బావా! నీభార్య ముండమోసిందంటే, మొఱ్ఱో అని ఏడ్చాడట'; 'బావా! బావా! నీ భార్య అత్తపాలు తాగావా? అంటే, అబ్బే! నేనెందుకు తాగాను? అన్నాడట', 'బావా! అని చూడబోతే, రావా? అని కొంగు పట్టుకున్నాడట' లాంటి సామెతలు పుట్టుకు వస్తే; అత్తాకోడళ్ల విరసం నుండి 'అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు' ; 'అత్తమెత్తన కత్తిమెత్తన ఉండవు'; 'అత్తకు నాకు ఆరంబేరం, అత్తనెత్తుకుపో ముత్యాలమ్మా! అత్తనెత్తుకుపోతే ఆరుగాళ్ల జీవాన్ని అర్పిస్తాను'; 'కోడలు ముండమొయ్యాలి కొడుకు బాగుండాలి' లాంటి సామెతలు పుట్టుకు వచ్చినట్లు తెలుస్తుంది.

**5. పరభాషా సామెతలు :** భాషకు ఆదాన ప్రదానాలు సహజం. ఆదాన భాష అంటే అన్యదేశాలను గ్రహించేది. ప్రదాన భాష అంటే ఇతర భాషలకు ఇచ్చేది. ఏ భాష అయినా ఇతర భాషా ప్రభావాలకు కాస్తోకూస్తో లోనవుతుంది. భాషల్లో ఆదాన ప్రదానాలు సాధారణంగా భౌగోళిక సాన్నిహిత్యం, రాజకీయ, వాణిజ్య, సాంస్కృతిక కారణాల వలన సంభవిస్తుంటాయి.

తెలుగు సాహిత్యం మీద సంస్కృత సాహిత్య ప్రభావం కారణంగా 'అతి వినయం ధూర్త లక్షణం', 'యథారాజా తథాప్రజా' లాంటి సామెతలు ఉన్నవి ఉన్నట్లు రాగా 'చెట్టులేని చోట ఆముదపు చెట్టు మహావృక్షం' లాంటి సామెతలు అనువాదాలుగా తెలుగులోకి వచ్చాయి.

రాజకీయంగా మనం ఆంగ్లేయుల పాలనలో ఉన్నపుడు ఆంగ్లభాషా ప్రభావం కారణంగా 'తానొకటి తలచిన దైవమొకటి తలచును' – 'Man proposes God disposes', 'కుక్క కాటుకు చెప్పుదెబ్బ' – 'Tit for tat', 'తెలియని దేవత కన్నా తెలిసిన దయ్యం మిన్న' – 'A known devil is better than an unknown angel' లాంటి సామెతలు తెలుగులో పుట్టుకు వచ్చినట్లు గ్రహించవచ్చు.

భౌగోళిక సాన్నిహిత్యం వలన సోదర ద్రావిడ భాషలైన తమిళ, మలయాళ, కన్నడాల నుండి కూడా పలు సామెతలు తెలుగులోకి వచ్చాయి. సమాన రూపం ఉన్న సామెతలు నాలుగు భాషలలో ఉన్నపుడు ఏది దేనికి మూలమో చెప్పడం కష్టం. ఇలాంటి నాలుగు వందల ఇరవై సామెతలను "సాటి సామెతలు" పేరిట నిడదవోలు వేంకటరావు, మరియప్ప భట్, ఆర్పీ సేతుపిళ్లై, ఎస్.కె.నాయర్‌లు సంకలనం చేయగా మద్రాసులోని విజయా పబ్లికేషన్స్‌వారు 1960 లో ప్రచురించారు. ఈ గ్రంథం నుండి ఒక ఉదాహరణం:

తెలుగు - 'ఆశకు అంతం లేదు'; తమిళం - 'ఆసైక్కువోర్ అళ్‌విల్లై'; కన్నడం- 'ఆశెగె మేరె యిల్లా'; మలయాళం - 'ఆశెక్కు అతిరు యిల్ల'.

మొత్తం మీద సామెతలు ఎప్పుడు, ఎలా పుట్టాయో తేల్చి చెప్పడం సాధ్యం కాదు. బాబిలోనియా, ఈజిప్టు, ఇండియా దేశాల అత్యంత ప్రాచీన గ్రంథాల్లో, వేదాల్లో, ఉపనిషత్తులలో, బైబులులో, ఖురానులో, పురాణాలలో సామెతలు కనిపించడాన్ని బట్టి సామెతల ప్రాచీనతను ఊహించవచ్చు.

**ఉ. తెలుగు సామెతలు - స్వరూపం:** సామెతల స్వభావాన్ని చర్చించిన తర్వాత ఇప్పుడు సామెతల స్వరూపం ఎలా వుంటుందో పరిశీలిద్దాం. స్వరూపాన్ని బట్టి తెలుగు సామెతలను పి. నరసింహారెడ్డిగారు క్రింద చూపిన విధంగా విభజించారు.[24]

**1.** తెలుగు సామెతలు కొన్ని క్రియా రహిత వాక్యాలుగా కనిపిస్తాయి.

ఉదా: 'మేపే రూపు' (ఏకదళం), 'అంకెకురాని ఆలు, కీలెడలినకాలు' (ద్విదళం).

**2**. కొన్ని తెలుగు సామెతలు క్రియా సహిత వాక్యాలుగా ఉంటాయి. వీటిలో ఏక వాక్య సామెతల నుండి పంచవాక్య సామెతలదాకా కనిపిస్తాయి.

ఉదా: 'ఆకలి రుచి ఎరుగదు'; 'గువ్వగూడెక్కె, రాజుమేడెక్కె'; 'అంతనాడు లేదు ఇంతనాడు లేదు సంతనాడు పెట్టింది ముంతంత కొప్పు.'

**3.** తెలుగు సామెతలు మరికొన్ని సంయుక్త వాక్యాలుగా ఉంటాయి. ఇటువంటి కొన్ని సామెతలలో రెండు సామాన్య వాక్యాలూ క్రియంతాలుగా ఉండవచ్చు. ఉదా: 'అంగట్లో అన్నీ ఉన్నవి - అల్లునినోట్లో శని ఉన్నది'. మరికొన్ని సామెతలలో రెండు సామాన్య వాక్యాలలో ఉండే రెండు క్రియలకు బదులు రెండవ వాక్యం మాత్రం

[24] పి.నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి, 1983,పు. 20-24

క్రియాంతంగా ఉంటుంది. ఉదా: 'అటుకులు బొక్కేనోరు, ఆడిపోసుకునే నోరు ఊరుకోవు'. ఇటువంటి సామెతలలో రెండు సామాన్య వాక్యాలను 'అంటే', 'అయినా', 'కంటే', 'ఉంటే', 'కాని' లాంటి పదాలు కలుపుతుంటాయి.

ఉదా: 'అతిరహస్యం ఏమిటిరా? **అంటే** పొగాకు తిరిపెం అన్నట్లు'

'అతివృష్టి అయినా అనావృష్టి **అయినా** ఆకలిబాధ తప్పదు'

'అతంత్రునికి ఆలు అయ్యేదాని **కంటే** బలవంతునికి బానిస అయ్యేది మేలు'

'అత్త ఎత్తుకొని తింటూ **ఉంటే** అల్లుడికి మనుగుడుపా?'

'అత్తపెట్టే ఆరళ్లు కనబడతవి **కాని** కోడలు చేసే కొంటెపనులు కనబడవు'

**4.** సమాపక క్రియా సహిత వాక్య సామెతలను ఐదు విధాలుగా విభజించవచ్చు. అవి :

**భూతకాలికాలు:** అంకెలేని కోతి లంకంతా చెఱచిందట.

**తద్ధర్మార్థకాలు:** అంగట్లొ అన్నీ ఉన్నవి, అల్లుని నోట్లో శని ఉన్నది.

**విధ్యర్థకాలు:** అంకెకురాని ఆలిని ఆరుగురు బిడ్డల తల్లి అయినా విడువాలి.

**నిషేధార్థకాలు:** ఋణ శేషం, శత్రుశేషం ఉండరాదు.

**వ్యతిరేకార్థకాలు:** అత్త మెత్తన, వేము తియ్యన లేవు.

**5.** సామెతల రూప నిర్మాణాన్ని బట్టి ఆరు విధాలుగా విభజించవచ్చు.

**ప్రశ్నార్థకాలు:** రెండువిధాలు: విశేష విషయాపేక్షకాలు, విశేష విషయ నిరపేక్షకాలు. క్రియరహితవాక్యాల గురించి చెప్పినపుడు పేర్కొన్న ప్రశ్నలు విషయ నిరపేక్షకాలు. అవి వాక్యాంతంలో 'ఆ' అనేరూపాన్ని చేర్చడంవల్ల ఏర్పడతాయి. ఉదా: 'అయ్య వాతపెట్టనూ బట్టె బ్రతకనూనా?'

విశేష విషయాపేక్షకాలు ప్రత్యేక పదార్థక పదాలైన ఎందుకు, ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా, ఎవరు, ఏమిటి మొదలైన రూపాలవల్ల ఏర్పడతాయి. ఉదా: 'అంతా తడిసిన తర్వాత చలేమిటి?' 'అంతా బాపలే అయితే కోడిపెట్ట ఏమైనట్లు?'

**ఏవార్థకాలు:** విషయాన్ని నొక్కిచెప్పేవి. 'ఏ' అనే ప్రత్యయం ఏవార్థకంగా వాక్యాంతంలో వస్తుంటుంది. అరుదుగా వాక్యం మధ్యలో కూడా రావచ్చు. ఉదా**:** 'అందరికి అన్నం పెట్టేవాడు రైతే' , 'అంతంతవాణ్ణి చూస్తే ఆవుపెయ్యే కుమ్మవస్తుంది'.

**ఆశ్చర్యార్థకాలు:** **ఉదా:** 'అ ఆ లు రావు, అగ్రతాంబూల మాత్రం కావాలి!'

**సంబోధనార్థకాలు:** **ఉదా:** 'తెలివొకరి సొమ్మా బెస్త గుర్రమ్మా!'

**సందేహార్థకాలు:** **ఉదా:** 'ఆలిని అదుపులో పెట్టలేనివాడు అందరినీ అదుపులోపెట్టునా?'

**ప్రార్థనార్థకాలు** : **ఉదా:** 'అత్తకు నాకు ఆరం బేరం, అత్తనెత్తుకపో ముత్యాలమ్మా; అత్తనెత్తుకపోతే  ఆరుగాళ్ల జీవాన్ని అర్పిస్తాను.'

6. సంభాషణ సామెతలు

'ఊళ్లోకే రావద్దు రౌతా; అంటే గుఱ్ఱాన్ని ఎక్కడ కట్టేసేది? అన్నాడట.'

'ఏ ఊరే ఏతామా? అంటే, దువ్వూరే దూలామా అన్నదట.'

**ఊ. తెలుగు సామెతలు - వర్గీకరణం**

సామెతల వర్గీకరణకు ఒక్కొక్కరు ఒక్కొక్క విధానాన్ని పాటించారు. వీరిలో చాలా మంది అకారాది క్రమంలో సామెతలను వర్గీకరించారు. ఈ వర్గీకరణలో విషయ విశ్లేషణ జరుగదు. అందువలన ఇది సమగ్రంగా ఉండదు. విషయాలకు ప్రాధాన్యతనిస్తూ నాయని కృష్ణకుమారి గారు తెలుగు సామెతలను 1. బంధు సంబంధి, 2. వ్యక్తి వివేచనా సంబంధి, 3. సత్యవిషయ సంబంధులుగా విభజించారు. బి. దామోదరరావు గారు తెలుగు సామెతలను 1.కుటుంబం 2.మతం 3.సాంఘిక జీవితం 4. ఆర్థిక జీవితం 5. రాజకీయ జీవితం అను ఐదు ప్రధాన విభాగాలుగా విభజించారు.[25]

పి. నరసింహారెడ్డిగారు మరింత సమగ్రంగా విషయాన్ని బట్టి తెలుగు సామెతలను మొదట 1. సార్వదేశికాలు 2. ప్రాదేశికాలు అని రెండు పెద్ద విభాగాలుగా మొదట వింగడించారు. వీనిలో తెలుగుదేశానికంతా సంబంధించిన సామెతలు సార్వదేశికాలు. ఏదైనా ఒక ప్రదేశానికి మాత్రం సంబంధించిన సామెతలు ప్రాదేశికాలు.

సార్వదేశికాలను 1. ప్రాణిసంబంధి సామెతలు 2. ప్రకృతి సంబంధి సామెతలుగా పునర్విభజించారు. ప్రకృతి సంబంధి అంటే వాతారణం, గ్రహాలు, నక్షత్రాలు, కొండలు, నదులు మొదలైనవాటికి సంబంధించినవి. ప్రాణి సంబంధి సామెతలను ఆయన

---

[25] తెలుగు సామెతలు - జానపద సంస్కృతి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1995, పు.8,10

మనుష్య, మనుష్యేతర ప్రాణి సంబంధులుగా విభజించారు. మనుష్యేతర ప్రాణి సామెతల విభాగంలో జంతు, పక్షి, కీటక, జలచరాలను గురించిన ఉప విభాగాలు ఉన్నాయి. మనుష్య సంబంధి సామెతలు చాలా విస్తృత పరిధి కలిగినవి. ఈ విభాగంలో

1. కుటుంబ వ్యవహారాలు, 2. అధికారం, 3. స్వభావం, 4. వృత్తి, 5. వర్ణం, 6. ఆహారం 7. వర్తక, వాణిజ్యాలు, 8. నాణేలు, కొలతలు, 9. సాంస్కృతిక సంబంధి అనే తొమ్మిది ఉప విభాగాలు ఉన్నాయి. సాంస్కృతిక సంబంధిలో మతం, విద్య, వైద్యం, కళలు, వినోద విలాసాలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు మొదలైనవి ఉన్నాయి. [26]

ఈ పరిశోధన తెలుగు, బైబులు సామెతల తులనాత్మక పరిశీలనానికి సంబంధించినది. అందువలన తెలుగు సామెత స్వరూప, స్వభావాలను గురించి తెలుసుకున్న పిదప ఇప్పుడు బైబులు సామెతల స్వరూప స్వభావాలను గురించి తెలుసుకుందాం. అందుకు బైబులు పరిచయం అవసరం కాబట్టి ముందుగా బైబులు గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

## బైబులు పరిచయం

బైబులు అనే మాట "బిబ్లోస్" అనే గ్రీకు పదం నుండి వచ్చినది. ఈ పదానికి "పుస్తకం" అని అర్థం. "అతి శ్రేష్ఠమైన గ్రంథం" అనే అర్థంలో దీనిని ఇలా వ్యవహరించారు. ఐతే బైబులు ఒక పుస్తకం కాదు. 73 పుస్తకాల గ్రంథమిది.

బైబులులో పూర్వ, నూతన నిబంధనాలున్నాయి. వీనిలో పూర్వ నిబంధనం మాత్రమే యూదుల మత గ్రంథం. పూర్వ, నూతన నిబంధనలున్న బైబులు మొత్తం క్రైస్తవుల మత గ్రంథం.

## గ్రంథ సంఖ్య

అన్ని క్రైస్తవ శాఖలు నూతన నిబంధనం గ్రంథాలు 27 అని అంగీకరిస్తాయి. కాని, పూర్వ నిబంధనం గ్రంథాల సంఖ్య విషయంలో మాత్రం ఏకాభిప్రాయం లేదు. క్యాతలిక్ శాఖ ప్రకారం పూర్వ నిబంధనం గ్రంథాలు 46. కనుక బైబులు గ్రంథాలు మొత్తం 73. ప్రొటెస్టెంటు శాఖల ప్రకారం పూర్వ నిబంధనం పుస్తకాలు 39. కనుక వారి ప్రకారం బైబులు గ్రంథాలు మొత్తం 66 మాత్రమే.

---

[26] పి.నరసింహారెడ్డి, తెలుగు సామెతలు - జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి, 1983, పు. 24-27

ఈ తేడాకు కారణం హీబ్రూ పూర్వ నిబంధనంలో 39 పుస్తకాలు మాత్రమే ఉండడం. ప్రొటెస్టెంటులు ఈ సంఖ్యను అంగీకరించారు. హీబ్రూ పూర్వ నిబంధనానికి అనువాదమైన సెప్తువజింత్ గ్రీకు బైబుల్లో మరో 7 గ్రంథాలను అదనంగా చేర్చి, మొత్తం 46 పుస్తకాలు చేశారు. ఇది క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో తయారైనది. ఈ అనువాదం కూడా ప్రామాణికమైనది కావడం చేత క్యాతలిక్ శాఖ దీని సంఖ్యను గ్రహించి పూర్వ నిబంధనం గ్రంథాలు 46 అని శాసనం చేసింది.

సెప్తువజింత్ బైబుల్లో అదనంగా ఉన్న 7 గ్రంథాలు ఇవి : తోబీతు, యూదితు, బారుక్, మక్కబీయులు గ్రంథాలు రెండు, సొలొమోను జ్ఞాన గ్రంథం, సీరా జ్ఞాన గ్రంథం. ప్రొటెస్టెంటులు ఇవి కూడా ఉపయోగకరమైన పుస్తకాలేనని ఒప్పుకుంటారు. కాని వీటిని భగవత్ ప్రేరితమైన పుస్తకాలుగా అంగీకరించరు. అందువలన ఈ ఏడు పుస్తకాలను ప్రొటెస్టెంటులు "అపోక్రిఫా" అనే పేరుతో ప్రత్యేక గ్రంథంగా ముద్రిస్తారు. 'కల్పిత గ్రంథాల'ని ఈ పేరుకి అర్థం.

## ప్రేరణం

ఇతర పుస్తకాలలో లేని విశిష్టమైన భగవత్ ప్రేరణం బైబులులో ఉన్నదని క్రైస్తవుల విశ్వాసం. మనం కలాన్ని సాధనంగా చేసుకొని వ్రాసినట్లే, భగవత్ ప్రేరణం కూడా బైబులు రచయితలను సాధనంగా వాడుకొని వాళ్ళచేత దివ్య గ్రంథాలు వ్రాయించిందని దీని అర్థం – 2 పేతురు 1:21. అంటే బైబులు గ్రంథాలలోని భావాలు దేవునివి కనుక వాటి ప్రధాన రచయిత దేవుడేననీ, వాటిని సాధనాలుగా వ్రాసిన రచయితలు ప్రధాన రచయితలు కాక యథార్థ రచయితలనీ గ్రహించవలసి ఉంటుంది.

ఈ యథార్థ రచయితలు బైబులును ఆయా దేశాలలో, ఆయా కాలాలలో, ఆయా భాషలలో, ఆ యా సంస్కృతులకు అనుగుణంగా రచించారు. ఈ సంస్కృతులను అర్థం చేసికోనిదే బైబులు సరిగా బోధపడదు. బైబులులో విశేషంగా హీబ్రూ, గ్రీకు, రోమను సంస్కృతులు కనిపిస్తుంటాయి.

## దేశకాలాలు

ఇస్రాయేలు ప్రజలు మోషే నాయకత్వాన క్రీస్తు పూర్వం 13వ శతాబ్దంలో ఈజిప్టు నుండి తరలివచ్చారు. యూదులు ఫరో బానిసం నుండి తప్పించుకొని వచ్చిన కథ అప్పటి నుండి ముఖతః ప్రచారంలో ఉన్నది. అది ఒక సంప్రదాయంగా

రూపొందింది. క్రీస్తు పూర్వం 10వ శతాబ్దంలో సొలోమోను రాజు ఆస్థాన విద్వాంసులు ఈ మౌఖిక సంప్రదాయాన్ని గ్రంథస్తం చేయడం మొదలుపెట్టారు. అప్పటినుండి ఇంచుమించు క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దం దాకా పూర్వ నిబంధన గ్రంథాలను లిఖిస్తూనే వచ్చారు.

నూతన నిబంధన గ్రంథాలను క్రీస్తు ఉత్థానం తరువాత ప్రారంభించి మొదటి శతాబ్దం చివరి వరకు వ్రాస్తూ వచ్చారు. కనుక బైబులు లిఖిత రూపంలో పూర్తి కావడానికి కనీసం 1100 ఏండ్లయినా పట్టి ఉంటుంది.

పాలస్తీనా దేశం, బాబిలోనియా, రోమను సామ్రాజ్యం మొదలైన పలు తావుల్లో బైబులును వ్రాసారు. కాబట్టి బైబులు ఒకేచోట, ఒకే కాలంలో, ఒకే రచయిత లిఖించినది కాదు. అది 73 పుస్తకాల గ్రంథాలయం. ఐనా భగవత్ ప్రేరణ వలన వాటికి ఐక్యత సిద్ధించి, ఏక గ్రంథంగా రూపొందాయి.

యూదులూ క్రైస్తవులూ కూడా బైబులు పుస్తకాలను వేరువేరు విధాలుగా విభజిస్తూ వచ్చారు. ఆధునిక పద్ధతిననుసరించి పూర్వ నిబంధనను నాలుగు రకాల గ్రంథాలుగా విభజించవచ్చు. అవి: 1. ఆదిపంచకం, 2. చారిత్రక గ్రంథాలు, 3. జ్ఞానగ్రంథాలు, 4. ప్రవక్తల గ్రంథాలు. ఈ విభజనం ప్రకారం పూర్వ నిబంధన గ్రంథాలు మొత్తం ఇవి:

## I. ఆదిపంచకం - 5

1) ఆదికాండం 2) నిర్గమకాండం 3) లేవీయకాండం

4) సంఖ్యాకాండం 5) ద్వితీయోపదేశకాండం

## II. చారిత్రక గ్రంథాలు - 16

6) యెహోషువ 7) న్యాయాధిపతులు 8) రూతు

9,10) సమూవేలు గ్రంథాలు రెండు

11,12) రాజుల గ్రంథాలు రెండు

13,14) దినవృత్తాంతములు రెండు

15) ఎజ్రా 16) నెహెమ్యా 17) తోబీతు

18) యూదితు 19) ఎస్తేరు

20,21) మక్కబీయుల గ్రంథాలు రెండు

**III. జ్ఞానగ్రంథాలు - 7**

22) యోబు　　23) కీర్తనలు　　24) సామెతలు

25) ఉపదేశకుడు　　26) పరమగీతం　　27) సొలోమోను జ్ఞానగ్రంథం

28) సీరా గ్రంథం

**IV. ప్రవక్తల గ్రంథాలు - 18**

పెద్ద ప్రవక్తలు - నలుగురు

29) యెషయా　　30) యిర్మీయా　　31) విలాపవాక్యాలు

32) బారూకు　　33) యెహెజ్కేలు　　34) దానియేలు

చిన్న ప్రవక్తలు - పండ్రెండుమంది

35) హోషేయ　　36) యోవేలు　　37) ఆమోసు

38) ఓబద్యా　　39) యోనా　　40) మీకా

41) నహూము　　42) హబక్కూకు　　43) జెఫన్యా

44) హగ్గయి　　45) జెకర్యా　　46) మలాకీ

నూతన వేదాన్ని సువిశేషాలు, అపోస్తలుల కార్యాలు, జాబులు, దర్శన గ్రంథం (ప్రకటన గ్రంథం) అని నాలుగు రకాల గ్రంథాలుగా విభజించారు. అవి మొత్తం ఇవి :

**I. సువిశేషాలు - 4**

1) మత్తయి　　2) మార్కు　　3) లూకా　　4) యోహాను

**II. అపోస్తలుల చర్యలు - 1**

5) అపోస్తలుల చర్యలు

**III. జాబులు - 21**

పౌలు జాబులు - 14

6) రోమీయుల జాబు　　7,8) కొరింతీయుల జాబులు రెండు

9) గలతీయుల జాబు　　10) ఎఫేసీయుల జాబు

11) ఫిలిప్పీయుల జాబు 12) కొలొస్సీయుల జాబు

13,14) తెస్సలోనీయుల జాబులు రెండు

15,16) తిమోతి జాబులు రెండు 17) తీతు

18) ఫిలేమోను 19) హెబ్రేయుల జాబు

20) యాకోబు 21,22) పేతురు జాబులు రెండు

23,24,25) యోహాను జాబులు మూడు 26) యూదా

**IV. దర్శనగ్రంథం - 1**

27) దర్శనగ్రంథం

## గ్రంథ పరిచయం

ఇప్పుడు బైబులులోని ఒక్కొక్క పుస్తకంలోని విషయాన్ని సంగ్రహంగా పరిశీలిద్దాం. మొదట పూర్వవేదంతోను, అందులోను ఆదిపంచకంతోను ప్రారంభిద్దాం.

## I. ఆదిపంచకం

బైబులులో తొలి ఐదు పుస్తకాలుగా గణించే ఆది, నిర్గమ, లేవీయ, సంఖ్యా, ద్వితియోపదేశకాండాలనే పుస్తకాలు తొలుత ఏకగ్రంథంగానే ఉండేవి. కథా వస్తువును బట్టి వాటిని క్రమేణ ఐదు గ్రంథాలుగా విభజించారు. కనుక ఇవి కాలక్రమేణ పరిణామం చెందాయి. చాలామంది రచయితలు చాలాకాలాల్లో వీటి రచనా వ్యాసంగంలో పాల్గొన్నారు. కనుక ఆ గ్రంథాల్లో పునరుక్తులూ, కొన్నిచోట్ల పరస్పర విరుద్ధ వాక్యాలు కూడ తగులుతాయి. అంతమాత్రంచేత వీటి విలువ యేమీ తగ్గదు.

ఆదిపంచకంలోని ముఖ్యాంశం యూదులు ఫరో దాస్యం నుండి విముక్తి పొంది ఈజిప్టు నుండి తరలి రావడం, మోషే నాయకత్వాన సీనాయి కొండ దగ్గర యావే ప్రభువుతో నిబంధన చేసుకోవడం. ఈ గ్రంథాల్లో ప్రముఖంగా కనిపించే నాయకుడు మోషే కనుక ప్రాచీనులు అతడే వీటిని వ్రాశాడని భావిస్తూ వచ్చారు. కాని ఆధునికుల భావాల ప్రకారం మోషే స్వయంగా వీటిని వ్రాయలేదు. అతని మరణానంతరం చాలా యేండ్లకు గాని ఈ పుస్తకాలు పుట్టలేదు. కాని వీటిలోని భావాలు ప్రధానంగా మోషేవే. కనుక ఇవి అతని పేరు మీదుగా చెలామణి అవుతూ వచ్చాయి. యూదులు ఈ ఆదిపంచకాన్నే ధర్మశాస్త్రం, లేదా ఉపదేశం అని పిలుస్తారు. వాళ్ళ దృష్టిలో ఇవి పూర్వవేదంలోకెల్లా ముఖ్యమైనవీ, పరమ పవిత్రమైనవి. ఇక ఈ ఆదిపంచకంలోని ఒక్కొక్క గ్రంథాన్ని పరిశీలిద్దాం.

## ఆదికాండం

ఆదికాండం సృష్ట్యాదిని గురించీ, నరజాతి ప్రారంభాన్ని గురించీ, ఇస్రాయేలు పుట్టుకను గురించీ చెపుతుంది. కనుకనే దీన్ని ఆదికాండం అన్నారు. ఈ గ్రంథంలో తొలి 11 అధ్యాయాలూ ఆది దంపతుల సృష్టి, వాళ్ళ పతనమూ మొదలైన అంశాలు వర్ణిస్తాయి. 12-50 అధ్యాయాలు పితరులైన అబ్రాహాము, ఈసాకు, యాకోబు, యోసేపు మొదలైనవాళ్ళ చరిత్రలను వర్ణిస్తాయి. అబ్రాహాము విశ్వాసం ద్వారా దేవునికి ప్రీతిపాత్రుడయ్యాడు. ఇస్రాయేలు ప్రజలందరికీ తండ్రి అయ్యాడు. యోసేపు దైవబలం వలన మహాజ్ఞానియై విజయాలు సాధించాడు. ఈ తొలి పుస్తకం బైబులు అంతటికీ పునాదిలాంటిది. ఈ గ్రంథంలో వచ్చే కథలు కూడా చాల ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ పుస్తకం క్రీస్తు పూర్వం 1800-1500 సంవత్సరాల్లో జరిగిన చరిత్రను చెపుతుంది.

## నిర్గమకాండం

నిర్గమం అంటే బయటికి వెళ్ళడం. ఇస్రాయేలీయులు ఫరో దాస్యాన్నుండి తప్పించుకొని ఈజిప్టు నుండి బయటికి వెళ్ళారు. ఎడారిలో కొన్నాళ్ళు ప్రయాణం చేసి సీనాయి కొండ దగ్గర మోషే నాయకత్వాన యావే ప్రభువుతో నిబంధనం చేసికొన్నారు. ఈ సమయంలోనే దేవుడు ఆ ప్రజలకు ధర్మశాస్త్రం దయచేశాడు. పూర్వవేదమంతా ఈ రెండంశాల మీదనే ఆధారపడి ఉంటుంది కనుక ఇది అతి ముఖ్యమైన పుస్తకం. ఈ గ్రంథం 13వ శతాబ్దంలో జరిగిన కథ చెపుతుంది. ఈ రెండవ గ్రంథం నుండి ఐదవ గ్రంథం వరకు యూదుల చరిత్రలో మోషే ప్రముఖ వ్యక్తిగా కనిపిస్తాడు.

## లేవీయకాండం

లేవీయులంటే యాజకులు. యాజకులు ఆరాధనలో పాటించవలసిన నియమాలను చెప్పేదే లేవీయకాండం. ఈ పుస్తకం ఇస్రాయేలీయులు బాబిలోనియా ప్రవాసం నుండి పాలస్తీనా దేశానికి తిరిగివచ్చాక 6వ శతాబ్దంలో పాటించిన ఆరాధన నియమాలను చెపుతుంది. కాని ఈ నియమాలన్నీ మోషే ధర్మశాస్త్రం నుండే ప్రేరణాన్ని పొందాయి. కనుకనే ఈ పుస్తకాన్ని మోషే గొప్పతనానికి అద్దంపట్టే ఆదిపంచకంలో చేర్చారు. ఈ పుస్తకంలోని నియమాలు అంతశ్శుద్ధిని గాక శరీరశుద్ధినే ఎక్కువగా ప్రస్తావిస్తాయి. ఈ గ్రంథంలో చరిత్ర యేమీ ఉండదు.

## సంఖ్యాకాండం

ఎడారిలో ప్రయాణం చేసేపుడు మోషే ఇస్రాయేలీయుల జనాభా లెక్కలు సేకరించాడు. కనుకనే దీనికి సంఖ్యాకాండం అని పేరు. ఈ గ్రంథం ప్రజలు సీనాయి కొండ నుండి కాదేషు మీదుగా ఎడారిలో ప్రయాణం చేయడాన్ని వర్ణిస్తుంది. లేవీయకాండంలోని నియమాలు దీనిలో కూడ కనిపిస్తాయి. అయినా ఈ గ్రంథం ఎడారిలో జరిగిన వివిధ సంఘటనలతో ఆసక్తికరంగానే ఉంటుంది.

## ద్వితీయోపదేశకాండం

ప్రభువు సీనాయి కొండ దగ్గర మొదటిసారిగా ప్రజలకు ధర్మశాస్త్రాన్ని, లేక ఉపదేశాన్ని దయచేశాడు. ఈ ఉపదేశాన్నే మోషే ఎడారిలో తిరిగి రెండవసారి ప్రజలకు వినిపించాడు. కనుకనే దీనికి ద్వితీయోపదేశకాండం అని పేరు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దికల్లా యూదులు ధర్మశాస్త్రాన్ని ఉపేక్షించడం మొదలుపెట్టారు. కనుక ఆనాటి రచయితలు దాని విలువను నొక్కి చెప్పవలసి వచ్చింది. వాళ్ళు ఈ పుస్తకం ద్వారా ధర్మశాస్త్రాన్ని మళ్ళా సజీవం చేశారు. పుస్తకమంతా ధర్మశాస్త్రాన్ని గురించే చెపుతుంది. దానిమీద వివరణ చెపుతుంది.

## II. చారిత్రక గ్రంథాలు

ఈ శాఖకు చెందిన గ్రంథాలు యూదుల చరిత్రను చెపుతాయి. హీబ్రూ బైబులు వీటిని "పూర్వ ప్రవక్తల గ్రంథాలు" అని పిలుస్తుంది. అంటే ఈ పుస్తకాల్లో వచ్చే సంగతులు కేవలం చారిత్రకాంశాలు కాదనీ, ఆ చారిత్రకాంశాల ద్వారా ప్రభువు తన చిత్తాన్నీ రక్షణ ప్రణాళికనూ ప్రజలకు తెలియజేసాడనీ భావం. వీటిలో యోషువా, న్యాయాధిపతులు, సమూవేలు గ్రంథాలు రెండు, రాజుల గ్రంథాలు రెండు మొదట ఏకగ్రంథంగానే ఉండేవి. కాలక్రమేణ విభజింపబడ్డాయి. ఇక ఈ వర్గంలో ఒక్కో పుస్తకాన్ని గూర్చి విచారిద్దాం.

### యోషువా

మోషే గతించిన తర్వాత అతని అనుచరుడైన యోషువా ఇస్రాయేలీయులకు నాయకుడై 1250 ప్రాంతంలో వాళ్ళను వాగ్దత్త భూమికి చేర్చాడు. కనానీయుల నుండి కనాను మండలాన్ని జయించి ఇస్రాయేలు తెగలకు పంచి ఇచ్చాడు.

## న్యాయాధిపతులు

ఈ గ్రంథం వాగ్దత్తభూమిని జయించినప్పటి నుండి 1050 వరకు నడచిన చరిత్రను చెపుతుంది. ఇంకా రాజులు లేని ఆ ప్రాచీన కాలంలో దెబోరా, యెహూదు, గిద్యోను, యెఫ్తా, సంసోను మొదలైన న్యాయాధిపతులు ప్రజలను పరిపాలించారు. వాళ్ళ చరిత్రలన్నీ ఈ గ్రంథంలో వస్తాయి.

## రూతు

రూతు అన్యజాతియైన మోవాబీయుల ఆడపడుచు. బోవసు అనే సంపన్నుడైన యూదుణ్ణి పెండ్లాడి దావీదు రాజునకు ముత్తవ్వ అయింది. ఎజ్రా మొదలైన సంస్కర్తలు అన్యజాతి ప్రజలను యూదుల్లో చేర్చుకోరాదని శాసించారు. రూతు గ్రంథం ఈ సంకుచిత భావాల మీద తిరుగుబాటు చేస్తుంది. ఇది పాఠకులకు ఎంతో ఆసక్తిని పుట్టించే గ్రంథం.

## సమూవేలు గ్రంథాలు రెండు,
## రాజుల గ్రంథాలు రెండు

ఈ నాలుగు గ్రంథాలు 1050 నుండి 550 వరకు నడచిన ఇస్రాయేలు చరిత్రను, విశేషంగా రాజుల ఉదంతాలను వర్ణిస్తాయి. ప్రవక్తయైన సమూవేలు మొదటి రాజుగా సౌలును అభిషేకించాడు. అతడు భ్రష్టుడైపోగా దావీదును రెండవ రాజుగా అభిషేకించాడు. అతడు ఇస్రాయేలు తెగలను ఐక్యపరిచాడు. మందసాన్ని యెరూషలేముకు తీసికొనివచ్చాడు. దావీదు కుమారుడైన సొలోమోను యెరూషలేములో దేవళాన్ని కట్టించాడు. ఈ రాజు పాపాల వలన అతని అనంతరం దేశం యూదా, ఇస్రాయేలు అని రెండు భాగాలుగా చీలిపోయింది. 6వ శతాబ్దంలో ఆనాటి ప్రపంచ రాజ్యాలయిన అస్సిరియా బాబిలోనియా సామ్రాజ్యాలు యూదుల దేశాలను రెండింటినీ నాశం చేసాయి. వందలాది రాజులు పరిపాలించినా ఈ గ్రంథాలు వారిలో దావీదు, హిజ్కియా, యోషీయా అనే ముగ్గురు రాజులను మాత్రమే మెచ్చుకుంటాయి.

## దినవృత్తాంతాలు రెండు

ఈ గ్రంథాలు కూడా రాజుల చరిత్రలనే చెపుతాయి. వీటిని లేవీయ కాండను వ్రాసిన యాజకులు రచించారు. ఈ రచయితలకు దైవభక్తి ప్రధానం. ఈ దృష్టితోనే వీళ్ళు రాజుల చరిత్రలను వర్ణించారు. పై నాలుగు గ్రంథాలలో లేని నూతన విషయాలు ఈ పుస్తకాల్లో తగులుతాయి.

## ఎజ్రా, నెహెమ్యా

అయిదవ శతాబ్దంలో యూదులు బాబిలోనియా ప్రవాసం ముగించుకొని పాలస్తీనా దేశానికి తిరిగివచ్చారు. ఆ కాలంలో వాళ్ళ నాయకులు యాజకుడైన ఎజ్రా, రాష్ట్రాధిపతియైన నెహెమ్యా. వీళ్ళిద్దరూ ప్రజలను సంస్కరించడానికి చాల నియమాలు చేశారు. ధర్మశాస్త్రాన్నీ, బలులనూ పునరుద్ధరించారు. యెరూషలేమును దేవళాన్నీ పునర్నిర్మించడానికి పూనుకొన్నారు. ఈ నాయకుల చరిత్రలను చెప్పేవే ఈ రెండు గ్రంథాలు. తరువాత వచ్చిన రూతు, యోనా గ్రంథాలు వీళ్ళ సంస్కరణల్లోని సంకుచిత భావాల మీద తిరుగుబాటు చేశాయి.

## తోబీతు

యూదుల ప్రవాస కాలంలో జరిగిన కథలే తోబీతు, యూదితు, ఎస్తేరు గ్రంథాలు. ఇవి చారిత్రికాలు కాదు. కల్పిత కథలు. అయినా చాలా భక్తిమంతంగా ఉంటాయి. తోబీతు అన్నా దంపతుల కుమారుడు తోబియా. ఇతడు రఫాయేలనే దేవదూత సహాయంతో గండాలన్నీ తప్పించుకొని సారాను పెండ్లియాడాడు. ఈ గ్రంథం కుటుంబ ధర్మాలను అతి లలితంగా వర్ణిస్తుంది. ఇది నాలుగవ శతాబ్దంలో పుట్టిన పుస్తకం.

## యూదితు

అస్సిరియా సైన్యాధిపతియైన హోలోఫెర్నెసు యూదుల నగరమైన బెతూలియాను ముట్టడించాడు. ఆ నగరంలో వసించే వితంతువూ దైవభక్తురాలూ అయిన యూదితు హోలోఫెర్నెసును వంచించి అతని శిరస్సును నరుక్కొని వచ్చింది. తమ సైన్యాధిపతి చావడం చూచి శత్రుసైన్యం పారిపోయింది. ఇది రెండవ శతాబ్దంలో పుట్టిన గ్రంథం.

## ఎస్తేరు

యూదులు పర్షియా దేశంలో ప్రవాసులుగా జీవిస్తున్నారు. వాళ్ళ ఆడపడుచు ఎస్తేరు ఆ దేశపు రాజును పెండ్లి చేసికొంది. ఆ దేశపు మంత్రియైన హామాను కుట్రతో యూదులను నాశం చేయబూనాడు. ఎస్తేరు రాణి హామాను కుట్రను భగ్నం చేసి అతణ్ణి ఉరి తీయించి యూదులను కాపాడింది.

## మక్కబీయుల గ్రంథాలు రెండు

రెండవ శతాబ్దంలో గ్రీకు రాజయిన అంటియోకస్ ఎపిఫానిస్ యూదులను హింసించాడు. యూద మతాన్ని బహిష్కరించాడు. కొందరు యూదులు అతనికి

దడిసి తమ మతాన్ని విడనాడారు. కొందరు మాత్రం అతణ్ణి ప్రతిఘటించారు. వీరిలో యూదా, అతని సోదరులు ముఖ్యులు. వీరికే మక్కబీయులు అని పేరు. వీరు గ్రీకురాజు అక్రమముల నుండి యెరూషలేముకు విముక్తి కలిగించారు. దేవాలయాన్ని శుద్ధి చేశారు. మొదటి గ్రంథం ఈ చరిత్ర అంతా చెబుతుంది. రెండవ గ్రంథం ఈ పోరాటంలో పాల్గొన్న వీరుల చరిత్రలను మరో దృక్కోణం నుండి వర్ణిస్తుంది. ఈ రెండు గ్రంథాలకు పరస్పర సంబంధం లేదు.

## III. జ్ఞానగ్రంథాలు

అన్ని దేశాల్లోను జ్ఞానగ్రంథాలూ జ్ఞానసూక్తులూ వెలువడ్డాయి. జ్ఞానమంటే మంచి బుద్ధి, లేదా నీతి. మన దేశంలో పంచతంత్ర హితోపదేశాలూ నీతిశతకాలూ ఉన్నాయి. అలాగే ఇస్రాయేలు ప్రజల్లో కూడ జ్ఞానులు విజ్ఞాన సూక్తులను ప్రచారంలోకి తెచ్చారు. ఆ జ్ఞానులు విశేషంగా రాజాస్థానాల్లో వర్ధిల్లారు. సొలోమోను రాజు జ్ఞాన సాహిత్యానికి పోషకుడుగా కీర్తిగడించాడు. యూదుల జ్ఞానగ్రంథాలు ఎక్కువగా లౌకిక నీతిని గూర్చే మాట్లాడతాయి. ధర్మశాస్త్రం, నిబంధనం, ఎన్నిక, రక్షణం మొదలైన మత విషయాలను అట్టే పేర్కొనవు. జీవితంలో విజయాన్ని సాధించడం ఎలా అనేది ఈ గ్రంథాల్లోని ముఖ్య ప్రశ్న. అయినా దేవుని పట్ల భయభక్తులు చూపడమే విజ్ఞానంలోని ముఖ్యాంశం. యూదుల దృష్టిలో జ్ఞానం పుణ్యం, అజ్ఞానం పాపం. జ్ఞాని సజ్జనుడు, అజ్ఞాని దుష్టుడు.

6వ శతాబ్దంలో యూదుల రాజులు అంతరించారు. వాళ్ళ రాజ్యం నాశనమైంది. అప్పటినుండి వాళ్ళ జ్ఞానులు రాజులకు మారుగా జ్ఞానమే ప్రజలను నడిపిస్తుందని చెబుతూ వచ్చారు. ఈ జ్ఞానుల్లో రెండు వర్గాలవాళ్ళున్నారు. మొదటి వర్గంవాళ్ళు ఆశావాదులు. వీళ్ళు జ్ఞానాన్ని అలవర్చుకొన్న నరులు సుఖశాంతులతో జీవిస్తారనీ విజయాలను చేపడతారనీ బోధించారు. రెండవ వర్గంవాళ్ళు నిరాశావాదులు. వీళ్ళు ఈ లోకంలో జ్ఞానీ సజ్జనుడూ అయిన నరుడు కష్టాలననుభవిస్తుంటే అజ్ఞానీ దుష్టుడూ అయిన నరుడు సుఖాలననుభవిస్తున్నాడని వాపోయారు. అయినా ఆ ఉభయ వర్గాల రచయితలూ నిజమైన జ్ఞానం కొరకు తపించిపోయారు. ఇక ఈ వర్గానికి చెందిన పుస్తకాలలో ఒక్కొక్కదాన్ని పరిశీలిద్దాం.

## యోబు

ఈ గ్రంథం యోబు భక్తుని చరిత్ర చెబుతుంది. అతడు ఎన్ని కష్టాలు వచ్చినా దేవుణ్ణి దూషించలేదు. యోబు భక్తికి మెచ్చుకొని కడన దేవుడు అతణ్ని బహూకరించాడు. లోకంలో మంచివాళ్ళకు కష్టాలెందుకు వస్తాయి అనేది ఈ పుస్తకం పరిష్కరించబూనిన సమస్య. యోబూ అతని నలుగురు స్నేహితులూ కలిసి ఈ సమస్యకు రకరకాల పరిష్కారాలు సూచించబోతారు. కాని ఏ పరిష్కారమూ తృప్తిని కలిగించదు. కడన ఈ సమస్యను పరిష్కరించకుండానే గ్రంథం ముగుస్తుంది. ఈ పుస్తకాన్ని అర్థం చేసుకోవడం కష్టం. కాని ఈ గ్రంథకర్త చాలా లోతైన భావాలు చెప్పాడు. ఇతడు ప్రపంచంలోని మహా రచయితల కోవకు చెందినవాడు. ఇతడు ఇశ్రాయేలు జ్ఞానుల్లో నిరాశావాదుల పక్షాన నిలుస్తాడు. యోబు కథ చారిత్రకమైంది కాదు, నీతిబోధకమైంది.

## కీర్తనలు

కీర్తనల గ్రంథంలో 150 కీర్తనలు ఉన్నాయి. ఇవన్నీ జ్ఞానాన్ని బోధించవు. వీటిల్లో కొన్ని మాత్రమే ఆ వర్గానికి చెందుతాయి. అయినా సామాన్యంగా ఈ గ్రంథాన్ని జ్ఞానవాఙ్మయంలోనే చేరుస్తుంటారు.

కీర్తనల గ్రంథం ఇస్రాయేలు ప్రజల జప పుస్తకం, సంగీత గ్రంథం. దానిలోని 150 కీర్తనలను దేవళంలో జరిగే ఆరాధనలో గీతాలుగా పాడేవాళ్ళు. లేవీయులు వీటిని స్వయంగా దేవళంలో పాడారు, ప్రజలచే పాడించారు.

దావీదు రాజు కొన్ని కీర్తనలను వ్రాశాడు. కాని కీర్తనలన్నీ అతడు వ్రాసినవి కావు. దావీదు వ్రాసిన కీర్తనలను అతని తర్వాత వచ్చిన హీబ్రూ రచయితలు అవసరాన్ని బట్టి కొంతవరకు మార్చారు కూడా. కీర్తనల గ్రంథం కాలక్రమేణ పెరుగుతూ వచ్చింది. అది పూర్తి కావడానికి కనీసం ఆరువందల యేండ్లయినా పట్టి ఉండాలి.

## సామెతలు

సొలోమోను రాజు మహాజ్ఞాని. అతడు స్వయంగా చాలా జ్ఞానవాక్యాలు చెప్పాడు. ఇతరులను ప్రేరేపించి చాలా సూక్తులు చెప్పించాడు కూడా. యూదుల ధర్మశాస్త్ర సాహిత్యానికంతటికీ మోషేను కర్తగా ఊహించినట్లే, జ్ఞాన సాహిత్యానికంతటికీ

సొలోమోనును కర్తగా భావించారు. సామెతల గ్రంథం సొలోమోను రాజు పేరుమీదుగా ప్రచారంలోకి వచ్చింది. కాని దీనిలో ఇతరుల రచనలను కూడా చేర్చారు. ఈ పుస్తకం అయిదవ శతాబ్దంలో రూపుదిద్దుకొన్నది. పుస్తకమంతా నీతి వాక్యాలతో నిండి ఉంటుంది. ఇవి మన సామెతల్లాగానూ, నీతి శతకాల్లోని పద్యాల్లాగాను ఉంటాయి. జ్ఞానం పుణ్యం, అజ్ఞానం పాపం. జ్ఞానంతో జీవించేవాడు సుఖశాంతులు అనుభవిస్తాడు. అజ్ఞానంతో జీవించేవాడు దుఃఖం పాలవుతాడు. ఇది ఈ గ్రంథం సారాంశం.

## ఉపదేశకుడు

యోబు గ్రంథకర్తలాగే ఈ గ్రంథకర్త కూడా నిరాశావాది. జ్ఞానాన్ని పాటించినంత మాత్రాన్నే సుఖశాంతులు కలుగవు. లోకంలో పుణ్యకార్యాలు చేసిన జ్ఞానులు కష్టాలననుభవిస్తున్నారు. దుష్టకార్యాలు చేసిన పాపులు సుఖాలనుభవిస్తున్నారు. మరి న్యాయబద్ధంగా జీవించడం వలన లాభమేమిటి? ఇది ఈ రచయిత వాదం. లోకంలోని వస్తువులన్నీ వ్యర్థమైనవే. ఏ వస్తువూ మనకు పూర్ణ సుఖాన్నీయలేదు. ఇది ఈ రచయిత ముఖ్య భావం. యోబు గ్రంథంలాగా ఈ పుస్తకం కూడా లోకంలో చెడ్డ ఎందుకు ఉందని ప్రశ్నిస్తుంది. తగిన పరిష్కారం మాత్రం సూచించదు. ఈ పుస్తకం సొలోమోను పేరుమీదుగా వెలువడింది.

## పరమగీతం

యథార్థంగా ఈ పుస్తకం జ్ఞానగ్రంథం కాదు. స్థూలంగా దీన్ని ఈ వర్గం పుస్తకాల్లో చేర్చారు. అంతే. ఓ ప్రేమికుడు తన ప్రియురాలిని వెదకడం, వాళ్ళిద్దరూ కలుసుకొని ఆనందించడం ఈ పుస్తకంలో ఇతివృత్తం. ఈలాంటి పుస్తకం బైబుల్లోకి ఎందుకు వచ్చింది? ఈ ప్రేమికుడూ ప్రియురాలూ భగవంతునికీ ప్రజలకూ చిహ్నంగా ఉంటారు. యావే ప్రభువు ఇస్రాయేలు ప్రజను తన వధువుగా జేసుకొని ఆదరించాడు. ఈ సంకేతం వల్ల యూదులు దీనిని పవిత్ర గ్రంథంగా భావించి పూర్వవేదంలో చేర్చారు. ఈ పుస్తకం పాటల రూపంలో ఉండి లలితమైన భావాలతో నిండి ఉంటుంది. ఈ పుస్తకం కూడా సొలోమోను పేరు మీదుగానే వెలువడింది.

## సొలోమోను జ్ఞానగ్రంథం

ఎవరో అనామక రచయిత క్రీస్తు పూర్వం మొదటి శతాబ్దంలో ఈ పుస్తకాన్ని సొలోమోను పేరు మీదుగా వెలువరించాడు. మామూలుగా యూదులకు గ్రీకు సంస్కృతి గిట్టదు. కాని ఈ రచయిత గ్రీకు సంస్కృతికి అలవాటు పడిన యూదుడు.

గ్రీకుల భావాన్ననుసరించి ఇతడు నరుణ్ణి దేహాత్మలుగా విభజించాడు. జ్ఞాని కష్టాలలో చనిపోయినా మరణంతో అతని జీవం అంతం కాదు. అతని ఆత్మ తర్వాత సుఖాన్ని పొందుతుంది. కనుక జ్ఞానం తప్పకుండా సుఖాన్ని కలిగిస్తుంది. ఇది ఈ రచయిత వాదం. ఈ సూత్రం యోబు గ్రంథ రచయితకూ ఉపదేశక గ్రంథ రచయితకూ తెలియదు. వాళ్ళు యూదుల పద్ధతిలో మరణంతో నరుని జీవితం అంతమవుతుందను కొన్నారు. కనుక లోకంలో సజ్జనులకు కష్టాలెందుకు వస్తాయి అన్న ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయారు. ఈ రచయిత చెప్పగలిగాడు. అది ఇతని గొప్పతనం. ఈ గ్రంథం జ్ఞానప్రశంసలతో నిండి ఉంటుంది.

### సీరా జ్ఞానగ్రంథం

ఇది జ్ఞాన గ్రంథాలన్నిటిలోను ఎక్కువ సూక్తులు కలిగిన గ్రంథం. చాలా నైతిక విషయాలను బోధిస్తుంది. క్రీస్తు పూర్వం రెండవ శతాబ్దంలో బెన్‌సీరా దీనిని వ్రాశాడు. యూదులు గ్రీకు సంస్కృతీ ప్రభావానికి లొంగకుండా ఉండాలని ఇతని ఆశయం. జ్ఞాన గ్రంథాలన్నిటిలోను బహుశ ఇది ఎక్కువ ఉపయోగకరమైనది. చాలా భక్తిమంతంగా కూడా ఉంటుంది.

## IV. ప్రవక్తలు

ప్రవక్త లేక దీర్ఘదర్శి అంటే మనం భవిష్యత్తును తెలియజేసేవారు అనుకొంటాం. ఇది ప్రవక్త చేసే పనుల్లో ఒకటి మాత్రమే. ప్రవక్త ప్రధానంగా దేవుని పేరు మీదుగా మాటలాడేవాడు. దేవుని చిత్తాన్ని తెలియజేసేవాడు. తాను దేవుని సందేశాన్ని విని దాన్ని ప్రజలకు వినిపించేవాడు. కనుకనే ప్రభువు తన వాక్యాన్ని తీసి యిర్మీయా నోటిలో పెట్టాడు. ఇస్రాయేలు ప్రవక్తలు భగవంతుణ్ణి అనుభవానికి తెచ్చుకొని అతనితో ఐక్యమై జీవించిన మహా భక్తులు. వాళ్ళు దేవుడు ఇస్రాయేలు ప్రజలను ఎలా నడవమని అభిలషిస్తాడో, తాను వాళ్ళకు ఏయే మేళ్ళు చేయాలని కోరుకొంటాడో అర్థం చేసికొని ఆ ప్రభువు చిత్తాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూండేవాళ్ళు. ప్రజలను దేవుని మార్గాల్లో నడవమనీ, దేవునికి లొంగమనీ హెచ్చరిస్తుండేవాళ్ళు. కనుక వాళ్ళు దేవుని చేతిలో ఉపకరణంలాంటివాళ్ళు. అతని నోటి పలుకులాంటివాళ్ళు.

మొదటి మహా ప్రవక్త మోషే. అతడు యావే ప్రభువు హృదయాన్నీ, ఈజిప్టు నిర్గమనం భావాన్నీ ప్రజలకు విశదీకరించాడు. సీనాయి కొండ దగ్గర నిబంధనం ద్వారా ఇస్రాయేలును దేవుని ప్రజను చేసాడు. తర్వాత సమూయేలు, ఏలీయా,

ఎలీషా మొదలైన ప్రవక్తలు మోషే సంప్రదాయాన్ని కొనసాగించారు. సీనాయి దగ్గర ప్రారంభమైన యావే మతాన్ని వృద్ధిలోకి తీసుకువచ్చారు. 8వ శతాబ్దంలో ఆమోసుతో మొదలుపెట్టి ప్రవచనమే వృత్తిగా గల ప్రవక్తలు బయలుదేరారు. వీళ్ళ ప్రవచనాలు గ్రంథస్థమై బైబులు పుస్తకాలయ్యాయి.

ప్రవక్తలు స్వయంగా గ్రంథాలు వ్రాయలేదు. వాళ్ళ శిష్యులు తమ గురువుల బోధలను సంకలనం చేశారు. ఈ బోధలకు పరిచయ వాక్యాలూ వివరణలూ చేర్చి గ్రంథాలుగా రూపొందించారు. కనుక నేడు మనం ప్రవక్తల గ్రంథాలు అనుకొనేవాటిల్లో కొన్ని భాగాలు మాత్రమే ప్రవక్తల స్వంత పలుకులు. ప్రవక్తలు తమ ప్రవచనాలను రకరకాల రూపాల్లో పలికారు. గేయాలు, వచనాలు, సామెతలు, దైవోక్తులు, పిట్టకథలు, ఉపదేశాలు, కీర్తనలు, విలాపవాక్యాలు, అపహాస వాక్యాలు మొదలైన పెక్కు రూపాల్లో ప్రవచనాలు కనిపిస్తాయి.

ప్రవక్తల్లో యెషయా, యిర్మీయా, యెహెజ్కేలు, దానియేలు అనేవాళ్ళు పెద్ద ప్రవక్తలు. అంటే వీరి పేరిట ఉన్న గ్రంథాలు పెద్దవి. వీళ్ళుగాక పండ్రెండుమంది చిన్న ప్రవక్తలు కూడా ఉన్నారు. వీళ్ళ పేరిట ఉన్న గ్రంథాలు చిన్నవి. నేటి బైబుళ్ళలో ఈ ప్రవక్తల గ్రంథాలు యెషయాతో ప్రారంభమై మలాకీతో ముగుస్తాయి. కాని ఇది కాలక్రమ పద్ధతి కాదు. విషయ గౌరవాన్ని బట్టి ఈ గ్రంథాలను ఈ క్రమంలో అమర్చారు. ఇక ఒక్కో ప్రవక్తను పరిశీలిద్దాం.

## పెద్ద ప్రవక్తలు నలుగురు

### యెషయా

యెషయా గ్రంథంలో కనీసం ముగ్గురు ప్రవక్తల బోధలయినా కనిపిస్తాయి. దీనిలో 66 అధ్యాయాలున్నాయి. 1-39 అధ్యాయాలు 765-690 సంవత్సరాలలో యెరూషలేములో జీవించిన యెషయా బోధలు. ఆ కాలంలో అస్సిరియా గొప్ప రాజ్యంగా వృద్ధి చెంది 721 లో ఉత్తర దేశమైన ఇస్రాయేలును కబళించింది. దక్షిణ రాజ్యమైన యూదా స్వీయ రక్షణకు కొంతకాలం అస్సిరియాతోనూ, కొంతకాలం ఈజిప్టుతోనూ సంధిచేసుకొంటూ ఉండేది. కాని ఆ రోజుల్లో ఏ రాజును ఆశ్రయిస్తే ఆ రాజు దేవుళ్ళను కొలవాలి. కనుక యూదులు అన్యదైవాలను పూజించే ప్రమాదం వాటిల్లింది. ఈ పరిస్థితుల్లో యెషయా ప్రవచనం చెప్పడం ప్రారంభించాడు. అతని బోధల ప్రకారం ఇస్రాయేలుకు ఏకైక రాజు యావే. అతడు పవిత్రుడైన ప్రభువు.

చరిత్రనంతటినీ నడిపించేవాడు అతడే. ఇస్రాయేలు అతణ్ణి ఆశ్రయించి అతనినుండే విజయం సాధించాలి. అన్యరాజులను ఆశ్రయించకూడదు. యెషయా చెప్పినట్లే అస్సిరియా రాజైన సన్హెరీబు 701 లో యెరూషలేమును ముట్టడించి కూడా ఓడిపోయాడు. యావే ప్రభువు ఆ పట్టణాన్ని కాపాడాడు. యెషయా మహాభక్తుడు, మహా కవి. అతని యంత గొప్ప ప్రవక్త మళ్ళా పుట్టలేదు. అతని గ్రంథంలో వచ్చే ఇమ్మానువేలు ప్రవచనాలు చాలా ముఖ్యమైనవి. అవి రాబోయే మెస్సీయాను సూచిస్తాయి. ఈ ప్రవక్త భగవంతుని పావిత్ర్యాన్నీ, నరుని అపవిత్రతనీ బహు సునిశితంగా వర్ణించాడు.

ఈ గ్రంథంలో వచ్చే 40-55 అధ్యాయాలు మరో ప్రవక్తవి. బాబిలోనియా ప్రవాసంలో జీవించిన యెషయా శిష్యుడెవరో ఈ ప్రవచనాలు చెప్పాడు. అతడు ప్రజలు బాబిలోనియా ప్రవాసాన్ని ముగించుకొని తిరిగి రావడం, పూర్వం ఇస్రాయేలీయులు ఈజిప్టు ప్రవాసాన్ని ముగించుకొని తిరిగి వచ్చినట్లుగా ఉంటుందని చెప్పాడు. కనుక పునరాగమనం ఈ రెండవ భాగంలో ముఖ్యాంశం. ఈ ప్రవచనం 53వ అధ్యాయంలో సుప్రసిద్ధమైన బాధామయ సేవకుని వర్ణనం వస్తుంది. ఈ రెండవ భాగాన్ని చెప్పిన ప్రవక్త కూడా మొదటి యెషయా అంతటి రచయిత.

కడపటి 55-66 అధ్యాయాలు బాబిలోనియా ప్రవాసం ముగిసి ప్రజలు యెరూషలేముకు తిరిగి వచ్చాక ఇతర ప్రవక్తలు చెప్పినవి. వీళ్ళంతా తొలి యెషయా శిష్యులే. ఈ మూడవ భాగంలో ప్రభువు యూదులనే కాక అన్యజాతులను కూడా రక్షిస్తాడనే విశాల భావాలు కనిపిస్తాయి.

## యిర్మీయా

ఈ ప్రవక్త 640-590 కాలంలో జీవించాడు. అస్సిరియా రాజ్యం పతనమై బాబిలోనియా రాజ్యం వృద్ధిలోకి వచ్చింది. 587లో బాబిలోనియా ప్రభువైన నెబుకద్నెజరు యెరూషలేమును ముట్టడించి నాశనం చేశాడు. దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. యూదులను బాబిలోనియాకు బందీలనుగా గొనిపోయాడు. ఈ వినాశాన్ని ముందుగానే తెలియజేసి యూదులను పరివర్తనం చెందండని హెచ్చరించడమే యిర్మీయా ప్రవచనం. కాని యూదులు అతని ప్రబోధాన్ని వినలేదు. మొదటినుండీ అతణ్ణి ఎదిరించి హింసిస్తూ వచ్చారు. యిర్మీయా తన ప్రజల నుండి చాలా బాధలు అనుభవించాడు. జనులు తన మాట వినరనీ, తనకు అపజయం తప్పదనీ తెలిసి

కూడా ప్రభువు వలన నిర్బంధితుడై ప్రవచనం చెబుతూపోయాడు. అతని బాధలు నూతన వేదంలో క్రీస్తు బాధలను సూచిస్తాయి. యిర్మీయా యూదుల చరిత్రలో బహుకష్టమైన కాలంలో జీవించాడు. స్వయంగా కష్టాలు అనుభవించాడు. ఆ ప్రభువు ఆజ్ఞపై అవివాహితుడుగా ఉండిపోయాడు. ఇతని బోధలూ, జీవితమూ కూడా పాఠకులకు ఎంతో సానుభూతిని కలిగిస్తాయి.

## విలాపగీతాలు

587 బాబిలోనియా రాజు యెరూషలేము దేవళాన్ని నాశనం చేశాడు. దేవాలయ ధ్వంసానికి విలపిస్తూ చెప్పిన శోకగీతాలే ఈ గ్రంథం. ఈ గీతాల్లో ఒక్కో చరణం హీబ్రూ భాషలోని ఒక్కో అక్షరంతో ప్రారంభమౌతుంది. ఈ గీతాల్లోని భావాలు యిర్మీయా భావాలతో సరిపోయినా, వీటి రచయిత మాత్రం అతడు కాదు. అయినా అతని పేరు మీదుగానే ఈ గ్రంథం ప్రచారంలోకి వచ్చింది.

## బారూకు

ఈ పుస్తకం యిర్మీయా లేఖకుడైన బారూకు పేరుమీదుగా ప్రచారంలోకి వచ్చింది. ఇది పశ్చాత్తాపం, ధర్మశాస్త్రం, ప్రవాసం నుండి తిరిగి రావడం మొదలైన అంశాలను ప్రస్తావించే చిన్న పుస్తకం.

## యెహెజ్కేలు

ఈ ప్రవక్త 600 ప్రాంతంలో ప్రజలతోపాటు బాబిలోనియా ప్రవాసానికి వెళ్ళాడు. అక్కడి యూదులు మొదటలో ప్రవాసం స్వల్పకాలం మాత్రమే ఉంటుందనుకొన్నారు. కాని ఈ ప్రవక్త అది దీర్ఘకాలం కొనసాగుతుందని రూఢిగా తెలియజేశాడు. ప్రవాసంలో నిరుత్సాహం చెందిన యూదులను ప్రోత్సహించాడు. చనిపోయిన యూద మతం మళ్ళా ఉత్థానమౌతుందనీ, ధ్వంసమైన దేవాలయాన్ని మళ్ళీ నిర్మిస్తారనీ బోధించి ప్రజల్లో ఆశాభావాలు రేకెత్తించారు. ప్రజలు పవిత్రులైన యాజకులుగా జీవించాలని హెచ్చరించాడు. ఇతడు స్వయంగా యాజకుడు. కనుక యాజకులు మెచ్చుకొనే దేవాలయం, ఆరాధన, కర్మకాండలలో పాటించవలసిన శుద్ధి, ధర్మశాస్త్రానుసరణం మొదలైన భావాలు ఇతని బోధల్లో విరివిగా కనిపిస్తాయి. ఇతని ప్రవచనం నాలుగు పెద్ద దర్శనాల రూపంలో ఉంటుంది. నరుడు నూతన హృదయాన్ని, నూతన ఆత్మనీ పొందాలనేది ఇతని ప్రధాన బోధ.

## దానియేలు

ఈ గ్రంథం 165 ప్రాంతంలో పుట్టింది. ఆ కాలంలో అంటియోకస్ ఎపిఫానెస్ అనే గ్రీకు రాజు యూదులను హింసిస్తుండేవాడు. ఈ హింసకు గురైనవాళ్ళకు ఓదార్పు కలిగించడానికి రచయిత ఈ గ్రంథం రాశాడు. ప్రభువు తన భక్తులను నాశనం కానీయడని ధైర్యం చెప్పాడు. ఈ పుస్తకంలో ప్రవచనానికి మారుగా దర్శనాల శైలి చోటుచేసుకుంది. ప్రవక్త తాను చెప్పదలచుకొన్న అంశాలను స్వయంగా దర్శనాల్లో చూచినట్లుగా చెబుతుంటాడు. యెహెజ్కేలుతోనే తలెత్తిన ఈ శైలి ఈ పుస్తకంలో శిఖరాన్నందుకొంది. ఈ గ్రంథానికి దీటుగా నూతన వేదంలో దర్శనగ్రంథం ఉద్భవించింది. దానియేలు ప్రవచనం పూర్వవేదంలో తొలిసారిగా ఉత్థానాన్ని పేర్కొంటుంది.

## చిన్న ప్రవక్తలు 12 మంది

ఇక్కడ చిన్న ప్రవక్తలు అంటే వీళ్ళ పేరు మీదుగా ప్రచారంలోకి వచ్చిన గ్రంథాలు చిన్నవని అర్థం. వీళ్ళు చెప్పిన సందేశం తక్కువ విలువైందేమీ కాదు. ఇక్కడ ఈ ప్రవక్తల గ్రంథాలను వాటిని బైబుల్లో అమర్చిన క్రమాన్ని బట్టి కాక, వాళ్ళు జీవించిన కాలక్రమాన్ని అనుసరించి పరిశీలిద్దాం.

### ఆమోసు

ఇతడు 750 ప్రాంతంలో జీవించాడు. ఉత్తర రాజ్యమైన ఇస్రాయేలుకు చెందినవాడు. మనకు తెలిసినంతవరకు ప్రవక్తలందరిలోనూ మొట్టమొదటిసారిగా గ్రంథరూపం దాల్చింది ఇతని ప్రవచనమే. ఆమోసు చదువు సంధ్యలు లేని మొరటువాడు. గొర్రెల కాపరి. అయినా ప్రభువు అతణ్ణే ఎన్నుకొన్నాడు. అతని కాలంలో ఇస్రాయేలు రాజ్యం సుఖభోగాలతో జీవిస్తూ పేదలకు అన్యాయం చేస్తూంది. కనుక ప్రవక్త ఈ విలాస జీవితాన్ని ఖండించాడు. పేదసాదలకు న్యాయం చేకూర్చమని ధనవంతులను హెచ్చరించాడు. ప్రజలు తమ బుద్ధులు మార్చుకోకపోతే అస్సిరియా రాజు దండెత్తివచ్చి వాళ్ళను శిక్షిస్తాడని చెప్పాడు. ఆ శిక్షాదినాన్ని "ప్రభువు రోజు"గా గణించాలని వాకొన్నాడు. ఈతని ప్రవచనం నిండా ఈ దైవశిక్షను గూర్చిన బెదిరింపులు కనిపిస్తాయి.

## హోషేయ

ఇతడు కూడా ఉత్తర రాజ్యానికి చెందినవాడే. ఆమోసుకు సమకాలికుడు. కాని ఆమోసు దైవశిక్షను గూర్చి బోధిస్తే ఇతడు దైవప్రేమను గూర్చి బోధించాడు. ఈ ప్రవక్త భార్యయైన గోమెరు ఇతణ్ణి విడనాడి వ్యభిచారిణి అయింది. కాని ప్రవక్త ఆమెను గాఢంగా ప్రేమించాడు. కనుక ఆమెను కొలదిగా శిక్షించి మరల స్వీకరించాడు. ఈ గోమెరులాగే ఇస్రాయేలు ప్రజలు కూడా సీనాయి నిబంధనం ద్వారా యావే వధువయ్యారు. కాని ఆ ప్రజలు ప్రభువును విడనాడి అన్యదైవాలను కొలుస్తున్నారు. అది వ్యభిచారం లాంటిది. కనుక ప్రభువు వాళ్ళను అస్సిరియా ప్రవాసం ద్వారా శిక్షించి మరల తన ప్రజలనుగా చేసికొంటాడు. ఇది ఈ ప్రవక్త సందేశం. ఈ పుస్తకంలో ప్రవక్త మాటలు మాత్రమే కాక, అతని జీవితం కూడా ప్రవచనమౌతుంది. ఈ దృష్టితో చూస్తే ఇది బైబుల్లో విలక్షణమైన గ్రంథం. భగవంతునికి ప్రజలపట్ల ఉండే ప్రేమ భర్తకు భార్య పట్ల ఉండే ప్రేమలాంటిదని ఈ ప్రవక్త చెప్పాడు. పూర్వవేదంలో యెషయా, యిర్మీయా వంటి మహా ప్రవక్తలు హోషేయ వలన ప్రభావితులయ్యారు.

## మీకా

ఇతడు దక్షిణ రాజ్యమైన యూదాకు చెందినవాడు. యెషయాకు సమకాలికుడు. ప్రజలు తమ దుర్బుద్ధులను మార్చుకొని దేవునికి విధేయులు కావాలనీ, లేకపోతే ప్రభువు ఇస్రాయేలు రాజ్యాన్ని వలె యూద రాజ్యాన్ని కూడా శిక్షిస్తాడనీ ఇతని ప్రధాన బోధ. ఇతడు మెస్సీయ బేత్లెహేములో పుడతాడని చెప్పాడు. నూతన వేదంలో మత్తయి ఈ ప్రవచనాన్ని ఉదాహరించాడు.

## జెఫన్యా

ఇతడు 640-609 కాలంలో జీవించాడు. ప్రభువు యూదాను శిక్షిస్తాడని ఇతని ప్రధాన బోధ. ఇతడు దీనులైనవారిని ప్రభువు రక్షిస్తాడని చెప్పాడు. ఇతని నాటి నుండి యూదుల్లో దీనుల వర్గం ప్రాముఖ్యంలోనికి వచ్చింది.

## నహూము

అస్సిరియా రాజధానియైన నినివే నాశమౌతుందని ఇతని ప్రవచనం. ఈ ప్రవక్త చెప్పినట్లే 612 లో నినివే కూలింది.

### హబక్కూకు

బాబిలోనియా యూదాను శిక్షిస్తుందనీ, అటుపిమ్మట ప్రభువు బాబిలోనియాను కూడా శిక్షిస్తాడనీ అతని బోధ. యూదా ప్రజలకంటే దుష్టులైన బాబిలోనియులు యూదాను శిక్షించడం దేనికా అని ఈ ప్రవక్త విస్తుపోయాడు. నరుడు భగవంతుణ్ణి నమ్మి జీవించాలని ఇతని ముఖ్యబోధ.

### హగ్గయి

ఇతడు యూదులు బాబిలోనియ ప్రవాసం నుండి తిరిగి వచ్చిన పిదప 520 ప్రాంతంలో ప్రవచించాడు. దేవాలయాన్ని పునర్నిర్మించాలనీ, రెండవ దేవాలయం మొదటి దేవాలయం కంటే వైభవంగా ఉంటుందనీ ఇతని సందేశం.

### జెకర్యా

ఇతడు కూడ హగ్గయి సమకాలికుడు. అతని వలె ఇతడు కూడ దేవాలయాన్ని పునర్నిర్మించమని ప్రజలను హెచ్చరించాడు. ప్రజలు దేవాలయంలాగా పవిత్రంగా ఉండాలనీ, మెస్సీయా రాజు త్వరలో వేంచేస్తాడనీ బోధించాడు. ఈ గ్రంథంలో 9-14 అధ్యాయాలు జెకర్యా చెప్పినవి కావు. 4వ శతాబ్దంలో ఇతరులు చేర్చినవి.

### మలాకీ

ఈ ప్రవక్త 445 ప్రాంతంలో ప్రవచించాడు. హగ్గయి జెకర్యా ప్రవక్తల అనంతరం ప్రజల్లో మతపరమైన ఉత్సాహం నశించింది. వాళ్ళు అన్యజాతులతో వివాహాలు ప్రారంభించారు. విడాకులు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో మలాకీ యాజకులూ ప్రజలూ కూడా పవిత్రులుగా జీవించాలని ప్రబోధించాడు.

### ఓబద్యా

ఇతడు 5వ శతాబ్దానికి చెందినవాడు. ఇతని పుస్తకం ప్రవక్తల గ్రంథాలన్నిటిలోనూ చిన్నది. 21 వచనాలు మాత్రమే. ఈ ప్రవచనం ఎదోమీయుల మీద శాపవచనాలు. వీళ్ళు ఇస్రాయేలీయులకు పొరుగుజాతివాళ్ళు. 586లో బాబిలోనియులు యెరూషలేము దేవళాన్ని నాశనం చేస్తుంటే వీళ్ళు కూడ ఆ శత్రువులతో చేతులు కలిపారు. అందుకే వాళ్ళమీద ఈ శాప వచనాలు.

## యోవేలు

ఇతడు నాలుగవ శతాబ్దానికి చెందినవాడు. ఇతని కాలంలో మిడతల దండు దిగివచ్చి దేశాన్ని నాశం చేసింది. ఈ సంఘటనను ఆధారంగా తీసికొని ప్రవక్త, ప్రజలు దైవశిక్షకు భయపడి తమ పాపాలకు పశ్చాత్తాపపడాలనీ, విశుద్ధ జీవితం జీవించాలనీ బోధించాడు. ప్రార్థనలూ ఉపవాసాలూ చేయాలని ప్రబోధించాడు. విశేషంగా ఇతడు మెస్సీయ కాలం వచ్చినపుడు దేవుడు తన ప్రజలందరి మీద పవిత్రాత్మను కుమ్మరిస్తాడని నుడివాడు. కనుక ఇతడు పవిత్రాత్మకు సంబంధించిన ప్రవక్త.

## యోనా

ఈ గ్రంథకర్త నాలుగవ శతాబ్దానికి చెందినవాడు. యోనా కథ చారిత్రకం కాదు. కల్పితమైన నీతి కథ. సంకుచితమైన మనస్తత్వంతో తాము మాత్రమే రక్షణం పొందుతామనీ, అన్య జాతులన్నీ నశిస్తాయనీ చెబుతున్నారు. ఎజ్రా, నెహెమ్యా సంస్కరణలు కూడా యూదులకు అన్యజాతులతో సంపర్కం పనికిరాదని చెప్పాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ప్రవక్త ప్రభువు అన్యజాతులను కూడా రక్షిస్తాడని బోధించాడు. యోనా కథలో ఆ ప్రవక్త ఊహించినట్లుగా అతని బోధ విని అన్యజాతి నగరమైన నీనివే పరివర్తనం చెందింది. ప్రభువు దానిని కాపాడాడు. ఇది యోనాకు నచ్చక దేవుని మీద సుమ్మర్లు పడ్డాడు. అపుడు ప్రభువు తాను అన్యజాతులను కూడా రక్షించే దేవుణ్ణని తెలియజేశాడు. కనుక ఈ గ్రంథంలో, పూర్వవేదంలో అరుదుగా కనిపించే అన్యజాతి రక్షణం అనే అంశం శిఖరాన్నందుకొంది.

# నూతన వేద గ్రంథాలు

## I. సువిశేషాలు

సువిశేషం అనగానే ఇప్పుడు మనకు పుస్తకం అనే భావం కలుగుతుంది. కాని తొలిరోజుల్లో ఇవి కేవలం బోధలుగా మాత్రమే ఉండేవి. ఈ బోధలే తర్వాత గ్రంథస్థాలయ్యాయి. సువిశేష రచనలో కనీసం మూడు దశలైనా గోచరిస్తాయి. మొదటి దశలో క్రీస్తు సందేశాలూ అతని జీవిత సంఘటనలూ కేవలం మౌఖిక బోధలుగా ఉండేవి. పేతురు మొదలైన శిష్యులు కేవలం నోటితోనే ఈ బోధలను వినిపిస్తూ వచ్చారు. ఈ దశలో రచనలు లేవు. రెండవ దశలో కొందరు రచయితలు క్రీస్తు

బోధలనూ అతని జీవిత సంఘటనలనూ చిన్న చిన్న రచనలనుగా వ్రాస్తూ వచ్చారు. ఉదాహరణకు పర్వత ప్రసంగమూ, మంచి సమరయుని సామెతా మొదలైనవి. ఇవి సంపూర్ణ క్రీస్తు చరిత్రలు కావు. మూడవ దశలో భగవత్ప్రేరితులైన నలుగురు రచయితలు ఈ చిన్న చిన్న రచనలను కలిపి సమగ్రమైన క్రీస్తు చరిత్రలను రూపొందించారు. అవే సువిశేషాలు. ఈ రచయితల్లో మొదటివాడు అరమాయిక్ సువిశేషం వ్రాసిన మత్తయి. తర్వాత వచ్చిన మార్కు, లూకా ఈ మొదటి రచయిత నుండి చాలా విషయాలు స్వీకరించారు. నాలుగవ రచయితయైన యోహాను ప్రత్యేక పద్ధతిలో తన సువిశేషం వ్రాశాడు. ఇక, ఒక్కో సువిశేషాన్ని సంగ్రహంగా పరిశీలిద్దాం.

## మార్కు

మార్కు పేతురు శిష్యుడు. పేతురు బోధల వల్ల ప్రభావితుడై ఇతడు 60 ప్రాంతంలో సువిశేషం వ్రాశాడు. గ్రీకు భాషలో వెలువడిన మొదటి సువిశేషం ఇదే. మత్తయి అరమాయిక్ భాషలో వ్రాసిన సువిశేషం నుండి ఇతడు చాల విషయాలు స్వీకరించాడు. క్రీస్తు దైవకుమారుడనేది ఇతని సువిశేషంలోని ప్రధానాంశం. మార్కు ఈ గ్రంథాన్ని రోములోని హింసలనుభవిస్తున్న క్రైస్తవుల కోసం వ్రాశాడు.

## మత్తయి

మత్తయి గ్రీకు సువిశేషం 65 ప్రాంతంలో వెలువడింది. దీనికి పూర్వం 12 మంది శిష్యుల్లో ఒకడైన మత్తయి వ్రాసిన అరమాయిక్ సువిశేషం ఉంది. దీనినీ, మార్కు సువిశేషాన్నీ ఆధారంగా తీసికొని మరొక రచయిత ఈ గ్రీకు సువిశేషాన్ని వ్రాశాడు. శిష్యుడైన మత్తయి స్వయంగా వ్రాసిన అరమాయిక్ సువిశేషం ఇప్పుడు లభ్యం కాదు.

నాలుగు సువిశేషాల్లోను ఎక్కువ ప్రసిద్ధిలోకి వచ్చింది ఈ మత్తయి సువిశేషమే. దీనిలోని ప్రధానాంశం దైవరాజ్యం. యూదులకు ఆదిపంచకం ఎలాగో క్రైస్తవులకు ఈ సువిశేషం అలాగు. దానిలాగే ఇది కూడా అయిదు భాగాలుగా ఉంటుంది. క్రీస్తు నూతన మోషే. పూర్వ వేద ప్రవచనాలన్నీ అతనియందు నెరవేరాయి. అతడు తన మరణోత్థానాల ద్వారా ప్రజలను నూతన వాగ్దత్త భూమియైన మోక్షానికి కొనిపోతాడు. రచయిత ఈ గ్రంథాన్ని యెరూషలేములోని క్రైస్తవుల కోసం వ్రాశాడు.

### లూకా

లూకా 70లో ఈ సువిశేషాన్ని వ్రాశాడు. ఇతడు పౌలు శిష్యుడు. మార్కు మత్తయి సువిశేషాలు యూదుల కోసం ఉద్దేశింపబడ్డాయి. కాని ఈ గ్రంథం ప్రధానంగా గ్రీకు క్రైస్తవుల కోసం ఉద్దేశింపబడింది. క్రీస్తు కరుణ, పవిత్రాత్మ, ప్రార్థన మొదలైన అంశాలను ఈ సువిశేషం ప్రత్యేక శ్రద్ధతో వర్ణిస్తుంది. రచనా విధానంలో ఈ మూడవ సువిశేషం తొలి రెండింటి కంటే సుందరంగా ఉంటుంది.

### యోహాను

ఇది అన్నిటికంటె చివరను వచ్చిన సువిశేషం. మొదటి శతాబ్దంలో పుట్టింది. ఇది తొలి మూడింటిలాగా క్రీస్తు సమగ్ర చరిత్రను చెప్పదు. క్రీస్తు జీవితంలోని కొన్ని ముఖ్యమైన సంఘటలను మాత్రం ఎన్నుకొని వాటి మీద వ్యాఖ్య చెబుతుంది. తండ్రిని తెలియజేసే దైవవార్త క్రీస్తు. అతడు లోకానికి వెలుగు, జీవం, సత్యం. అతడు మనకు దైవప్రేమనూ, సోదర ప్రేమనూ నేర్పేవాడు. ఇవి ఈ గ్రంథంలోని కొన్ని ముఖ్యాంశాలు.

## II. అపోస్తలుల కార్యాలు

ఇది లూకా రెండవ రచన. శ్రీసభ తొలి ముప్పది యేండ్ల చరిత్రను చెబుతుంది. విశేషంగా పేతురు, పౌలు వేదబోధలను వర్ణిస్తుంది. దీనికి పరిశుద్ధాత్మ సువిశేషమని కూడా పేరు. క్రీస్తు ఉత్థానానంతరం ఆత్మ తొలి క్రైస్తవ సమాజాలను నడిపించిన తీరును ఈ గ్రంథం విపులంగా వర్ణిస్తుంది.

## III. లేఖలు

నూతన వేదంలో 21 జాబులున్నాయి. వీనిలో 14 పౌలు వ్రాసినవి. 7 ఇతరులు వ్రాసినవి. నూతన వేదంలో మొదట వ్రాయబడిన పుస్తకాలు సువిశేషాలు కాదు, ఈ జాబులే. ఈ లేఖలను కూడా రచయితలు నాటి క్రైస్తవ సమాజాల్లోని ఆయా సమస్యలను పురస్కరించుకొని వ్రాశారే కాని, కేవలం క్రైస్తవ సిద్ధాంతాలను ప్రతిపాదించ డానికి వ్రాయలేదు. అయినా ఇవి దైవశాస్త్రాంశాలతో నిండి ఉంటాయి.

సువిశేషాలు కథల్లాగా ఉండి సులువుగా బోధపడతాయి. జాబులు శాస్త్రాంశాలతో నిండి ఉండడం వల్ల అంత సులువుగా బోధపడవు. కాని వీటిని అర్థం చేసుకొంటే క్రైస్తవ వేదసత్యాలు చాల లోతుగా తెలుస్తాయి. ఇక, ఆ జాబులను ఇప్పుడు వాటిని

బైబుల్లో అమర్చిన క్రమంలో కాక అవి పుట్టిన కాలక్రమ పద్ధతిలో పరిశీలించి చూడడం మెరుగు.

## తెస్సలోనీయుల జాబులు రెండు

ఇది నూతన వేదంలోని పుస్తకాలలోకెల్లా మొదటి రచనలు. పౌలు వీటిని క్రీ.శ. 50 ప్రాంతంలో వ్రాశాడు. పౌలు తెస్సలోనికలో క్రైస్తవ సమాజాన్ని స్థాపించాక అక్కడ వేదహింసలు ప్రారంభమయ్యాయి. కనుక అతడు తెస్సలోనిక పౌరులను నిలకడతో ఉండమని తొలిజాబులో హెచ్చరించాడు. ప్రభువు రెండవ రాకడ కొరకు వేచియుండమని కూడా చెప్పాడు. రెండవ జాబులో, తెస్సలోనీయులు క్రీస్తు త్వరలోనే వేంచేస్తాడన్న భావంతో పనిపాటలు మానివేయకూడదని హెచ్చరించాడు. విశ్వాసులు సోదర ప్రేమతో జీవించాలని బోధించాడు. ఈ జాబుల్లో రెండవ రాకడను గూర్చి పౌలు చెప్పిన విషయాలు నేటికీ ఆసక్తిని కలిగిస్తాయి.

## కొరింతీయుల జాబులు రెండు

పౌలు 54 ప్రాంతంలో ఎఫెసు నుండి కొరింతు క్రైస్తవులకు రెండు జాబులు వ్రాశాడు. మొదటి జాబులో వాళ్ళు స్థిర విశ్వాసంతో మెలగాలని హెచ్చరించాడు. క్రైస్తవ సమాజంలో అంతః కలహాలు, అపవిత్రత పనికిరావని చెప్పాడు. ఆయా సమస్యలను గూర్చి అచటి క్రైస్తవులడిగిన ప్రశ్నలకు సమాధానాలు పంపాడు. రెండవ జాబులో తన మీద అపదూరులు మోపే ఇతర బోధకులను ఖండించాడు. యెరూషలేములో కరవు వలన బాధపడే యూద క్రైస్తవులకు సహాయం చేయమని కోరాడు. ఈ రెండు లేఖలూ పౌలుకీ, అతని క్రైస్తవులకీ ఉండే వ్యక్తిగతమైన సంబంధాలు చాలా తెలియజేస్తాయి.

## గలతీయుల జాబు

పౌలు ఈ జాబును కూడా 57 ప్రాంతంలో ఎఫెసు నుండే వ్రాశాడు. పౌలు ప్రత్యర్థులైన యూద బోధకులు ధర్మశాస్త్రం మనలను రక్షిస్తుందని బోధించారు. క్రీస్తు వచ్చాక ఆ ప్రభువేగాని ధర్మశాస్త్రం మనలను రక్షించదని బోధించాడు పౌలు. రక్షణమనేది దేవుడు ఉచితంగా దయచేసే వరం గాని మన సత్క్రియలతో సాధించేది కాదని కూడా తెలియజేశాడు. క్రైస్తవులకు సున్నతి అక్కరలేదని చెప్పాడు.

## రోమీయుల జాబు

దీనిని గలతీయుల జాబు వ్రాసిన తర్వాత 56 ప్రాంతంలో కొరింతు నుండి వ్రాశాడు. గలతీయుల జాబులోని విషయాలే దీనిలో కూడా ప్రస్తావించబడ్డాయి. మోషే ధర్మశాస్త్రం వలన ఇక లాభం లేదు. తండ్రి క్రీస్తు ద్వారా ప్రజలను రక్షించాడు. ఇప్పుడు మనం క్రీస్తుని విశ్వసించి అతనిలోనికి జ్ఞానస్నానం పొంది రక్షణం పొందాలి. క్రైస్తవులు నూతన ఇస్రాయేలు అవుతారు. వాళ్ళు ప్రేమ జీవితం జీవించాలి. ఈ జాబులో లోతైన దైవశాస్త్రాంశాలున్నాయి. పౌలు జాబులన్నిటిలోను ఇది ఎక్కువ విలువైంది.

## ఫిలిప్పీయుల జాబు

పౌలు ఫిలిప్పి క్రైస్తవులను మెచ్చుకొంటూ 56 ప్రాంతంలో వ్రాసిన జాబు ఇది. స్నేహపూర్వకమైన కుశల ప్రశ్నలతోపాటు వ్యక్తిగత సమాచారాలతోను నిండి ఉంటుంది. రెండవ అధ్యాయంలో క్రీస్తు వినయాన్నీ, మహిమనీ తెలియజేసే గొప్ప గేయాన్ని ఉదాహరించడం జరిగింది.

## కొలొస్సీయుల జాబు

60 ప్రాంతంలో రోములోని చెరలో నుండి వ్రాసిన జాబు. క్రీస్తు దేవదూతలలో ఒకడనీ, దేవదూతలను పూజిస్తే దేవుణ్ణి చేరతామనీ దబ్బర సిద్ధాంతాలు బయలు దేరాయి. ఈ సిద్ధాంతాలకు లొంగవద్దని పౌలు కొలొస్సే పౌరులను హెచ్చరించాడు. క్రీస్తు నిజమైన దేవుడనీ, దేవదూతలు అతనికి లొంగి ఉంటారనీ ఉపదేశించాడు.

## ఎఫెసీయుల జాబు

61 ప్రాంతంలో వ్రాసిన లేఖ. తండ్రి రక్షణ ప్రణాళికలన్నీ క్రీస్తునందు నెరవేరాయి. ఈ లోకంలో ఉత్థాన క్రీస్తు సాన్నిధ్యాన్ని తిరుసభ కొనసాగించుకొని పోతూ ఉంటుంది. ఈ లేఖ 5వ అధ్యాయంలో పౌలు వివాహ జీవితాన్ని గూర్చి చెప్పిన వాక్యాలు నేటికీ పెండ్లి పూజలో చదువుతుంటారు.

## ఫిలెమోను

ఫిలెమోను అనే సంపన్నుని బానిస ఒనేసిమస్ పారిపోయాడు. ఇతడు రోములో పౌలు వల్ల ఉపదేశం పొంది క్రైస్తవుడయ్యాడు. ఈ బానిసను దండించవద్దని పౌలు ఫిలెమోనుకు వ్రాశాడు. ఇదే ఆ జాబు.

## తిమోతి జాబులు

ఈ జాబులు 65 ప్రాంతంలో వ్రాసినవి. వీటి కర్తృత్వం సందేహాస్పదం. పౌలు గాని, అతని శిష్యులు గాని వ్రాసి ఉండవచ్చు. పౌలు బోధించిన వేద సత్యాలను అతని శిష్యులైన తిమోతి మొదలైనవాళ్ళు పవిత్రంగా ఎంచాలనీ, వాటిల్లో ఏలాంటి మార్పులూ చేయరాదనీ ఈ జాబుల సారాంశం.

## తీతు జాబు

ఇది శిష్యుడైన తీతుకు వ్రాసిన జాబు. తిమోతి జాబుల్లాగే ఇది కూడా పౌలు బోధల్లో మార్పులు చేయరాదని చెబుతుంది.

## హెబ్రేయుల జాబు

ఇది 67 ప్రాంతంలో వ్రాసింది. పౌలు శిష్యుడెవరో వ్రాసి ఉండవచ్చు. యూదమతంలోని యాజకులు కొందరు క్రైస్తవ మతంలో చేరారు. కాని వాళ్ళు వేద హింసలకు జంకి మళ్ళా యూదమతంలోకి వెళ్ళగోరుతుంటే అలా చేయవద్దని హెచ్చరిస్తూ వ్రాసిన జాబు ఇది. ఈ లేఖ ప్రధానంగా క్రీస్తు యాజకత్వాన్ని వర్ణిస్తుంది.

## యాకోబు జాబు

యెరూషలేము క్రైస్తవ సమాజానికి అధిపతియైన యాకోబు దీనిని యాద క్రైస్తవుల కోసం 45 ప్రాంతంలో వ్రాశాడు. క్రైస్తవులు పర్వత ప్రసంగం బోధల ప్రకారం జీవించాలి. దరిద్రులు దీనులు, హింసితులు దేవునికి స్నేహితులవుతారు. ఈ జాబు చాలా నీతిబోధలతో నిండి ఉంటుంది.

## యూదా జాబు

80 ప్రాంతంలో వ్రాసిన జాబు ఇది. ఆనాటి దబ్బర బోధకులనూ, వాళ్ళ సిద్ధాంతాలను ఖండిస్తుంది.

## పేతురు జాబులు రెండు

పేతురు పేరుమీదుగా రెండు జాబులు ప్రచారంలోకి వచ్చాయి. పేతురు భావాలనే విశదీకరిస్తూ అతని శిష్యుడు వీటిని వ్రాసి ఉండవచ్చు. మొదటిది 62 ప్రాంతంలో వెలువడింది. క్రీస్తును ఆదర్శంగా తీసికొని ఆపదల్లో ధైర్యంగా ఉండాలని చెబుతుంది. రెండవది ప్రభువు రెండవ రాకడ మొదలైన విషయాలను పేర్కొంటుంది.

## యోహాను జాబులు

యోహాను పేరుమీదుగా మూడు జాబులున్నాయి. యోహాను గాని, అతని శిష్యులు గాని వీటిని మొదటి శతాబ్దాంతంలో వెలువరించి ఉంటారు. వీటిల్లో రెండు మూడు జాబులు ముఖ్యమైనవి కావు. మొదటి జాబు మాత్రం ప్రశస్థమైనది. ఈ లేఖ బోధల ప్రకారం దేవుడు ప్రేమామయుడు. దేవుని ప్రేమ క్రీస్తులో దర్శనమిచ్చింది. క్రైస్తవులు ప్రేమ జీవితం గడపాలి.

# IV. దర్శన గ్రంథం

పూర్వవేదంలో దానియేలు గ్రంథం వెలువడినప్పటికే ప్రవచనం అంతరించి దర్శన వాఙ్మయం ప్రచారంలోకి వచ్చింది. ప్రవక్తలు చెవితో దైవసందేశం విని నోటితో ప్రకటించారు. కాని దర్శన గ్రంథకర్తలు దర్శనాల్లో దైవ సందేశాన్ని గ్రహించి రచనా రూపంలో ప్రకటించారు. నూతన వేదంలోని తుది గ్రంథమైన దర్శన గ్రంథం ఈ దర్శన సాహిత్యానికి చెందినది. ఇది 95 ప్రాంతంలో పుట్టింది. సువిశేషకారుడైన యోహాను దీనికి కర్త కావచ్చు, కాకపోవచ్చును కూడా. ఈ గ్రంథం తొలి శతాబ్దంలో వేద హింసలనుభవించే క్రైస్తవులను హెచ్చరించడానికి పుట్టింది. ఇది పూర్వవేదంలో దానియేలు గ్రంథాన్ని అనుకరిస్తుంది. తండ్రి క్రీస్తు ద్వారా అన్ని వేదసత్యాలూ తెలియజేశాడు. అన్ని పరలోక భాగ్యాలూ దయచేశాడు. కనుక క్రైస్తవులు అతణ్ణి నమ్మి జీవించాలి. శ్రమలకు జంకకూడదు.

ఈ గ్రంథంలో చాలా సంకేతాలు వస్తాయి. వాటిని అర్థం చేసుకోవడం కొంచెం కష్టం. అయినా ఈ పుస్తకం తొలినాటి వేదహింసలకు సంబంధించినదే గాని భవిష్యత్తులో రాబోయే సంగతులను చెప్పేది కాదు. నూతన వేదంలోని ఇతర గ్రంథాల్లో లేని క్రొత్త బోధలను వేటినీ ఈ గ్రంథం చెప్పదు. మామూలు బోధలనే దర్శనాల

భాషలో చెబుతుంది, విశేషం అంతే. నూతన వేదంలో దర్శన సాహిత్యానికి చెందిన పుస్తకం ఇదొక్కటే.

ఇదీ బైబులు 73 గ్రంథాలలోనున్న సార సంగ్రహం.

## హీబ్రూ సామెత మాషాల్

బైబులు ఆద్యంతం సామెతలు కనిపిస్తాయి. అంతేకాదు, ఉపదేశంలో సామెతల పాత్రను, ప్రాముఖ్యాన్ని గుర్తించిన యూదుల సంస్కృతి దాదాపు 2,500 సంవత్సరాల క్రితమే "సామెతల గ్రంథం" పేరిట పూర్వ నిబంధనంలో ఒక ప్రత్యేక పుస్తకానికి చోటు కల్పించింది. బైబులు సామెతలను హీబ్రూ భాషలో "మాషాల్" అంటారు. ఇప్పుడు ఈ మాషాల్ స్వరూప స్వభావాలను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

### అ. మాషాల్ - అర్థం

మాషాల్ అంటే హీబ్రూ భాషలో ప్రాథమికంగా "పోలి ఉండడం" అని అర్థం. దీనిని బట్టి "పోలిక", "ఉపమానం" అనే అర్థాలు కూడా మాషాల్‌కు పుట్టుకు వచ్చాయని పండితుల అభిప్రాయం. అలాగే క్రియాపదంగా మాషాల్ అంటే "పాలించుట" అనే అర్థం. దీనిని బట్టి మాషాల్ అంటే అధికారం / ప్రభావం కల 'పెద్దల మాట' అనే అర్థం వచ్చినదని పరిశోధకుల అభిప్రాయం.

### ఆ. మాషాల్ పద ప్రయోగం

బైబులులో మాషాల్ ఈ క్రింది వాటిని సూచిస్తున్నది :

1) ఉపదేశాత్మకమైన పెద్దల మాట :

ఉదా: దిద్దుబాటునకు లొంగువాడు జీవనపథమున నడచును
మందలింపులను లక్ష్యము చేయనివాడు అపమార్గము పట్టును
(సామెతలు 10:17)

2) నీతిబోధకమైన ప్రాణి కథ :

ఉదా: అంతట నాతాను యావే పంపగా వచ్చి దావీదుతో ఇట్లు నుడివెను, "ఒక నగరమున ఇరువురు జనులు కలరు. వారిలో ఒకడు సంపన్నుడు. వేరొకడు

పేదవాడు. సంపన్నునకు గొఱ్ఱెల మందలును, గొడ్ల మందలును సమృద్ధిగా కలవు. పేదవానికి ఒక చిన్న గొఱ్ఱె కొదమ మాత్రము కలదు. అతడే దానిని కొనితెచ్చి పెంచెను. అది అతని బిడ్డలతోపాటు పెరుగుచు వచ్చెను. ఆ గొఱ్ఱెపిల్ల యజమానుని కంచమున తినుచు, పాత్రమున త్రాగుచు అతని రొమ్ము మీద పరుండెడిది. అతనికి కూతురువలె ఉండెడిది. ఇట్లుండగా సంపన్నుని ఇంటికి ఒకనాడు అతిథి వచ్చెను. కాని అతడు తన మందల నుండి చుట్టము కొరకు వేటను కోయించుటకు అంగీకరింపక, పేదవాని గొఱ్ఱెపిల్లను గైకొని భోజనము తయారుచేయించెను" (సమువేలు రెండవ గ్రంథము 12:1-4).

(సందర్భము : పెక్కుమంది భార్యలున్న దావీదు రాజు తన సైనికుడైన ఊరియాను చంపించి అతని ఏకైక భార్యను తన భార్యనుగా చేసుకొనడం).

3) నీతిబోధకమైన ఉపమానము :

ఉదా: ఒకమారు లెబనోను కొండ మీది ముండ్ల పొద 'నీ కుమార్తెను నా కుమారునికి ఇచ్చి పెండ్లి చేయుము' అని దేవదారు వృక్షమునకు కబురంపెను. అంతలో ఒక అడవి మృగము వచ్చి ఆ పొదను కాళ్ళతో త్రొక్కివేసెను. - రాజుల రెండవ గ్రంథము 14:7

(సందర్భము : బలహీనుడైన అమస్యా అను రాజు బలవంతుడైన యెహోవాషు అను రాజును యుద్ధమునకు సవాలు చేయుట).

4) ప్రవక్తల ప్రవచనములు :

ఉదా: బిలాము వారికి దైవవాక్కును ఇట్లెరింగించెను.

- సంఖ్యాకాండము 23:7,18; 24:3

5) అపహాస గీతము :

ఉదా: ఆ దినమున మీరు బాబిలోనియా రాజును గూర్చి ఈ అపహాస గీతమును విన్పింపుడు, 'ప్రజాపీడకుడెట్లు నశించెను? అతని పీడనమెట్లు అడుగంటెను?' 'ప్రభువు దుష్టుల దండమును విరచెను. పీడకుల రాజ దండమను విరుగగొట్టెను.' - యెషయా గ్రంథము 14:4-5

6) పొడుపు కథకు పర్యాయపదము :

ఉదా: నేను సామెతను ఆలింతును. పొడుపుకథను తంత్రీవాద్యముపై పాడి వివరింతును. – కీర్తనల గ్రంథము 49:4

7) నీతిబోధక పద్యము :

ఉదా: "యోగ్యురాలైన గృహిణి ఎచట దొరకును? ఆమె పగడముల కంటెను విలువైనది.... ఆమె కృషి పదిమందిలోను ప్రశంసలు పొందును గాక!" [27] – సామెతల గ్రంథము 31:10–31

పరిశీలించి చూచినప్పుడు బైబులులో మాషాల్ పద ప్రయోగం ఇంత విస్తృత పరిధిలో కనిపిస్తుంది. ఐతే ప్రాథమికంగా మాషాల్ బైబులులో సామెతనే సూచిస్తుంది. అందువలన ఇపుడు మాషాల్ నిర్వచనం, పరిణామం, లక్షణాలను గురించి తెలుసు కుందాం.

## ఇ. మాషాల్ – నిర్వచనం

ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా మాషాల్‌ను "అనుభవం నుండి పుట్టి, సార్వత్రికా న్వయం కలిగి, తేలికగా గుర్తించుకొనగలిగిన సంక్షిప్త నీతి సూక్తి"గా నిర్వచించినది. (Mashal is typically a pithy, easily memorized aphoristic saying based on experience and universal in application).[28]

వివరణతో పనిలేని స్వయంబోధకమైన ప్రసిద్ధ సత్యాన్ని శ్రోతలలో ఆలోచన రేకెత్తించే విధంగా సూటిగా, గాఢంగా వ్యక్తీకరించడం మాషాల్ స్వభావంగా భావించ వచ్చు.

## ఈ. మాషాల్ – నేపథ్యాలు

ఎడ్గర్ జోన్స్ ప్రకారం బైబులు సామెతలను వాటి నేపథ్యాలను బట్టి రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:1. యూదులకు రాచరిక వ్యవస్థ ఏర్పడడానికి ముందు

---

[27] A Benjamin, The Proverbs in Hebrew and Tamil Literatures, University of Madras, 2001, Chennai, p. 33

[28] "Biblical literature." Encyclopaedia Britanica. 2008. Encyclopaedia Britanica Online. 30 Aug. < 2008 http: // www. britanica com/Ebcheeked/topic/64496/ biblical_literature>

పుట్టిన సామెతలు, 2. యూదులకు రాచరిక వ్యవస్థ ఏర్పడిన తరువాత (స్థూలంగా క్రీస్తు పూర్వం 10 శతాబ్దం) పుట్టిన సామెతలు.[29]

ప్రజల స్మృతిపథంలో చెరగని ముద్రగా తరతరాల ప్రజాచేతనలో అంతర్భాగ మైనవి బైబులులోని మొదటి రకానికి చెందిన సామెతలు. వీటి స్రష్టలు ఎవరో నిర్దిష్టంగా తెలియదు. ఈ సామెతలను రస్సెల్ చెప్పినట్టుగా 'అనేకమంది జ్ఞానం, ఒకని చమత్కారం'గా భావించవచ్చు. ఇవి కుటుంబ, సామాజిక నేపథ్యాన్ని కలిగి ఉంటాయి. బైబులులో విజ్ఞాన గ్రంథాల కోవకు చెందని పుస్తకాలలో కనిపిస్తుంటాయి. ఇవి యూదుల చరిత్రకు, సామాజిక చేతనకు అద్దం పడుతుంటాయి. ఉదా: "సౌలు కూడా ప్రవక్తలలో కలసిపోయెనా?' అని విస్మయాన్ని, ఈసడింపును వ్యక్తపరిచే సామెత. సౌలు యూదుల మొదటి రాజు. అతడు రాజు కాకముందు ఏ గుర్తింపు లేని సామాన్య జీవి. ప్రవక్తల లక్షణాలు ఏ మాత్రం లేనివాడు. అతడు ప్రవక్తలతో కలసి ప్రవచించడాన్ని చూచిన ప్రజల నోటి నుండి ఈ సామెత వచ్చింది (సమూవేలు మొదటి గ్రంథము 10:12; 19:21). అప్పటినుంచి అథమస్థాయివారు ఉన్నత స్థాయివారిలా ప్రవర్తించినపుడు ఈసడించుకోవడానికి, విస్మయం వ్యక్తపరచడానికి యూదులు ఈ సామెతను వాడుతున్నారు.

"తండ్రులు పుల్లని ద్రాక్షలు భుజింపగా, తనయులకు పండ్లు పులుపెక్కెను" (యిర్మీయా 31:29; యెహెజ్కేలు 18:2) అనేది ఇంకొక సామెత. తాము నమ్మిన యావే దేవుడు తండ్రులు చేసిన తప్పులకు వారి తనయులను, తనయుల తనయులను కూడా దండిస్తాడన్నది యూదుల నమ్మకం. ఆ నమ్మకం నుండి పుట్టినదే ఈ సామెత. సందర్భానుసారంగా యిర్మీయా, యెహెజ్కేలు ప్రవక్తలు ఈ సామెతను వాడుకోవడం బైబులులో కనిపిస్తుంది. ఇటువంటి సామెతలు చెదురుమదురుగా బైబులు అంతటా కనిపిస్తుంటాయి.

ఒక జ్ఞాని లేక ఉపదేశకుడు తాను పరిశీలించి కనుగొన్న వాస్తవాలను, సత్యాలను, ధర్మాలను శ్రోతలలో ఆలోచన రేకెత్తించే విధంగా చిరస్మరణీయమైన కూర్పుతో రచించి ఏర్పరచినవి రెండవ రకపు సామెతలు. ఇవి యూదుల రాచరిక వ్యవస్థ పుట్టిన తరువాత రాజాస్థానాలలోని పండితులు, జ్ఞానులు కూర్చిన సామెతలు.

---

[29] The Torch Bible Commentaries, Torch SCM Press Ltd, London, 1961, p.28

ఇటువంటి సామెతలు బైబులులోని జ్ఞాన గ్రంథాలలో, మరీ ముఖ్యంగా సామెతల గ్రంథం, సీరా జ్ఞానగ్రంథంలో పుష్కలంగా కనిపిస్తాయి.

ఉదా: కష్టించి పనిచేయువాడు అధికారియగును

కాని సోమరిపోతు బానిస యగును (సామెతలు 12:24).

శ్రీమంతుడివైయుండి ఆందోళనమునకు గురియగుట కంటె

పేదవాడవైయుండి దైవభయము కలిగియుండుట మేలు (సామెతలు 15:16)

ఇవి మన దేశంలో వెలసిన నీతి సూక్తులూ, శతకాల వంటివి. క్రీస్తు పూర్వం 2,450 నాటికే యూదుల చుట్టుప్రక్కల ఉన్న ఈజిప్టు, సుమేరియా, బాబిలోనియాలలో పిల్లల, యువకుల ఉపదేశానికి నిత్యసత్యాలను బోధించే అసంఖ్యాకమైన సామెతలు పుట్టుకువచ్చినట్లుగా చరిత్రను బట్టి తెలుస్తున్నది. వీటి స్రష్టలు రాజాస్థానాలలోని పండితులు, జ్ఞానులు. [30] ఈ దారిని అనుసరించి యూదా ప్రజలలో కూడా జ్ఞానులు విజ్ఞాన సూక్తులను ప్రచారంలోకి తెచ్చారు. ఈ జ్ఞానులు కూడా యూదుల రాజా స్థానాలలో వర్ధిల్లారు. క్రీస్తు పూర్వం 10వ శతాబ్దానికి చెందిన సొలోమోను రాజు బైబులు జ్ఞాన సాహిత్యానికి పోషకుడిగా కీర్తి గడించాడు. అతడు స్వయంగా మూడు వేల సామెతలను చెప్పినట్టు, పది వందల ఐదు కీర్తనలను కట్టినట్లు బైబులు చెబుతున్నది (రాజుల మొదటి గ్రంథము 4:32).

ఈ నేపథ్యాలతో ఇప్పుడు మాషాల్ వివిధ మూలాలను తెలుసుకోవడానికి ప్రయత్నిద్దాం.

### ఉ. మాషాల్ – మూలాలు

1. బైబులులోని కొన్ని సామెతలు యూదుల చారిత్రక పురుషులను ఆధారంగా చేసుకొని పుట్టాయి.

ఉదా: యూదుల మూల పురుషుడు అబ్రాహాము. యావే దేవుడు అబ్రహామును ఎన్నుకొని "జనులు ఆశీర్వచనము పలుకునప్పుడు వాడుకొనునంతగా నీ పేరు దేశ దేశముల వ్యాపింప జేయుదును" అని దీవించాడు (ఆదికాండము 12:2).

[30] "biblical literature." Encyclopaedia Britanica. 2008. Encyclopaedia Britanica Online. 30 Aug. < 2008 http: // www. britanica com/Ebcheeked/topic/64496/biblical_literature>

అబ్రహాముకి దేవుడిచ్చిన ఈ దీవెన సామెత రూపం సంతరించుకొన్నట్లుగా యెషయా గ్రంథము 65:16, కీర్తనలు గ్రంథము 72:17 మొదలగు ఆలోకనాల నుండి తెలుస్తున్నది.

ఇదే విధంగా అబ్రహాము మునిమనుమలైన ఎఫ్రాయిము, మనష్షే ల అభివృద్ధి కూడా సామెత రూపం పొందినట్లు ఆదికాండము 48:20 ద్వారా గ్రహించవచ్చు.

యూదుల ప్రవక్తలందరిలోను గొప్పవాడు మోషే. ఆనాటి యూదుల పాలనా వ్యవస్థలోని ముఖ్యమైన ప్రవక్త, యాజకుడు, పాలకుడు, న్యాయమూర్తి మొదలగు పాత్రలన్నిటిని నిర్వహించిన వాడు. అందువలన "మోషే వంటి ప్రవక్త ఇస్రాయేలీయులలో పుట్టలేదు" అనే సామెత పుట్టినట్లుగా ద్వితీయోపదేశకాండము 34:10 ద్వారా తెలుస్తున్నది.

ఇంతకుముందే చూచినట్లుగా అథమ స్థాయికి చెందినవారు ఉన్నత స్థాయికి చెందినవారిలా ప్రవర్తించినపుడు వారిని ఈసడించడానికి, యూదుల మొదటి రాజైన సౌలు ను ఆధారంగా చేసుకొని "సౌలు కూడా ప్రవక్తలలో కలసిపోయెనా?" అనే సామెత పుట్టినట్లుగా సమూవేలు మొదటి గ్రంథము 10:12; 19:24 ద్వారా తెలుసుకోవచ్చు.

శపితులకు ప్రతీకలుగా యూదులు సిద్కియా, ఆహాబు అను రాజుల పేర్లను సామెతలుగా వాడుకొన్నట్లు యిర్మీయా 29:20 తెలుపుతుంది.

2. బైబులులోని మరికొన్ని సామెతలు గ్రామాల, పట్టణాల పేర్లు మీద ఉన్నట్టు కనిపిస్తున్నాయి.

ఉదా: హెష్బోను అమోరీయుల రాజధాని. యూదులు ఈజిప్టు దాస్యము నుండి బయటపడి యావే దేవుడు వాగ్దానము చేసిన కానా దేశము వైపు సాగుచూ అమోరీయులు రాజైన సీహోనును తమను 'మీ దేశముగుండ ప్రయాణము చేయునిండు' అని వేడుకొన్నారు. సీహోను అందుకు నిరాకరించినపుడు యూదులు అమోరీయులను యుద్ధములో ఓడించి హెష్బోనును దాని చుట్టుప్రక్కల నున్న పట్టణాలను ఆక్రమించుకొన్నారు. ఆ తరువాత అమోరీయుల నుద్దేశించి వ్యంగ్యంగా "రండు, హెష్బోనును మరల పునర్మింతుము" అన్నారు (సంఖ్యాకాండము 21:27). అప్పటినుండి మంచి మాటలతో చెప్పినపుడు విననివారిని నాశనం చేసి వ్యంగ్యంగా వారిని ఊరడించడానికి ఈ సామెతను వాడుతున్నట్లు బైబులు ద్వారా తెలుస్తున్నది.

‘ఎఫ్రాయీము గోత్రముల వారి పొలములో పరిగెలేరినను, అబియేసేరు గోత్రములవారి పొలములో పండిన నిండు పంట కంటెను మిక్కుటమే’ అనే సామెతలో ఎఫ్రాయీము, అబియేసేరు ఆ యా గోత్రముల వంతుగా వచ్చిన ప్రాంతాలను సూచిస్తున్నవి. దీనిని యూదుల నాయకుడైన గిద్యోను పలకడం న్యాయాధిపతులు 8:2 లో కనిపిస్తున్నది.

యూదుల పట్టణాలైన ఆబేలు, దాను సదాచారాలకు ప్రసిద్ధి గాంచాయి. ఇతర పట్టణవాసులు ఈ పట్టణవాసుల ఆదర్శాలను అనుసరించ ప్రయత్నించేవారు. అందువలన “యిస్రాయేలు పెద్దల ఆచారములు అడుగంటిపోయెనేని ఆబేలు దాను పట్టణములను చూచి మరల నేర్చుకొనుడు” అనే సామెత పుట్టినది. దీనిని ఒక స్త్రీమూర్తి వాడడం సమూవేలు రెండవ గ్రంథం 20:18 లో కనిపిస్తుంది.

షిలో పట్టణములో యూదుల ప్రాచీన దేవాలయం ఉండేది. దానిని ఫిలిస్తీయులు ధ్వంసం చేసినట్లుగా సమూవేలు మొదటి గ్రంథం 4వ అధ్యాయం ద్వారా గ్రహించవచ్చు. ‘పవిత్రమైన షిలో దేవాలయమునే దేవుడు ధ్వంసం చేయనిస్తే మిగిలిన వాటి గురించి చెప్పనవసరం లేదు కదా’ అనే అర్థమిచ్చే సామెతలు యిర్మీయా 7:12,14; 26:6,9; కీర్తనల గ్రంథం 78:60 లో కనిపిస్తాయి.

నూతన నిబంధనంలో ఇరుగు, పొరుగు పట్టణాలైన కాన, నజరేతుల మధ్య ఉన్న అసూయ కారణంగా కానావాసులు పుట్టించిన సామెత “నజరేతు నుండి మంచి ఏదైనా రాగలదా?” అనేది. దీనిని కానా వాసియైన నతనియేలు వాడడం యోహాను సువార్త 1:46 లో కనిపిస్తుంది.

3. బైబులులోని ఇంకా కొన్ని సామెతలు పురాగాథల ఆధారంగా పుట్టాయి.

ఉదా: “దేవుడు నిన్ను నిమ్రోదు వలె గొప్ప వేటగానిని చేయును గాక” అనే సామెత. ఇది ఆదికాండము 10:9 లో కనిపిస్తుంది. ఈ సామెతలోని నిమ్రోదు బాబిలోనియా పురాగాథలలోని యుద్ధ దేవత.[31] యూదులు, బాబిలోనీయులు ఇరుగుపొరుగువారు. బాబిలోనీయుల పురాగాథల ప్రభావం యూదుల మీద ఉండడం వలన బైబులులోకి ఈ సామెత ప్రవేశించి ఉండవచ్చును.

[31] Encyclopaedia Judaica, vol.12, pp 1166-1167

4. యూదుల ఆహారపు అలవాట్ల నుండి పుట్టిన సామెతలు “మూర్ఖులే ద్రాక్షా సారాయమును మితిమీరి సేవింతురు” (సామెతలు 20:1). “రేపు మనము చత్తుము గనుక నేడు తిని త్రాగుదుము” (యెషయా 22:13) మొదలగు సామెతలను కూడా బైబులులో చూడవచ్చును.

5. ‘పడమట మబ్బుకు వాన కురుస్తుంది’, ‘దక్షిణపు గాలికి వడగాలి కొడుతుంది’ (లూకా 12:54-55) లాంటి ఇస్రాయేలు దేశ భౌగోళిక పరిస్థితులకు, వాతావరణానికి అద్దం పట్టే సామెతలు కూడా బైబులులో దర్శనమిస్తాయి.

6. “కాపరి లేని గొఱ్ఱెలు” (సంఖ్యాకాండము 27:17; రాజుల మొదటి గ్రంథము 22:17; జకరియా 10:2), “ఒడలు వాచి పుడమి దున్నువానికి కరవు లేదు” వంటి యూదుల వృత్తులను ప్రతిబింబించే సామెతలూ బైబులులో ఉన్నాయి.

7. బైబులులో యూదుల కుటుంబ జీవిత నేపథ్యం నుండి పుట్టిన పలు సామెతలు కనిపిస్తాయి.

ఉదా: “దీపమును వెలిగించి ఎవడును కుంచము చాటున ఉంచడు” (లూకా 11:33); “బాలుడుగా ఉన్నపుడే బిడ్డను శిక్షింపుము” (సీరాకు 30:12) మొదలగునవి.

8. బైబులులోని “రాజు నీలివార్తలు వినువాడైనచో, మంత్రులు కొండెములు చెప్పుదురు” (సామెతలు 29:12) లాంటి సామెతలు రాచరిక వ్యవస్థను సూచిస్తున్నాయి.

### ఊ. మాషాల్ లక్షణాలు

"The Proverbs in Hebrew and Tamil Literature" మీద పరిశోధన చేసిన ఎ. బెంజమిన్ గారు మాషాల్ లక్షణాలుగా ఈ క్రిందివాటిని పేర్కొన్నారు,[32]

1. బైబులులోని మాషాల్ ఎప్పుడూ పద్యరూపంలోనే ఉంటుంది. వచన సూక్తులను బైబులు మాషాల్‌గా పేర్కొనదు. మాషాల్ యూదులు గేయమైన ‘సిర్’ రూపంలో ఉంటుంది. అయితే ‘సిర్’ను వాద్య సహకారంతో పాడేవారు. మాషాల్‌ను మాత్రం వల్లెవేసేవారు.

---

[32] A. Benjamin, The Proverbs in Hebrew and Tamil Literature, University of Madras, Chennai, 2001, p.36

2. మాషాల్‌కు జీవితానుభవం పునాదిగా ఉంటుంది.

3. మాషాల్ సంక్షిప్తంగా, సూటిగా ఉంటుంది.

4. మాషాల్‌కు ప్రాచుర్యత ప్రాణంలాంటిది.

5. మాషాల్ లౌకిక సంబంధిగా ఉంటుంది. బైబులులో ఆద్యంతం కనిపించే ఎన్నిక, పతనము, రక్షణ ప్రణాళిక మొదలగు మత సంబంధమైన విషయాలను మాషాల్ ప్రతిబింబించదు.

## ఎ. మాషాల్ - స్వరూపం

అలోషియస్ ఫిట్జరాల్డ్ (Aloysius Fitzgerald) బైబులు సామెతలను స్వరూపాన్ని బట్టి ఈ క్రింది విధంగా వర్గీకరించాడు.[33]

1. సమానాంతరంగా ఉండే రెండు పాదాలలో ఒకే భావాన్ని రెండుసార్లు వేర్వేరు మాటలలో చెప్పే మాషాల్ (Synonymous Parallelism)

ఉదా : పేదవానికి అండలేదు గదా అని వానిని మోసగింపకుము,

రచ్చబండ వద్ద నిస్సహాయుడై నిల్చియున్న దరిద్రుని పీడింపకుము (సామెతలు 22:22).

2. సమానాంతరంగా ఉండే రెండు పాదాలలో మొదటి పాదంలోని భావం రెండవ పాదంలోని భావానికి వ్యతిరేకంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ, రెండు పాదాలూ ఒకే భావాన్ని చెప్పే మాషాల్ (Antithetic Parallelism)

ఉదా: విజ్ఞుడైన కుమారుడు తండ్రికి ఆనందము చేకూర్చును

మూర్ఖుడైన పుత్రుడు తల్లికి దుఃఖము తెచ్చిపెట్టును (సామెతలు 10:1)

3. సమానాంతరంగా ఉండే రెండు పాదాలలో రెండవ పాదం మొదటి పాదాన్ని పరిపూర్ణం చేసే మాషాల్ (Synthetic Parallelism)

---

[33] The Jerome Biblical Commentary, vol.1, pp 240-243

ఉదా: కోతకాలపు బెట్టలో కురిసిన మంచువలె

నమ్మదగిన దూత తన్ను పంపినవారికి ఆహ్లాదము చేకూర్చును (సామెతలు 25:13).

4. సమానాంతరంగా ఉండే రెండు పాదాలలోని ఒక పాదంలో ఉపమానం ఉండే మాషాల్ (Comparative / Emblematic Parallelism)

ఉదా: తలుపు బందు మీద తిరిగినట్లే

సోమరిపోతు పడక మీద దొర్లును (సామెతలు 26:14).

5. సమానాంతరంగా ఉండే రెండేసి జంట పాదాలలో మొదటి జంట పాదాలలోని భావం రెండవ జంట పాదాలలో వ్యతిరేక దిశలో ఉండే మాషాల్ (Inverted Parallelism)

ఉదా: అ

**మూర్ఖుని పెదవులు** కష్టము కొనితెచ్చును

ఆ

**మూర్ఖుని నోరు** కొరడా దెబ్బలను ఆహ్వానించును

ఆ

**మూర్ఖుని నోరు** స్వీయ నాశమును తెచ్చును

అ

**మూర్ఖుని పెదవులు** అతనికి ఉరులగును (సామెతలు 18:5-6)

6. సమానాంతరంగా ఉండే రెండు పాదాలలో మొదటి పాదంలోని భావం రెండవ పాదం మొదటలో మెట్ల వరుసలో లాగా పునరావృతమవుతుండే మాషాల్ (Staircase Parallelism)

ఉదా: నాయనా! నీవు నా ప్రేవున పుట్టిన గారాబు బిడ్డవు

నా నోముల పంటవు, నేను నీకేమి బోధింపగలను! (సామెతలు 31:2).

## సామెతలు - సేకరణం, అధ్యయనం

సామెతల ప్రయోజనాన్ని మానవులు ప్రాచీన కాలంలోనే గుర్తించారు. అందువలననే ఈ సిద్ధాంత వ్యాసంలో ఇంతకు ముందే చూచిన విధంగా (పుట 29) పిల్లల, యువకుల ఉపదేశానికి క్రీస్తు పూర్వం 2450 నాటికి ఈజిప్టులోను,

క్రీస్తు పూర్వం 10 వ శతాబ్దానికి ఇస్రాయేలులోను రాజాస్థాన పండితులు సామెతలను రూపొందించారు. మన దేశంలో వైదిక ఋషుల మాటలలో సామెతలు చోటు చేసుకున్నాయి. ప్లేటో, అరిస్టోటిల్, యేసుక్రీస్తు మొదలైనవాళ్ళు తమ ధార్మిక ప్రసంగాలలో సామెతలను వాడుకున్నారు.

గ్రీకు సామెతలను సేకరించిన అరిస్టోటిల్ ప్రపంచంలోనే మొట్టమొదటి శాస్త్రీయ సంకలనకారుడిగా ప్రసిద్ధి చెందాడు. జాన్ హేవుడ్ (John Haywood) 1546 లో రచించిన 'ఏ డైలాగ్ ఆఫ్ ప్రోవెర్బ్స్' – సామెతలలోనే కావ్యం వ్రాసే సంప్రదాయానికి మార్గదర్శకమయ్యింది. చాంపియన్ సంకలనం చేసిన 'Racial Proverbs' అనే గ్రంథం చాలా విలువైనది. ప్రపంచపు నలుమూలల నుండి వేలకొలది సామెతలను సేకరించి, వాటిని ఇంగ్లీషులోనికి అనువదించి విలువైన పీఠికతో చాంపియన్ దీనిని ప్రచురించాడు. జర్మన్ సామెతల క్షేత్రంలో కార్ల్ వాండర్ సేవ చిరస్మరణీయమైనది. 1880 లో ఆయన సంకలనం చేసిన ఐదు సంపుటాలలో ఒక్కొక్కదానిలో 50,000 సామెతలున్నాయి.[34]

మన దేశంలో తమిళంలో ప్రాచీన సాహిత్యమైన సంగ కాలంలోనే – క్రీస్తు శకం సుమారు 500 నాటికి – 'పళిమొళి నానూరు' (నాలుగు వందల సామెతలు) అనే గ్రంథం వెలువడడం గమనించదగినది.[35] ఆధునిక కాలంలో భారత దేశంలో సామెతల రంగంలో కృషి చేసినవారిలో పాశ్చాత్యులే ఆద్యులు. రెవరెండ్ మార్టిన్ 1832 లో ప్రచురించిన వంగ సామెతల పుస్తకమే భారతీయ భాషలలో మొట్టమొదటి సామెతల సంకలనమని పండితుల అభిప్రాయం. 1881 లో గుర్డన్ కొన్ని అస్సామీ సామెతలను ప్రచురించాడు. 1894 లో కన్నడ–ఇంగ్లీషు నిఘంటువును ప్రచురించిన కిట్టెల్ అర్థ వివరణం చేసేటప్పుడు వాడిన సామెతల సఖ్య 4000 కు పైబడి ఉన్నది. వీటిని ఒకచోట చేర్చి రాగౌ 1969లో ఒక సంకలనంగా ప్రచురించారు.[36]

---

[34] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 182-84

[35] A. Benjamin, the Proverbs in Hebrew and Tamil Literatures, University of Madras, Chennai, p.2

[36] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 183-185

జానపద విజ్ఞానంలోని అన్ని విభాగాలలాగే సామెతల విషయంలో కూడా అధ్యయనం సక్రమంగా జరుగవలసి ఉన్నది. అందుకోసం 1944 లో American Dialect Society కి అనుబంధంగా Proverbial Sayings Committee ఏర్పడింది. సామెతల అధ్యయనానికి ఈ సంస్థ చేస్తున్న కృషి మహత్తరమైనది.[37]

## తెలుగు సామెతలు – సేకరణం, పరిశోధనం

తెలుగు సామెతలను మొట్టమొదట సంకలనం చేసిన ఘనత ఎం. డబ్ల్యు. కార్ అనే పాశ్చాత్యుడిది. 1868లో "ఆంధ్ర లోకోక్తి చంద్రిక" పేరిట ఆయన సంకలనం చేసిన గ్రంథంలో 2,700 తెలుగు సామెతలు, వాటికి సమానార్థకాలైన 702 యూరోపియన్ సామెతలు; 488 సంస్కృత లోకోక్తులూ, వాటికి సమానార్థకాలైన 771 యూరోపియన్ సామెతలూ వర్ణక్రమంలో ఉన్నాయి. దీనిని క్రిస్టియన్ నాలెడ్జ్ సొసైటీ, మద్రాసువారు ప్రచురించారు. నాటి నుండి నేటి వరకు తెలుగు సామెతల సంకలన యజ్ఞం కొనసాగుతూనే ఉంది.

1979–80 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదువారు "తెలుగు సామెతలు – సాంఘిక జీవనం" అనే విషయాన్ని పరిశోధనాంశంగా నిర్ణయించి పోటీలు నిర్వహించారు. ఆ పోటీలో నెగ్గి, బహుమతి నందుకొన్న డాక్టరు పాపిరెడ్డి నరసింహారెడ్డి గారు అందుకు చేసిన పరిశోధన బహుశః అపూర్వమైనదే కాక అనితర సాధ్యమైనది కూడా. డాక్టరు నరసింహారెడ్డి గారి ఈ గ్రంథాన్ని 1983లో "తెలుగు సామెతలు – జనజీవనం" పేరిట శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి, వారు ప్రచురించారు. తెలుగు సామెతల సేకరణం, అధ్యయనాలకు సంబంధించినంత వరకు ఇంతకు మించిన ప్రామాణిక గ్రంథం లేదంటే బహుశః అతిశయోక్తి కాదు.

ఈ గ్రంథం పట్టిక నంబరు 1లో [38] డాక్టరు నరసింహారెడ్డిగారు తెలుగు సామెతల ఆకరాలను ఆరు రకాలుగా విభజించారు. అవి: 1. తెలుగు సామెతల సంకలన గ్రంథాలు, 2) తెలుగు సామెతల ప్రయోగ దృష్టితో పుట్టిన రచనలు, 3) తెలుగు సామెతలు ఏక దేశంగా ఉన్న గ్రంథాలు, 4) తెలుగు సామెతలను ప్రచురించిన పత్రికలు, బులెటిన్‌లు, 5) గ్రంథాలు, పీఠికలు, వ్యాసాలు, 6) వ్యక్తుల సేకరణ.

---

[37] ఆర్వీయస్ సుందరం, ఆంధ్రుల జానపద విజ్ఞానం, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, హైదరాబాదు, 1983, పు. 184-185

[38] పాపిరెడ్డి నరసింహారెడ్డి, తెలుగు - సామెతలు - జనజీవనం, శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి, 1983, పట్టిక నెంబరు 1

మొదటి రకానికి చెందిన ఆకరాలలో నరసింహారెడ్డిగారు 1868లో ప్రచురించిన ఎం. డబ్ల్యు. కార్ గారి 'ఆంధ్ర లోకోక్తి చంద్రిక' నుండి 1980లో ప్రచురించిన పండిత శ్రీ ఏలూరి సీతారామ్‌గారి 'తెలుగు సామెతలు' వరకూ ఉన్న 16 తెలుగు సామెతల సంకలన గ్రంథాలను గుదిగూర్చి, వీటన్నిటిలో 27,384 తెలుగు సామెతలున్నాయనీ, పునరుక్తులను ప్రక్కనపెట్టి వీటి నుండి 12,382 తెలుగు సామెతలను తన పరిశోధనకు స్వీకరించానని పేర్కొన్నారు.

రెండవ రకానికి చెందిన ఆకరాలలో ఆంధ్ర లోకోక్తి పంచాశత్తు, శకున పక్షి, ఉన్నమాట వినరా! అను మూడు రచనలలో 244 తెలుగు సామెతలు ఉండగా తన పరిశోధనకు మూడు సామెతలను స్వీకరించినట్లు పేర్కొన్నారు.

మూడవ రకానికి చెందిన ఆకరాలలో 1852 లో ప్రచురించిన సి.పి.బ్రౌన్ తెలుగు – ఇంగ్లీషు నిఘంటువు నుండి 1980 లో ప్రచురించిన రాయల బాలబోధిని వరకు ఉన్న గ్రంథాలను తొమ్మిదింటిని పేర్కొని వీటిలో మొత్తం 6,631 తెలుగు సామెతలుండగా తన పరిశోధనకు వాటి నుండి 1,203 సామెతలను నరసింహారెడ్డి గారు స్వీకరించారు.

నాలుగవ రకానికి చెందిన ఆకరాలలో 1972 జనవరి – డిసెంబరులలో ప్రచురించిన "శ్రీ దైవ సమాజిని అను పురుషార్థ ప్రదాయిని" మాసపత్రిక సంచికల నుండి 1980 జూన్ – సెప్టెంబరు 'జానపదం' త్రైమాసిక పత్రిక సంచిక వరకు ఉన్న పత్రికలు, బులెటిన్‌లలో 2,553 తెలుగు సామెతలుండగా తన పరిశోధనకు 462 సామెతలను నరసింహారెడ్డిగారు గ్రహించారు.

అయిదవ రకం ఆకరాలకు చెందిన నాలుగు గ్రంథాలు, పీఠికలు, వ్యాసాలలో 423 తెలుగు సామెతలుండగా తన పరిశోధనకు వాటి నుండి 95 సామెతలను ఆయన ఎంచుకొన్నారు.

ఆరవ రకానికి చెందిన వ్యక్తుల సేకరణలో సి.పి. బ్రౌన్, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి (వేటపాలెం లైబ్రరీలో కార్డుల రూపలో ఉన్నవి), బంగోరె, పాపిరెడ్డి నరసింహారెడ్డి, ఎలవర్తి చంద్రమౌళిలు సేకరించినవి 3,315 సామెతలుండగా నరసింహారెడ్డిగారు 1,135 సామెతలను వాటి నుండి తన పరిశోధనకు స్వీకరించినట్లు పేర్కొన్నారు.

ఈ విధంగా నరసింహారెడ్డిగారు 1852–1980 మధ్య కాలానికి చెందిన పైని పేర్కొనిన ఆరు రకాల ఆకరాల నుండి సేకరించిన మొత్తం తెలుగు సామెతలు 40,550. వీటిలో పునరుక్తులను పరిహరించి ఆయన తన పరిశోధనకు స్వీకరించినవి 15,280. ప్రస్తుత పరిశోధనకు స్వీకరించిన తెలుగు సామెతలన్నీ దానిలోనివే.

ఈ గ్రంథం తరువాత వెలువడిన తెలుగు సామెతల సంకలనాలు:
1) రాజేశ్వరరావు, పి, తెలుగు సామెతలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1993

2) గోపి – సుధ, తెలుగు సామెతలు, పల్లవి పబ్లికేషన్స్ విజయవాడ, 2000
3) గోపాలకృష్ణ, రెంటాల, తెలుగు సామెతలు, నవరత్న బుక్ సెంటర్ విజయవాడ, 2002
4) గీతికా శ్రీనివాస్, తెలుగు సామెతలు, జె.పి. పబ్లికేషన్స్, విజయవాడ, 2002
ఆకారాది క్రమంలో వచ్చిన ఈ సంకలనాలలోని సామెతలన్నీ పైని పేర్కొన్న ఆకరాలలో ఉన్నవే కావడం ఇక్కడ గమనార్హం.

## తెలుగు సామెతలపై పరిశోధన

జానపద విజ్ఞాన వచన వాఙ్మయంలో ధ్రువతారగా వెలిగే సామెతల వాఙ్మయంపై తెలుగులో మొదటిగా పరిశోధన చేసిన ఘనత డాక్టరు చిలుకూరి సుబ్రహ్మణ్య శాస్త్రి గారిది. కె.వి.ఆర్. నరసింహం గారి పర్యవేక్షణలో “ఆంధ్ర సాహిత్యంలోని సామెతలు, నుడికారాలు” మీద సాగిన ఈ పరిశోధనకు ఆంధ్ర విశ్వ కళాపరిషత్తు 1963 లో పిహెచ్.డి. పట్టాన్ని ప్రదానం చేసింది. అయితే ఈ గ్రంథం ఇంకా ప్రచురితం కాలేదు.

తెలుగు సామెతల మీద ఆ తరువాత పరిశోధన చేసినవారు డాక్టరు బొందుగులపాటి దామోదరరావు గారు. నాయని కృష్ణకుమారి గారి పర్యవేక్షణలో ఈయన 1978లో “తెలుగు జానపదుల సామెతలు” మీద పరిశోధన చేసి ఎం.ఫిల్ పట్టాను, “తెలుగు సామెతలు – జానపద సంస్కృతి” మీద పరిశోధన చేసి 1985లో పిహెచ్.డి పట్టాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొందారు. ఈయన ఈ రెండు పరిశోధనా గ్రంథాలలో తెలుగు సామెతలను కుటుంబం, సాంఘిక జీవనం, శాస్త్ర విజ్ఞానం, కథలు, తులనాత్మక పరిశీలన, భాషా విశేషాలు మొదలగు కోణాల నుండి పరామర్శించారు.

బి. ఛాయ గారు పాపిరెడ్డి నరసింహారెడ్డి గారి పర్యవేక్షణలో "తెలుగు సామెతలలో స్త్రీ" మీద పరిశోధన చేసి 1980లో ఎం.ఫిల్ పట్టాను, 1982లో "తెలుగు సామెతలలో స్త్రీ చిత్రణ" మీద పరిశోధన చేసి పిహెచ్.డి. పట్టాను శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పొందారు. ఈ రెండు పరిశోధనలలోను ఈమె తెలుగు సామెతలలో కనిపించే స్త్రీమూర్తిని దర్శించారు.

చెల్లబోయిన రవికుమార్ "తెలుగు - తమిళ సామెతలు" మీద తులనాత్మక పరిశోధన చల్లా రాధకృష్ణ శర్మ గారి పర్యవేక్షణలో చేసి 1988 లో మధురై విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్ పట్టాను స్వీకరించారు. దైవం, అనుభవం, కుటుంబం, అమాయకత్వం, ఆడంబరం, అప్పు, జంతువులు, నీతి అనే ఎనిమిది ఉపశీర్షికల క్రింద ఈయన తెలుగు, తమిళ సామెతలను తులనాత్మకంగా విశ్లేషించారు.

"తెలుగు-కన్నడ సామెతల తులనాత్మక అధ్యయనం" మీద ఆర్వియస్ సుందరం గారి పర్యవేక్షణలో పరిశోధన చేసి 1990 లో మైసూరు విశ్వవిద్యాలయం నుండి పి.ఎన్. గోపాలకృష్ణగారు పిహెచ్.డి. ని "ఆదోని తాలుకూ తెలుగు-కన్నడ సామెతలు (తులనాత్మక పరిశీలన)" మీద పరిశోధన చేసి కె. సంజన్నగారు 1992 లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్. పట్టాను, "తెలుగు-కన్నడ సామెతలు (తులనాత్మక అధ్యయనం)" మీద పి.యల్. శ్రీనివాస రెడ్డిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి కె.రామాంజనేయులు గారు 1996లో శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాను పొందారు.

డాక్టరు ఎన్. భాస్కర్‌గారు వి. ఆనందమూర్తిగారి పర్యవేక్షణలో "తెలుగు సామెతలు - ద్రావిడ భాషలతో తులనాత్మక పరిశీలన" మీద పరిశోధన చేసి, 1982లో ఎం.ఫిల్. పట్టాను, "తెలుగు-మళయాళ సామెతలు: కుటుంబ జీవన చిత్రణ" మీద పరిశోధన చేసి 1991 లో పిహెచ్.డి. పట్టాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పొందారు.

"తెలుగు సామెతలు - భాషా పరిశీలన" మీద ఎస్. అక్కిరెడ్డిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి కె. శ్యామలగారు 1982 లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్. పట్టాను పొందగా, "తెలుగు సామెతలు - జీవన ప్రతిబింబాలు" మీద పి.ఎల్. శ్రీనివాసరెడ్డిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి 1987లో వై. కృష్ణారెడ్డి ఎం.ఫిల్ పట్టాను పొందారు. తమ పరిశోధనలో యర్రగుంట్ల కృష్ణారెడ్డిగారు తెలుగు సామెతలలోని జీవన ప్రతిబింబాలను దర్శించారు.

"తెలుగు సామెతలు – మానవ స్వభావం" మీద పి.యల్ శ్రీనివాసరెడ్డి గారి మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి 1987 లో బి. రామాచార్యులు శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం నుండి ఎం.ఫిల్. పట్టాను స్వీకరించారు. తన పరిశోధనలో రామాచార్యులుగారు మానవ స్వభావం, భిన్న స్వభావాలకు మూల కారణాలను చర్చించి, సహజాతకాలైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరాలు తెలుగు సామెతలలో కనిపించే తీరును వివరించారు.

వి. ఆనందమూర్తిగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "తెలుగు సామెతలలో సంఘ చిత్రణ"కు 1977లో ఎం.ఫిల్ పట్టాను, "తెలుగు సామెతలు – విమర్శనాత్మక అధ్యయనం"కు 1992లో పిహెచ్.డి పట్టాను టి.వి. రామనరసయ్యగారు పొందారు. ఈయన 1994లో తన పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించారు. రామ నరసయ్యగారు తమ పరిశోధనలో ప్రాచీన, ఆర్వాచీన తెలుగు సాహిత్యంలో చోటుచేసుకున్న సామెతలతోపాటు, శతకం, జానపద గేయాలలోని సామెతలను పరిశీలించారు. వాటిని కుటుంబం, వర్ణ వ్యవస్థ, పురుషార్థాలు, వృత్తులు, చదువు–సంస్కారములకు సంబంధించిన సామెతలుగా వింగడించి చర్చించారు.

బొడ్డుపల్లి పురుషోత్తంగారి మార్గదర్శకత్వంలో పరిశోధన చేసి నాగార్జునా విశ్వవిద్యాలయం నుండి "రైతు సామెతల సమీక్ష"ను 1987లో ఎం.ఫిల్. పట్టాను, "సాగుబడి నుడులు – నానుడులు" కు 1990 లో పిహెచ్.డి. పట్టాను వెల్లంకి వేంకట నర్సయ్యగారు పొందారు. ఈయన తన పరిశోధనలో తెలుగు సామెతలలోని కార్తెలు, వాన సామెతలు, పంట సామెతలు, పాడి సామెతలు, హెచ్చరిక సామెతలు మొదలగువానిని వివరించి, రైతు సామెతలలోని ఛందోవ్యాకరణాలంకార విశేషాలను విశదీకరించారు.

"వ్యవసాయ సామెతలలో స్త్రీల నమ్మకాలు" మీద ఆర్. తిరుమలరావుగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి 1993లో పి. సుశీలగారు ఎం.ఫిల్. పట్టాను పొందగా, ఆర్వీయస్ సుందరంగారి పర్యవేక్షణలో "సామెతలు – సందర్భాలు" మీద పరిశోధన చేసి అదే సంవత్సరం అదే విశ్వవిద్యాలయం నుండి బి. తిరుపతిరావుగారు ఎం.ఫిల్. పట్టాను పొందారు.

"తెలుగు సామెతలలో నమ్మకాలు – ఒక పరిశీలన" మీద ఎన్. మునిరత్నమ్మగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి జె. సత్యభూషణ రాణి 1997లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పట్టాను పొందారు.

పొన్నా లీలావతమ్మగారి పర్యవేక్షణలో పరిశోధన చేసి రామనాథం వెంకట శివప్రసాద్ 'అన్నమయ్య సంకీర్తనల్లో సామెతలు – సమన్వయం"కు ఎం.ఫిల్. పట్టాను, "అన్నమయ్య సంకీర్తనల్లో సామెతలు – వర్గీకరణ సమన్వయం" కు పి.హెచ్‌డి. పట్టాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుండి పొందారు. శివ ప్రసాద్ గారు తన పరిశోధనలో అన్నమయ్య సంకీర్తనలలోని వైద్య సంబంధిత సామెతలు, పడుపు వృత్తికి సంబంధించిన సామెతలు, కుల సంబంధి సామెతలు, వ్యాపార సంబంధి సామెతలు మొదలగువానిని సవివరంగా విశదీకరించారు.

తెలుగు సామెతల పరిశోధనలో 1979–80 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు "తెలుగు సామెతలు – సాంఘిక జీవితం" అనే అంశం మీద నిర్వహించిన పోటీ ఒక ముఖ్యమైన మైలురాయి. ఈ పోటీలో నెగ్గినవారు, ఇంతకు ముందే చెప్పిన విధంగా, డాక్టరు పాపిరెడ్డి నరసింహారెడ్డిగారు. ఈయన దీని కోసం రచించిన పరిశోధనా గ్రంథం "తెలుగు సామెతలు – జన జీవనం."

ఈ గ్రంథంలో నాలుగు ప్రకరణాలున్నాయి. మొదటి ప్రకరణంలో 'తెలుగు సామెతల స్వరూప స్వభావాల'ను చర్చించారు రచయిత. దీనిలో భాగంగా సామెతల నిర్వచనం, లక్షణాలు, పుట్టుక, కాల నిర్ణయం, పాఠాంతరాలు, సామెతల వ్యాప్తి, ప్రయోజనం మొదలగు విషయాలను విశదీకరించారు. రెండవ ప్రకరణం 'తెలుగు సామెతలు – కుటుంబ జీవన చిత్రణం.' కుటుంబ సభ్యుల మధ్య ఉండే సంబంధ బాంధవ్యాలను సాధ్యమైనన్ని కోణాల నుండి ఈ ప్రకరణం దర్శించింది. మూడవ ప్రకరణం 'తెలుగు సామెతలు – సాంఘిక జీవన చిత్రణం.' దీనిలో వృత్తి, కులం, ఆహారపుటలవాట్లు, వ్యాపారం, నాణేలు, కొలతలు, పరిపాలన–న్యాయం అనేవి ఉప ప్రకరణాలు. నాలుగవ ప్రకరణం 'తెలుగు సామెతలు – సాంస్కృతిక జీవన చిత్రణం.' సంస్కృతి వ్యక్తి జీవితంలో ఎలా ప్రతిబింబిస్తుందో ఈ ప్రకరణంలోని విద్య, వైద్యం, వినోద విలాసాలు–ఆటలు, ఆచార వ్యవహారాలు, నమ్మకాలు, వస్త్రభూషణాలంకరణలు అనే ఉపప్రకరణాలు విశదీకరిస్తాయి.

పైని పేర్కొనిన పోటీ పర్యవసానంగా ప్రచురితమైన గ్రంథాలు మరికొన్ని ఉన్నాయి. వాటిలో పేర్కొనదగినది డాక్టరు బి.యస్. మోహన్‌గారు రచించిన "సామెతలలో సాంఘిక జీవితం" అన్న గ్రంథం. దీనిలో అయిదు అధ్యాయాలున్నాయి. మొదటిది తెలుగు సామెతలలోని సాంఘిక జీవితాన్ని చిత్రిస్తుంది. రెండవ అధ్యాయం కౌటుంబిక

జీవితాన్ని వివరిస్తుంది. మూడవది వ్యావసాయిక జీవితాన్ని వర్ణిస్తే, నాలుగవ అధ్యాయం వ్యక్తుల మనస్తత్వాలను, అయిదవ అధ్యాయం జాతులు, వృత్తులను విశదీకరిస్తాయి. ఈయనే "తెలుగు కన్నడ సామెతలు – సమానార్థకాలు" అనే మరో గ్రంథంలో రెండు భాషలకు చెందిన సమానార్థక సామెతలను వివరించారు.

పి. సరళాదేవిగారు తమ "తెలుగు సామెతలు – సాంఘిక చరిత్ర" అనే గ్రంథంలో తెలుగు సామెతలను 1) మానవ చరిత్రకు, 2) పశుపాలనకు, 3) వ్యవసాయానికి, 4) వృత్తులకు, 5) కుటుంబానికి, 6) సాహిత్యానికి సంబంధించిన సామెతలుగా వింగడించి ఆరు అధ్యాయాలలో వాటిని విశదీకరించారు.

ప్రస్తుత పరిశోధన "తెలుగు, బైబులు సామెతలు – ఒక తులనాత్మక పరిశీలనం" తెలుగు సామెతలకు, బైబులులో ఆద్యంతం కనిపించే సామెతలకు సంబంధించినది.

బైబులు సామెతలు యూదులకు సంబంధించినవి. వాటిని అధ్యయనం చేయడానికి యూదుల సంస్కృతీ సంప్రదాయాల పట్ల అవగాహన అవసరం. ఈ అవగాహనను ఏర్పరచుకోవడానికి నాకు ఉపకరించినవి Encyclopaedia Judaica, New Encyclopaedia Britanica లు.

బైబులును సమగ్రంగా అర్థం చేసుకోవడానికి, అధ్యయనం చేయడానికి బాగా ఉపయోగపడేవి బైబులు మీద వచ్చిన అనేక వ్యాఖ్యానాలు. ఈ వ్యాఖ్యాతలు తలపండిన పండితులు. ఈ వ్యాఖ్యానాలు వ్యాఖ్యాతల విస్తృత పరిశోధనా ఫలితాలు. బైబులులోని సామెతలను, ముఖ్యంగా జ్ఞాన గ్రంథాలలోని సామెతలను అధ్యయనం చేయడానికి నాకు సహాయపడిన వ్యాఖ్యానాలు : Anchor Bible Dictionary, Interpreter's Bible, Interpreter's Dictionary of Bible, New Jerome Biblical Commentary, New Catholic Commentary on the Holy Scripture, Torch Bible Commentary.

ఇవే కాకుండా ఈ పరిశోధనకు బైబులు సామెతల మీద వచ్చిన అనేక గ్రంథాలలో నేను చదివినవి :

* 'Man's Destiny in the Books of Wisdom' by Beaucamp, E.

  ఈ పుస్తకం పేరు సూచిస్తున్నట్టుగా ఇది బైబులులోని జ్ఞాన గ్రంథాలలో కనిపించే మానవ జీవిత గమ్యాన్ని పలు కోణాల నుండి తెలియజెపుతుంది.

* 'Old Testament Message : Proverbs' by Dermot Cox.

ఈ పుస్తకం బైబులులోని విజ్ఞాన బోధలకున్న చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని పరిచయం చేస్తూ, జ్ఞాన గ్రంథాలలోని సందేశాన్ని వివరిస్తుంది.

* 'The Proverbs : An Introduction and Commentary' by Kinder, D.

1964 లో ప్రచురితమైన ఈ పుస్తకం బైబులులోని సామెతల గ్రంథాన్ని సంగ్రహంగా పరిచయం చేస్తూ దాని మీద వ్యాఖ్యానం చెబుతుంది.

* 'Proverbs: A New Approach' by McKane, W.

అంతర్జాతీయ జ్ఞాన సాహిత్యాన్ని స్థూలంగా పరిచయం చేస్తూ బైబులులోని సామెతల గ్రంథాన్ని ఉపదేశపు కోణం నుండి క్రొత్తగా అధ్యయనం చేస్తుంది ఈ పుస్తకం.

* 'Seven Books of Wisdom' by Murphy, R.E.

ఈ పుస్తకం బైబులులోని ఏడు జ్ఞాన గ్రంథాల మీద వ్యాఖ్యానం చెబుతుంది. ఆ యా గ్రంథ రచయితల ముఖ్యోద్దేశాలను కూడా ఈ పుస్తకం వివరిస్తుంది.

* 'Israel's Wisdom Literature: Its Bearing on Theology and History of Religion' by Rankin, S.

బైబులులోని జ్ఞాన గ్రంథాలు యూదుల దైవ శాస్త్రం, ధార్మిక చరిత్రల మీద చూపిన ప్రభావాన్ని చర్చించడానికి ఈ పుస్తకం ప్రయత్నిస్తుంది.

* 'The Way of Wisdom in the Old Testament' by Scott, B.Y.

యూదుల జ్ఞాన సాహిత్యాన్ని సమగ్రమైన, సుదీర్ఘమైన పీఠికతో పరిచయం చేస్తూ బైబులులోని ఏడు జ్ఞాన గ్రంథాలలోని ముఖ్య భాగాలను ఈ పుస్తకం వివరిస్తుంది.

* 'Wisdom in Israel' by Von Rad

బైబులులోని జ్ఞాన సాహిత్యం మీద వెలువడిన అత్యుత్తమ పుస్తకమని దాదాపు పండితులందరు ఒప్పుకొనే గ్రంథమిది. బైబులు జ్ఞాన సాహిత్యం యొక్క చారిత్రక సాంస్కృతిక నేపథ్యాన్ని, దాని లక్షణాలను, పరిధిని ఈ పుస్తకం సమగ్రంగా వివరిస్తుంది.

* 'The Book of Proverbs' by Whybray, R.N.

విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బైబులులోని సామెతల గ్రంథాన్ని పరిచయం చేస్తూ అందరికీ అర్థమయ్యే రీతిలో ఆ గ్రంథం మీద వ్యాఖ్యానం చెబుతుంది ఈ పుస్తకం.

తెలుగులో ఇప్పటివరకు బైబులు సామెతలమీద ఒకే ఒక పరిశోధన జరిగింది. అది మన్నెం వసుంధర గారు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఎండ్లూరి సుధాకరరావు గారి పర్యవేక్షణలో ఎం.ఫిల్. కోసం “సొలోమోను సామెతలు – సామాజిక నీతి” మీద చేసిన పరిశోధన. తన సిద్ధాంత వ్యాసంలో ఈమె సొలోమోను రాజు జీవితాన్ని, సాహిత్యాన్ని, ఆనాటి సామాజిక పరిస్థితులను పరిచయం చేసి, బైబులులో ఉన్న సొలోమోను సామెతలలోని సామాజిక నీతిని ఆవిష్కరించారు.

ఎ. బెంజమిన్ గారు పిహెచ్.డి. పట్టా కొరకు మద్రాసు విశ్వవిద్యాలయంలో “The Proverbs in Hebrew and Tamil Literature” మీద పరిశోధన చేశారు. తెలుగుకు సాటి ద్రావిడ భాష అయిన తమిళ సామెతల మీద, హీబ్రూ సామెతల మీద, ఆంగ్లంలో జరిగిన తులనాత్మక పరిశోధన ఇది.

తమ పరిశోధనలో భాగంగా ఈయన బైబులులోని హీబ్రూ సామెతలను కూడా పరామర్శించారు. రెండు భాషలలోని పొడుపు కథలను కూడా తమ పరిశోధనా పరిధిలో చేర్చారు. ఈయన తమ పరిశోధనా వ్యాసంలో జానపద విజ్ఞానాన్ని పరిచయం చేసి, సామెతను నిర్వచించి, హీబ్రూ, తమిళ సామెతల లక్షణాలను, పుట్టు పూర్వోత్తరాలను పరిశీలించి, వాటిని తులనాత్మకంగా అధ్యయనం చేశారు.

ఇవీ సామెత, తెలుగు సామెత, బైబులు సామెతలకున్న సంక్షిప్త సైద్ధాంతిక నేపథ్యాలు. ఈ నేపథ్యాలతో తరువాత భాగంలో తెలుగు, బైబులు సామెతలను తులనాత్మకంగా పరిశీలిద్దాం.